శనివారం
06-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 75
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

సంపూర్ణ సహకారం

- ఎన్ని అడ్డంకులున్నా ఇంధన సరఫరా కొనసాగిస్తాం
- రెండుదేశాల మధ్య వ్యూహాత్మక, రక్షణ ఒప్పందాలు జరిగాయి
- ఇకమీదట జాతీయ కరెన్సీలోనే ద్వైపాక్షిక చెల్లింపులు
- భారత్‌లో అతిపెద్ద న్యూక్లియర్ ప్లాంట్ నిర్మాణం
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత్ అభివృద్ధి పథంలో పయనించేందుకు అన్ని విధాలుగా అవసరమైన సహాయం అందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హామీ ఇచ్చారు. ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భారత్-రష్యా కీలక ఒప్పందాలు చేసుకున్నాయి. వలసలు, మొబిలిటీ, వైద్యం, ఆహార భద్రత, ఓడరేవులు, షిప్పింగ్ రంగంలో సహకారంపై అంగీకారానికి వచ్చాయి. ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సమక్షంలో ఇరుదేశాలకు చెందిన ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. అనంతరం పుతిన్, మోదీ కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. పుతిన్ మాట్లాడుతూ అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురవుతున్నప్పటికీ భారత్‌కు నిరంతరాయంగా ఇంధన సరఫరా చేస్తామనిహామీ ఇచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో భాగంగా ఆయిల్, గ్యాస్, బొగ్గు అన్నింటినీ సరఫరా చేస్తామని వెల్లడించారు. భారత అభివృద్ధికి అవసరమైన ప్రతీ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. భారత్- రష్యా స్నేహసంబంధాలకు చారిత్రక నేపథ్యం ఉందని పుతిన్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక భేటీలో ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మోదీ, తాను చర్చించామని చెప్పారు. "ఇంధన రంగంలో కూడా విజయవంతమైన భాగస్వామ్యం ఉంది. భారత ఇంధన రంగం అభివృద్ధికి ఆయిల్, గ్యాస్, బొగ్గుతో సహా అవసరమయ్యే అన్నింటిని సరఫరా చేయడానికి మేము భారత్‌తో వ్యాపార భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాం. వేగంగా ఎకానమీ వృద్ధి చెందుతున్న భారత్‌కు అంతరాయం లేకుండా ఇంధన సరఫరాను కొనసాగించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మేము అతిపెద్ద భారత్‌లో అణు విద్యుత్ కేంద్రాన్ని నిర్మించే ప్రాజెక్టుపై పని చేస్తున్నాం. ఇప్పటికే ఆరు రియాక్టర్లలో మూడింటిని ఇంధన నెట్‌వర్క్‌కు అనుసంధానించాం. మీతో సంతోషంగా ఒకటి పంచుకోవాలని కోరుకుంటున్నాను. ద్వైపాక్షిక చెల్లింపుల కోసం భారత్, రష్యా క్రమంగా జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులుతున్నాయి. వాణిజ్య చెల్లింపులలో దీని వాటా ఇప్పటికే 96 శాతం ఉంది" అని తెలిపారు. వైద్య, వ్యవసాయ రంగాల్లో కలిసి ముందుకెళ్తామని, పరిశ్రమల స్థాపన, ఆధునిక యంత్రాల తయారీలో సహకారం అందిస్తామని, రష్యాలో భారతీయ భాషల చిత్రాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. అణువిద్యుత్ సహా వివిధ రంగాల్లో కీలక ఒప్పందాలు చేసుకున్నామని... రెండు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య ఒప్పందాలు జరిగాయని పుతిన్ వెల్లడించారు.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం

ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని, రెండు దేశాల వాణిజ్యం 64 బిలియన్ డాలర్ల నుంచి వంద బిలియన్ డాలర్లకు పెరగాలని పుతిన్

- మిగతా 2 లో

భారత్, రష్యా స్నేహం శాశ్వతం

కొత్త శిఖరాలకు ఆర్థిక సంబంధాలు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్-రష్యాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే లక్ష్యంతో 2030 ఆర్థిక సహకార కార్యక్రమానికి భారత్-రష్యా అంగీకరించినట్లు ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ఈ రోడ్‌మ్యాప్ ఇరుదేశాల మధ్య ప్రాధాన్య రంగాలు, దీర్ఘకాలిక ఆర్థిక సంబంధాల వృద్ధిలో వేగం పెంచుతుందని చెప్పారు. ఇరుదేశాల మధ్య మార్కెట్లకు ద్వారాలు తెరవటం, వాణిజ్యం పెంచేందుకు వీలుగా

- మిగతా 2 లో

విమానం టికెట్ ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ: నిర్వహణపరమైన లోపాల కారణంగా వందలాది ఇండిగో విమాన సర్వీసులు రద్దవడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. అటు వేలాది మంది విమానాశ్రయాల్లో పడిగాపులు కాస్తుండగా... ఇటు టికెట్ల ధరల మోతతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇండిగో ప్రభావంతో దేశంలో విమాన టికెట్ల ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే టికెట్ ధరలు దాదాపు రెండు, మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే అత్యంత రద్దీ మార్గాల్లో

- మిగతా 2 లో

బ్యాంకుల మనుగడకు ఆలయ డబ్బు వాడొద్దు

న్యూఢిల్లీ: ఆలయాలకు చెందిన డబ్బును ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహకార బ్యాంకులను రక్షించేందుకు ఉపయోగించొద్దంటూ సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆ సొమ్ము పూర్తిగా దేవుడికి చెందినదని తేల్చి చెప్పింది. ఆ నిధులను ఆలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సహకార బ్యాంకులకు ఆదాయవనరుగా లేదా అవి మనుగడ సాగించేందుకు ఆలయ నిధులు ఉపయోగించొద్దని ధర్మాసనం తేల్చి

- మిగతా 2 లో

అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా త్రివిక్రమరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మండలి వెంకట కృష్ణారావు అధికార భాషాసంఘానికి అధ్యక్షుడిగా పి.త్రివిక్రమ రావు నియమితులయ్యారు. ఈ మేరకు యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఇక అధికార భాషా సంఘం చేయాల్సిన కార్యకలాపాలపై కూడా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు భాష వాడుక తీరుపై తనిఖీలు చేయాలని నిర్దేశించింది. తెలుగు భాష

- మిగతా 2 లో

గుత్తాధిపత్యం... నిర్వహణ వైఫల్యం

ఇండిగో సంక్షోభంపై సీపీఐ

తక్షణ, పారదర్శక చర్యలకు డిమాండ్

న్యూఢిల్లీ: ఇండిగో విమానయాన సంస్థలో నెలకొన్న సంక్షోభం గుత్తాధిపత్య పర్యవసానం, నిర్వహణ వైఫల్యంతో ఏర్పడే ప్రమాదాలను బయటపెట్టిందని సీపీఐ వ్యాఖ్యానించింది. 'చాలా ఏళ్లుగా కేంద్ర పౌర విమానాయన శాఖ, కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిసున్నా పట్టించుకోలేదు. పౌర విమానయాన రంగాన్ని గుత్తేదారుల చేతుల్లో పెట్టిన ఫలితంగా నేడు ప్రయాణికుల భద్రతతో రాజీ పడే పరిస్థితి ఏర్పడింది. పైలెట్లు, సిబ్బందిపై భారం పెరిగింది. ప్రజా ప్రయోజనాలు పణంగా ప్రైవేటు విమానయాన సంస్థలు బలోపేతమవుతున్నాయి. ఇండిగో కార్యకలాపాలు స్తంభించడం ఈ ఆందోళలను నిరూపించింది' అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. గుత్తేదారుల చేతుల్లోకి వ్యవస్థ

- మిగతా 2 లో

ఇండిగోతో ఇక్కట్లు

దేశ వ్యాప్తంగా 550 కి పైగా విమాన సర్వీసులు రద్దు

అవస్థలు పడుతున్న ప్రయాణికులు

5లో

గ్లోబల్ సమ్మిట్‌కు రండి

సీఎం చంద్రబాబుకు తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబును నేరుగా ఆహ్వానించడం ఇదే ప్రథమం. గతంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన నీటి వివాదాలపై ఇద్దరు సీఎంలు భేటీ అయినప్పటికీ, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ లో జరుపతలపెట్టిన ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కోమటిరెడ్డి కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన వెంకటరెడ్డి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను దావోస్ సమ్మిట్ తరహాలో నిర్వహిస్తున్నామని

- మిగతా 2 లో

ఓయూ అభివృద్ధికి వెనుకాడం

- విద్యార్థులు, సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం
- చారిత్రక భవనాలను సంరక్షిస్తూనే నూతన నిర్మాణాలు
- 10న విశ్వవిద్యాలయాన్ని సందరిస్తా
- సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలో (ఓయూ) చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, బోధన సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఓయూ అభివృద్ధి పనులపై తన నివాసంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వర్సిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తొలుత అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం పనులకు సంబంధించిన వివిధ మోడళ్ల పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సీఎం వీక్షించారు. హాస్టల్ భవనాలు, రహదారులు, అకడమిక్ బ్లాక్స్, ఆడిటోరియం నిర్మాణాలకు సంబంధించి అనేక మార్పులు, చేర్పులను సీఎం సూచించారు. వర్సిటీ పరిధిలోని అటవీ ప్రాంతంలో పనులకు అర్బన్ ఫారెస్ట్రీ నిధుల వినియోగం అంశాన్ని, ఇప్పటికే ఉన్న జల వనరులను సంరక్షిస్తూనే నూతన జల వనరుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. హాస్టల్, అకడమిక్ భవనాల నిర్మాణం విషయంలో వంద మంది విద్యార్థులుంటే అదనంగా మరో పది శాతం విద్యార్థులకు వసతులు ఉండేలా చూడాలని సీఎం తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్‌లో ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్మాణాలు ఉండాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు వెనుకాడమని ముఖ్యమంత్రి చెప్పారు. వర్సిటీ పరిధిలోని చారిత్రక, వారసత్వ భవనాలను సంరక్షించాలని

- మిగతా 2 లో

ఆర్థికాభివృద్ధికి కీలక భూమిక

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సోనియా గాంధీ సందేశం
- సీఎం రేవంత్‌కు అభినందనలు

విశాలాంధ్ర-హైదరాబాద్ : 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కీలక భూమిక పోషిస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఆశాభావం

- మిగతా 2 లో

ఓయూ, కాకతీయ విద్యార్థుల అక్రమ నిర్బంధం దారుణం

నెల్లికంటి సత్యం

విశాలాంధ్ర-హైదరాబాద్ : మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణకు వెళ్లిన ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులను అక్రమంగా నిర్బంధించడాన్ని సీపీఐ(ఎంఎల్‌సీ) నాయకుడు నెల్లికంటి సత్యం తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఉస్మానియా విద్యార్థులు స్పందిస్తూనే ఉంటారని అన్నారు. అదేవిధంగా మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం కోసం వారు ముందుగానే మావోయిస్టులకు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రికి, ఏపీ డీజీపీకి బహిరంగంగానే లేఖలు

- మిగతా 2 లో

ఏఐ ఎక్సలెన్స్ సెంటర్... ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం

ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) కు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి తెలంగాణా ప్రభుత్వం శుక్రవారం కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణా కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) మొట్టమొదటిది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్‌తో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల బాబు ఎంఓయూ వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. డీకిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్‌స్టిట్యూట్ ఈ ఎక్సలెన్స్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని ఆయన వివరించారు. కళాశాలల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఒప్పందం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలన, ఆరోగ్యం, విద్య, ఐటీ, లైఫ్ సైన్సెస్, వ్యవసాయం, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మెటల్స్ రంగాల్లో పరిశోధన, నైపుణ్య శిక్షణ

- మిగతా 2 లో

గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేయండి

జార్ఖండ్ సీఎంకు డిప్యూటీ సీఎం ఆహ్వానం

విశాలాంధ్ర-హైదరాబాద్ : 'హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ' లో ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు

- మిగతా 2 లో

కేటీఆర్‌ది విషపూరిత ఆలోచన

అయ్య కొడుకు వేల ఎకరాలు ధారాదత్తం చేశారు: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర-హైదరాబాద్ : హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ విమర్శలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిప్పికొట్టారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ ఆరోపణలపై విలేకరులు అడిగిన అనేక ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. హిల్ట్ పాలసీలో రెండు అంశాలు బీఆర్ఎస్ పాలనలో వచ్చినవే, ఆ ఫైల్‌పై మంత్రిగా కేటీఆర్ సంతకం చేసిన సంగతి మరిచారా? గత ప్రభుత్వంలో కోకాపేట, నియోపోలిస్ ప్లాట్లు వేలం వేశారు, హిల్ట్‌ను దోపిడీ పాలసీ అంటున్న కేటీఆర్‌కు ఇవి గుర్తులేవా?, ఓఆర్ఆర్ నిర్వహణను కూడా వేలం వేశారు. అయ్య ముఖ్యమంత్రిగా, కొడుకు పరిశ్రమల శాఖ మంత్రిగా కావలసిన వారి దగ్గర ముడుపులు తీసుకొని భూములను కన్వర్షన్ చేశారు. ప్రభుత్వ భూములు వేలం వేశారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాది ఎకరాలు వేలం వేశారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌బీ నగర్‌లోని దాదాపు 40 ఎకరాల స్థలాన్ని పి.వి.రాజు ఫార్మా కంపెనీకి లీజుకు ఇవ్వడం జరిగింది. అక్కడ కెమికల్ ఫ్యాక్టరీ వల్ల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

జెలెన్‌స్కీ విమాన మార్గంలో ఐదు డ్రోన్లు

డబ్లిన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ఐర్లాండ్‌లో అధికారికంగా పర్యటించారు. డబ్లిన్ విమానాశ్రయంలో జెలెన్‌స్కీ విమానం ప్రయాణించే మార్గంలో ఐదు డ్రోన్లు దగ్గరలో కనిపించాయి. దీంతో ఆయన మార్గాన్ని అడ్డుకునే ప్రయత్నంగా అనుమానాలు వచ్చాయి. అయితే జెలెన్‌స్కీతో పాటు ఉక్రెయిన్ బృందానికి ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితి లేదని, వారి భద్రతకు పూర్తి హామీ ఇస్తున్నామని ఐర్లాండ్ అధికారులు తెలిపారు. డ్రోన్లను గుర్తించడం వాస్తవమేనని అంగీకరించారు. ఐరిష్ నేవీ నౌక వీటిని గుర్తించినట్లు ధ్రువీకరించారు. కొద్ది నిమిషాలు ముందుగానే జెలెన్‌స్కీ విమానం చేరుకోవడంతో ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. రష్యాతో యుద్ధంలో యూరప్ సహకారాన్ని పెంచే దిశగా కసరత్తులో భాగంగా జెలెన్‌స్కీ ఐర్లాండ్‌లో పర్యటించారు.

30కి పైగా దేశాలపై అమెరికా ప్రయాణ నిషేధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణ నిషేధాన్ని 30కుపైగా దేశాలకు విస్తరించబోతున్నారు. ఇదే విషయాన్ని హోంల్యాండ్ భద్రతా కార్యదర్శి క్రిస్టీ నోయిమ్ తెలిపారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ 'అవును, ట్రంప్ ప్రయాణ నిషేధాన్ని మరిన్ని దేశాలకు విస్తరించబోతున్నారు. కచ్చితంగా ఇన్ని దేశాలని చెప్పను కానీ ఆ సంఖ్య 30కుపైగా ఉందని మాత్రం చెప్పగలను' అని క్రిస్టీ అన్నారు. 12 దేశాల పౌరులను తమ దేశ ప్రవేశాన్ని నిషేధిస్తూ ఈ ఏడాది జూన్‌లో ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. మరో ఏడు దేశాల పౌరులనూ కట్టడి చేశారు. విదేశీ ఉగ్రవాదుల నుంచి తమ దేశాన్ని, దేశ పౌరులను కాపాడుకోవడం కోసం భద్రతా ముప్పు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమర్థించుకున్నారు. ఇమ్మిగ్రెంట్లు, నాన్ ఇమ్మిగ్రెంట్లకు అంటే పర్యాటకులు, విద్యార్థులు, వ్యాపారం కోసం వచ్చేవారికి కూడా ఈ నిషేధాలు వర్తిస్తాయని చెప్పారు. కాగా, క్రిస్టీ నోయిమ్ ఏయే దేశాలపై ప్రయాణ నిషేధం విధించారో చెప్పలేదు. సుస్థిర పరిపాలన లేని దేశాల పౌరులకు అమెరికా ప్రవేశం నిషేధమని మాత్రం చెప్పారు. అలాంటి దేశాల పౌరులను అమెరికాలోకి ఎందుకు అనుమతించాలని క్రిస్టీ నోయిమ్ ప్రశ్నించారు. కాగా, 36 దేశాల పౌరులను నిషేధించే యోచనలో అమెరికా ఉన్నట్లు అంతర్గత సమాచారమంటూ రాయిటర్స్ ఇటీవల నివేదించింది.

2021లో అమెరికా వచ్చిన అఫ్గాన్ పౌరుడు ఈ మధ్య కాలంలో కాల్పులు జరిపిన నేపథ్యంలో ట్రంప్ యంత్రాంగం పేద దేశాల పౌరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలోని దేశాల సంఖ్యను క్రమంలో పెంచుతూ పోతోంది. ఇంతకుముందు 19 దేశాలు ఈ జాబితాలో ఉంటే ఇప్పుడు సంఖ్య 30 దాటిపోయింది

పాక్ తొలి సీడీఎఫ్ అసీమ్ మునీర్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్)గా సైన్యాధికారి, ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ నియమితులయ్యారు. ఆయన ఐదేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. మునీర్ నియామకాన్ని అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఆమోదించారు. భద్రతా దళాల మధ్య ఐక్యత, క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకుగాను సీడీఎఫ్ పోస్టును సృష్టించడం కోసం రాజ్యాంగానికి జరిగిన 27వ సవరణను పాకిస్థాన్ పార్లమెంటు గత నెలలో ఆమోదించింది. చైర్మన్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీజేసీఎస్‌సీ) స్థానంలో సీడీఎఫ్ ఉంటారు. కొత్త పదవీ బాధ్యతలు చేపట్టబోతున్న మునీర్‌కు అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలిపినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అదే విధంగా ఎయిర్ చీఫ్ మార్షల్ జహీర్ పదవీ కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగించడానికీ జర్దారీ అంగీకారం తెలిపారు. మునీర్ 2022, నవంబరులో సీఓఏఎస్‌గా నియమితులయ్యారు. తొలుత మూడేళ్ల కోసం ఆయన ఈ పదవీని చేపట్టారు కానీ ఆ తర్వాత పదవీ కాలాన్ని ఐదేళ్లకు పొడిగించారు. ఇది 2024లో జరిగింది. అయితే చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ నియామకానికి సంబంధించి న్యాయపరంగా, రాజకీయపరంగా ఎలాంటి సమస్యలుగానీ ఆటంకాలుగానీ లేవని న్యాయ శాఖ మంత్రి ఆజమ్ నజీర్ తరార్ ఇంతకుముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు.

చైనాలో భూకంపం

బీజింగ్: చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతంలో 6.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. కిర్గిస్థాన్ సరిహద్దు వెంబడి భూ ప్రకంపనలు నమోదైనట్లు చైనా భూకంపాల నెట్‌వర్కుల కేంద్రం (సీఈఎన్‌సీ) తెలిపింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.44 గంటల సమయంలో కిర్గిస్థాన్-జిన్జియాంగ్ సరిహద్దు సమీపంలో అక్కి కౌంటీ దగ్గర 10 కిమీల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. సాయంత్రం 4.34 గంటల వరకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రవాణా, విద్యుత్, టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలకు ఆటంకం కలగలేదని అన్నారు.

చికిత్స కోసం లండన్‌కు ఖలీదా

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను లండన్‌కు తరలించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమె తనయుడు, బీఎన్‌పీ తాత్కాలిక చైర్‌పర్సన్ తారిక్ రెహమాన్ లండన్‌లోనే నివాసముంటున్నారు. ఆయన భార్య జుబేదా రెహమ్మాన్ ఓ డాక్టర్. ఆమె త్వరలో ఢాకా చేరుకోనున్నారు. వచ్చిన వెంటనే ఖలీదా జియాను లండన్‌కు తీసుకెళ్లే ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటారని స్థానిక మీడియా పేర్కొంది. ఢాకా ఆసుపత్రిలో చికిత్స పొందున్న ఖలిదా జియా ఆరోగ్య పరిస్థితిని స్వయంగా సమీక్షించిన తర్వాత ఆమెను లండన్‌కు తీసుకెళ్లే విషయంలో జుబేదా నిర్ణయం తీసుకోనున్నట్లు బీఎన్‌పీ నేతల ద్వారా తెలిసిందని బీబీసీ బంగ్లా నివేదించింది. ఖలీదా జియా కోసం ఎయిర్ అంబులెన్స్ కల్పిస్తామని ఖతార్ పేర్కొంది. ఈ పరిణామాల క్రమంలో ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రి పైకప్పుపై రెండు మిలటరీ, ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ల లాండింగ్ పరీక్షలు నిర్వహించాయి. 'మేడమ్ ఆరోగ్యం

ప్రయాణానికి సహకరిస్తే ఆమెను రేపు ఉదాయన్నే లండన్‌కు తీసుకెళతాం. అంతా ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంది' అని ఖలీదా జియా సలహాదారు ఇనాముల్ హక్ చౌదరి తెలిపినట్లు ది డైలీ స్టార్ వార్తాసంస్థ వెల్లడించింది.

ఎయిర్‌లిఫ్ట్‌కు ఏర్పాట్లు!

ప్రస్తుతానికి చైనాకు చెందిన రెండు వైద్య బృందాలతో పాటు బ్రిటన్ నుంచి వచ్చిన వైద్య నిపుణల పర్యవేక్షణలో ఖలీదా జియాకు చికిత్స అందిస్తున్నారు. ఆపద్ధర్మ ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఇటీవల ఆసుపత్రికి వెళ్లి మాజీ ప్రధాని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అంతకుముందు త్రివిధ దళాధిపతులు సైతం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.

40 మంది హమాస్ సభ్యుల్ని చంపాం: ఇజ్రాయిల్

జెరూసలేం: దక్షిణ గజాలోని రఫా పరిధి సొరంగాల్లో చిక్కుకున్న 40 మంది హమాస్ సభ్యులను తమ దళాలు హతమార్చినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. ఈ ప్రాంతం మొత్తం ఇజ్రాయిల్ నియంత్రణలో ఉన్నది. కాగా, 200 మంది వరకు ముష్కరులు కొద్ది నెలలుగా సొరంగాల్లో చిక్కుకున్నట్లు ఇజ్రాయిల్ సహా అమెరికా అధికారులు వెల్లడించారు. వీరిలో కొందరు బయటకు వచ్చారు కానీ ఇజ్రాయిల్ దళాలతో పోరులో చనిపోయారు లేదా లొంగిపోయారని తెలిపారు.

టర్కీలో బెట్టింగ్: 29 మంది ఫుట్‌బాల్ ఆటగాళ్ల అరెస్టు

ఇస్తాంబుల్: టర్కీ మ్యాచ్‌లలో బెట్టింగ్ దుమారం రేపింది. ఈ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఇదే క్రమంలో 29 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు సహా 46 మంది అరెస్టుకు ఇస్తాంబుల్ ప్రాసిక్యూటర్లు శుక్రవారం ఆదేశాలిచ్చారు. నిందిత ఆటగాళ్లలో 27 మంది తమ సొంత జట్టుల మ్యాచ్‌లపై బెట్టింగ్ ఆడినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నిందిత క్రీడాకారుల గుర్తింపును ప్రాసిక్యూటర్లు బయటపెట్టలేదు. అరెస్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న 46 మందిలో నుంచి 35 మందిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారని, మరో ఐదుగురు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారని ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. టర్కిష్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ (టీఎఫ్‌ఎఫ్) ఇప్పటివరకు వెయ్యి మందికిపైగా క్రీడాకారులను సస్పెండ్ చేసింది. వీరిలో 25 మంది సూపర్ లిగ్‌కు చెందిన వారు కాగా క్రీడాకారులపై 45 నుంచి 12 నెలల వరకు ఆంక్షలు విధించిన విషయం విదితమే.

ఉక్రెయిన్‌కు అమెరికా పక్కలో బల్లెం

జెలెన్‌స్కీని హెచ్చరించిన ఫ్రాన్స్, జర్మనీ

బెర్లిన్: ఉక్రెయిన్‌కు అమెరికా పక్కలో బల్లెం వంటిదని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వ్యాఖ్యానించారు. ఆ దేశాన్ని గుడ్డిగా నమ్మవద్దని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీకి సూచించారు. అమెరికా ఎప్పుడైనా మోసం చేయొచ్చని హెచ్చరించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి కోసం అమెరికా ప్రతిపాదనల క్రమంలో జెలెన్‌స్కీ జాగ్రత్తగా ఉండాలని, భద్రతా హామీలు లేకుండా తమ భూభాగం విషయంలో రాజీపడేందుకు అమెరికా ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం ఉంటుందని మాక్రెన్‌తో పాటు జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్స్ సైతం జెలెన్‌స్కీకి సూచించారు. అమెరికా మధ్యవర్తులు ఆటలు ఆడుతున్నారని, శాంతి ఒప్పంద పరిణామల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని మాక్రాన్, మెర్స్ హితవు పలికారు.

సంపూర్ణ సహకారం

(మొదటిపేజీ తరువాయి)



ఆకాంక్షించారు. ఇరుదేశాల ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. చమురు, సహజవాయువు, బొగ్గు సరఫరాకు ఒప్పందాలు చేసుకున్నామని, వైద్య, వ్యవసాయ రంగాల్లో కలిసి ముందుకెళ్తామని వివరించారు. భారత ప్రధానితో నిర్మాణాత్మక చర్చలు జరిగాయని... ముఖ్యంగా ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయన్నారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం. ఇరుదేశాల వాణిజ్యం 64 బిలియన్ డాలర్ల నుంచి వంద బిలియన్ డాలర్లకు పెరగాలి. ఇరుదేశాల ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. ఇరుదేశాల మధ్య రవాణా అనుసంధానం పెంచడం మా లక్ష్యం. అంతర్జాతీయ ఉత్తర, దక్షిణ రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం. భారత్‌లో అతిపెద్ద న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరిస్తాం. చమురు, సహజవాయువు, బొగ్గు సరఫరాకు ఒప్పందాలు చేసుకున్నాం.

విమానం టికెట్ ధరలకు రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కటైన ముంబై-ఢిల్లీ మధ్య విమాన సర్వీసుల టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ముంబై-ఢిల్లీ, ఢిల్లీ-ముంబై మార్గంలో పలు ఎయిర్‌లైన్ల టికెట్ ధరలు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు ఉన్నాయి. మిగిలిన మార్గాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.సాధారణ సమయాల్లో ఢిల్లీ-ముంబై రౌండ్‌ట్రిప్ టికెట్ ధరలు చివరి నిమిషంలో బుక్ చేసుకున్నా... దాదాపు రూ.20 వేల వరకు ఉంటాయి. ఇప్పుడు ఆ ధర ఏకంగా దాదాపు రూ.60 వేల వరకు పెరిగింది. ముంబై-శ్రీనగర్‌లో సాధారణ రోజుల్లో రూ.10 వేలు ఉండే టికెట్ ధర... ఇప్పుడు ఏకంగా రూ.62 వేలకు పెరిగింది. రౌండ్‌ట్రిప్ అయితే దాదాపు రూ.92 వేల వరకు ఉంది. భారత్‌లో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం రోజుకు దాదాపు 2,200 విమాన సర్వీసులు నడుపుతోంది. ఎయిరిండియాతో పోలిస్తే ఇది రెండింతలు. అలాంటి ఎయిర్‌లైన్ ఇప్పుడు సాంకేతిక సమస్యలు, సిబ్బందికి సంబంధించిన కొత్త రోస్టర్ నియమాలు తదితర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో శుక్రవారం దాదాపు 500 విమానాలను రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై సహా పలు విమానాశ్రయాల్లో ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరికొన్నిచోట్ల ఆలస్యంగా నడుస్తున్నాయి.

బ్యాంకుల మనుగడకు ఆలయ డబ్బు వాడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పింది. కేరళలోని తిరునెల్లి దేవస్థానం చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ మనాంతవాడి కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సహా కొన్ని సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌ను విచారిస్తూ న్యాయస్థానం పైవ్యాఖ్యలు చేసింది. 'మీరు ఆలయ డబ్బును ఉపయోగించి బ్యాంకును రక్షించాలనుకుంటు న్నారా? కష్టాల్లో ఉన్న ఒక సహకార బ్యాంకులో డబ్బు ఉంచే బదులు, ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుకు ఆ నిధులు మార్చాలని ఆదేశించడంలో తప్పేముంది' అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బ్యాంకుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవిం చలేదు. 'మీరు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవాలి. కస్టమర్లను, డిపాజిట్లను ఆకర్షించలేక పోతే అది మీ సమస్య' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. దేవుడి డబ్బును తిరిగి చెల్లించడానికి సమయం పొడిగించాలని కోరుతూ మాత్రమే కో-ఆపరేటివ్ బ్యాంకులు హైకోర్టును ఆశ్రయి ంచడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ బ్యాంకుల పిటిషన్లను విచారించడానికి మాత్రం నిరాకరించింది. తిరునెల్లి దేవస్థానం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన ఐదు సహకార బ్యాంకుల గడువు ముగిసినా, తిరిగి చెల్లించాలని పదేపదే అడిగినా... డబ్బు ఇవ్వడానికి నిరాకరించాయి.

అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా త్రివిక్రమరావు

(మొదటిపేజీ తరువాయి)

వాడుకపై సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వాలని...రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో తెలుగు భాష వినియోగాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికార కార్యక్రమాల్లో ఆంగ్లభాష ఉపయోగించ డాన్ని నియంత్రించడంపై కార్యాచరణ రూపొందించాలని సూచించింది. అధికార కార్యక్రమాల్లో తెలుగు వినియోగంలో ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అధికార భాషాభివృద్ధి కోసం తగిన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలక భూమిక

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనుండడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియా గాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక, ప్రాముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కాదల్చిన వారికి ఈ సమ్మిట్ ఒక వేదికగా నిలుస్తుందని ఆమె తెలిపారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ-వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇస్తూ మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా గాంధీ ఈ లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలోని మానవ వనరులు, సహజ వనరులు, ప్రజల వ్యాపార నైపుణ్యం, అంతర్జాతీయ ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని ఆమె తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

అందజేయడానికి ఈ ఎక్సలెన్స్ సెంటర్ ఉపయోగపడుతుంది. డిజిటల్ ఇండియా భవిష్యత్‌కు తెలంగాణా ముఖ ద్వారం కానుందని శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో కూడా నైపుణ్య శిక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాను సందర్శించిన సందర్భంగా డీకిన్ యూనివర్సిటీని రాష్ట్రంలో క్యాంపస్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించామన్నారు. తెలంగాణాలో నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన ఎకోసిస్టం ఉంది. దీనికి ఈ ఎక్సలెన్స్ సెంటర్ సేవలు మరింత ఉపయోగపడతాయని తెలిపారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులకు తమ దేశంలో ఉన్నత స్థాయి నైపుణ్యాల్లో శిక్షణ అందించడానికి కూడా ఆస్ట్రేలియా అంగీకరించింది. ఎంఓయూ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు ఐ.సాయికృష్ణ, ఆస్ట్రేలియా ప్రతినిధులు క్యామ్ గ్రీన్, కరేన్ సాండర్ కాక్, నథానియెల్ వెబ్, స్టీవెన్ బిడిల్, హిల్లరీ మెక్ గీచి, స్టీవెన్ కానోలీ, విక్రం సింగ్, ఐటీ శాఖ చీఫ్ స్ట్రాటెజిస్ట్ శ్రీకాంత్ లంకా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అక్రమ నిర్బంధం దారుణం

(మొదటిపేజీ తరువాయి)

రాశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వారు వెళుతున్న వాహనాలను ఆపి విద్యార్థులను చింతూరు పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. దీనిని అందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గ్లోబల్ సమ్మిట్‌కు రండి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులు సదస్సుకు హాజరవుతున్నట్టు ముఖ్యమంత్రికి ఆయన వివరించారు.

రెండు రాష్ట్రాలు కల్సి ఉండాలి: మంత్రి కోమటిరెడ్డి ఆకాంక్ష

రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి ఉండాలని, స్నేహపూర్వక వాతావరణం ఇలాగే కొనసాగాలని మంత్రి కోమటిరెడ్డి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రిని కల్సిన అనంతరం ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు విజన్-2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్ అని కొనియాడారు. ఆయన విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా ఆహ్వానించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై చేసిన విమర్శల గురించి ప్రస్తావించగా... అప్పటి పరిస్థితుల మేరకు అలాంటి వ్యాఖ్యలు చేశానని తెలిపారు.

గుత్తాధిపత్యం... నిర్వహణ వైఫల్యం

(మొదటిపేజీ తరువాయి)

వెళితే ఎంతటి ప్రమాదమో ఇండిగో సంక్షోభంతో తేలిందని వ్యాఖ్యానించారు. రెగ్యులేటరీ చర్యల లోపంతో పరిస్థితి మరింత జటిలమైందని విమర్శించారు. డీజీసీఏ, పౌర విమానయాన శాఖ తక్షణమే స్పందించి పారదర్శక చర్యలు తీసుకోవాలని డి.రాజా డిమాండ్ చేశారు. భద్రతా నియమాలను సమర్థంగా పాటించేలా హామీనివ్వాలన్నారు. కార్యకలాపాల వైఫల్యానికి విమానయాన సంస్థ బాధ్యత తీసుకునేలా చేయాలని సూచించారు. రీ-బుకింగ్‌కు తోడ్పాటు అందించడమే కాకుండా బస సౌకర్యంతో పాటు ఇతర సేవలకు ఆయా సంస్థలు పూర్తిగా బాధ్యత తీసుకొనేలా తగు విధమైన చర్యలను తీసుకోవాలని డి.రాజా అన్నారు. గుత్తాధిపత్యానికి దారితీసిన విధానాలను పున:పరిశీలించాలని ప్రభుత్వానికి హితవు పలికారు. విమానయాన రంగంలో పర్యవేక్షణ వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విమానయాన వ్యవస్థ అనేది ప్రయాణికులను, వర్కర్లను కాపాడేదిగా ఉండాలేగానీ కార్పొరేట్ లాభాలకు వాహనంగా మారకూడదని డి.రాజా పేర్కొన్నారు.

భారత్, రష్యా స్నేహం శాశ్వతం

(మొదటిపేజీ తరువాయి)

త్వరగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయటం సహా అన్ని అంశాలపై పుతిన్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య మైత్రి ఎనిమిది దశాబ్దాలకుపైగా ధృవనక్షత్రంలా స్థిరంగా ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, నమ్మకంతో ఎల్లప్పుడూ కాలపరీక్షకు నిలిచాయన్నారు. "గత 8 దశాబ్దాలుగా ప్రపంచం అనేక ఒడిదుడుకులను చూసింది. మానవత్వం అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంది. వీటన్నింటి మధ్య భారత్-రష్యా స్నేహం ధ్రువ నక్షత్రంలా స్థిరంగా ఉంది. పరస్పర గౌరవం, లోతైన విశ్వాసం వల్ల నిర్మితమైన ఈ సంబంధం, కాలం విసిరిన ప్రతి సవాల్‌కు వ్యతిరేకంగా ద ృఢంగా నిలబడింది. ఇప్పుడు ఈ సంబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని అంశాలను చర్చించాం. ఓడల నిర్మాణంలో మా లోతైన సహకారం మేకిన్ ఇండియాను బలోపేతం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఉద్యోగాలు, నైపుణ్యాలు, ప్రాంతీయ కనెక్టివిటీని పెంచే మా విన్-విన్ సహకారానికి మరికొన్ని అదుతేమైన ఉదాహరణలు. భారత్-రష్యా భాగస్వామ్యానికి ఇంధన భద్రత మూల స్తంభంగా ఉంది. పౌర అణుశక్తిలో మా దశాబ్దాల నాటి సహకారం మా భాగస్వామ్య స్వచ్ఛ ఇంధన ప్రాధాన్యతలను సాకారం చేసుకోవడంలో కీలకంగా మారింది. మేము ఈ విన్-విన్ సహకారాన్ని కొనసాగిస్తాము. ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, వైవిధ్యభరితమైన సరఫరా గొలుసులను నిర్ధారించడంలో అరుదైన ఖనిజాల్లో మా సహకారం చాలా కీలకమైంది. ఇది క్లీన్ ఎనర్జీ, హైటెక్ తయారీ, కొత్త తరం పరిశ్రమల్లో మా భాగస్వామ్యానికి బలమైన మద్దతును అందిస్తుంది" అని తెలిపారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు మద్దతు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ -రష్యా చాలాకాలం నుంచి కలిసి పోరాటం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. తమ పోరాటానికి ప్రపంచ దేశాలన్నీ మద్దతు ఇవ్వటం అతిపెద్ద బలమన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు జరుగుతున్న అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

ఉగ్రవాదంపై పోరులో భారత్, రష్యా చాలాకాలంగా భుజం భుజంతో కలిసి నిలబడి సహకరించుకుంటున్నాయని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాల ఐక్యతే గొప్ప బలం అని భారత్ నమ్ముతోందన్నారు. భారత్, రష్యా యూఎన్, జీ20, బ్రిక్స్, ఎస్‌సీవో సహా ఇతర వేదికలలో భారత్-రష్యా సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఈ వేదికలన్నింటిలో చర్చలు, సహకారాన్ని కొనసాగిస్తామన్నారు. ఉక్రెయిన్ సమస్యపై భారత్ మొదటి నుంచీ శాంతిని సమర్థించిందని, శాంతియుతమైన, శాశ్వత పరిష్కారం కోసం జరుగుతున్న అన్ని ప్రయత్నాలను భారత్ స్వాగతిస్తుందన్నారు. భారత్ వాణిజ్యానికి రష్యా ఎప్పుడూ అండగా నిలుస్తోందని మోదీ తెలిపారు. ఇరుదేశాల ఆర్థిక సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యూరియా ఉత్పత్తికి రష్యా సాయం చేస్తోందని తెలిపారు. ఆర్థిక ప్రణాళికలపై 2030 వరకు ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరిందని అన్నారు. ఎఫ్‌టీఏ తుది అంకానికి ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు.

ఓయూ అభివృద్ధికి వెనుకాడం

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. చారిత్రక ప్రాధాన్యం లేని పురాతన భవనాలకు భారీ మొత్తాలు వెచ్చించి మరమ్మతులు చేసే బదులు నూతన భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సైకిల్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌లతో పాటు ప్రతి పనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉస్మానియా విద్యార్థుల పోరాట ప్రతిమను ప్రతిబింబించే చిహ్నాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని ఈ నెల 10న సందర్శించి అకడమిక్ బ్లాక్‌లు, హాస్టళ్లను పరిశీలిస్తానని సీఎం తెలిపారు. తొలుత విద్యార్థులు, బోధన సిబ్బంది ముందు అభివృద్ధి నమూనాలు ఉంచాలని, తర్వాత వారి అభిప్రాయాలు తెలిపేందుకు డ్రాప్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

ఈ నెలాఖరు నాటికి అభివృద్ధి ప్రణాళికలపై తుది నిర్ణయం ఖరారు కావాలన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ది విషపూరిత ఆలోచన

(మొదటిపేజీ తరువాయి)

భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆందోళన కూడా చేశారు. ఈ కెమికల్ ఫ్యాక్టరీని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చింది బీఆర్‌ఎస్ కాదా? ఈ ఫైలుపై అయ్య కొడుకులు సంతకాలు చేయలేదా? ఏ పాలసీతో ఈ కన్వర్షన్ చేశారు. ఐడీపీఎల్‌లో కూడా ఇదే విధంగా చేశారు. కేటీఆర్ కడుపునిండా విషమే ఉంది. విషం కక్కడానికి కూడా ఒక హద్దు, అదుపు, పద్ధతి ఉంటుంది. కేటీఆర్‌ది కడుపు మంట, విషపూరితమైన ఆలోచన. హిల్ట్ పాలసీపై బీజేపీ, బీఆర్‌ఎస్‌ది ఒకే డ్రామా... స్క్రిప్ట్ రాసేది ఒకరు. డెలివరీ చేసేది మరొకరు' అని విమర్శించారు.

గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

కావాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. జార్ఖండ్ సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను సీఎం సోరెన్ కు భట్టి విక్రమార్క అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్ సంకల్పంతో ముందుకు సాగుతుందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్ ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు ఈ భేటీలో భట్టి విక్రమార్క వివరించారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేధో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు... జార్ఖండ్ సీఎంకు వివరించారు.

భారత్-రష్యా వాణిజ్యం కొత్త పుంతలు

న్యూదిల్లీ: ఇరుదేశాల వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని భారత్-రష్యా నిర్ణయించాయి. ఢిల్లీ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన అత్యున్నత స్థాయి శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాధినేతలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే ఐదేళ్ల ప్రణాళికతో ఈ మేరకు ఇరు దేశాలు కీలక ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యంగా ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని భారత్- రష్యా లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందుకోసం వాణిజ్య అసమానతలను సరిచేయడానికి భారత్ నుంచి వస్తువుల సరఫరాను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఇక పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రభావాన్ని అధిగమించడానికి, ద్వైపాక్షిక పరిష్కారంపై ఇరు దేశాల దృష్టిసారించాయి. ఈ మేరకు రెండు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలు తమ తమ జాతీయ కరెన్సీల (రూపాయి, రూబుల్)లో చేసే అంశంపై దృష్టిసారించాలని ఈ ద్వైపాక్షిక భేటీలో అవగాహనకు వచ్చారు. ఇందుకోసం ఒక వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఇరు దేశాల నిర్ణయించాయి.

స్వతంత్ర పోరాటంలో ముస్లిం సమాజం యావత్తు త్యాగాలు...

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఆనాటి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లిం సమాజం యావత్తు నిలబడి ఎన్నో త్యాగాలు చేసిందని జామియా మస్జిద్ ఇమామ్ మౌలానా ముక్తి యాకూబ్ స్పష్టం చేశారు. ఆనాటి దేశద్రోహులు నేడు ముస్లింలను ద్రోహులుగా చిత్రీకరించేందుకు ఎన్నో కుట్రలు పన్నుతున్నారని అయినప్పటికీ ముస్లిం సమాజం సోదర భావాన్ని కోరుకుంటుందని వివరించారు. స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ ప్రభుత్వానికి తలొగ్గకుండా ముస్లిం మత గురువులు వేలాదిమంది ఉరికంబాలను ముద్దాడారని, ఆ సైన్యం కురిపించిన తూటాలకు ఎదురొడ్డి గుండెలు చూపి వీరమరణం పొందారని ఈ చరిత్రను ఎన్ని కుట్రలు చేసినా ఎవరు చెరపలేరని ఆయన స్పష్టం చేశారు. పవిత్ర శుక్రవారం ప్రార్థనలకు ముందు ఆయన చారిత్రక ఘట్టాలను ప్రసంగించారు. ఆనాటి స్వేచ్ఛా స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముస్లిం సమాజం నేడు అన్ని రంగాల్లో వెనుకబాటు తనాన్ని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆ ఉద్యమంలో ముస్లింల పాత్ర ఎంతో కీలక మైనప్పటికీ నేడు తమను దేశంలో అంటరాని వాళ్లుగా, దేశద్రోహులుగా చిత్రించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలోని ప్రజలకు ఉదారమైన

సేవలందిస్తూ, సోదర భావంగా వుంటూ త్యాగాలు చేయాలని ఇస్లాం బోధిస్తుందని తెలిపారు. సర్వ సృష్టికర్త అయిన ఒకే అల్లాను నమ్మే సమాజం తమదన్నారు. పరమత ద్వేషం ప్రజలపై హింసను ఇస్లాం ఏమాత్రం అనుమతిం చదన్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో హిందూ, ముస్లిం, శిఖ్, ఈసాయి ఐక్యతే ప్రధాన శక్తి గా మారి బ్రిటిష్ పాలనను కూకటి వేళ్ళతో పెకలించాయని చరిత్రను వివరించారు. నేటితరం హిందూ, ముస్లిం యువకులు భారత దేశ చరిత్రను, స్వాతంత్ర పోరాటాలను అధ్యయనం చేయాలని కోరారు. చరిత్ర చదివినప్పుడే అపోహలు తొలగి కొందరు చేసే దుష్ప్రచారాన్ని పసిగట్టగలరని ఆయన స్పష్టం చేశారు. ఆనాటి ఉద్యమంలో ముస్లిం సమాజం యావత్తు రాజకీయంగా, ఆర్థికంగా, విప్లవ సాహిత్య పరంగా, పత్రికా రంగంలోను అనేక విధాలుగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. 1857 సిపాయి తిరుగుబాటులో ముస్లిం సైనికులు, పండితులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారన్నారు. ఈ పోరాటంలో గొప్ప పేరున్న, ఆర్థిక వనరులున్న ఉలేమాలైన (పండితులు) మౌలానా హిఫ్జుల్ రెహ్మాన్, షేక్. మేహేమూద్ హాసన్, షేక్. హుస్సేన్ అహ్మద్ మదని, అబుల్ కలాం ఆజాద్ లాంటి వేలాది మంది బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో జీవితాలను త్యాగం చేసారని గుర్తు చేసారు. బ్రిటిష్ పాలనకు తలొగ్గని హైదర్ అలీ, టిప్పుసుల్తాన్ లాంటి గొప్ప యోధులు, అలాగే సిరాజుద్దౌలా, బహదూర్ షా జఫర్ , షౌకత్ అలీ మహమ్మద్ అలీ బ్రదర్స్ , ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ (బుడా ఖాన్) అహింసా సిద్ధాంతంతో స్వాతంత్ర్య పోరాటం సాగించిన గొప్ప నాయకులన్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించి గాంధీజీతో కలిసి ఎంతో మంది ఉలేమాలు ఆందోళన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, అద్భుతమైన వక్త, స్వతంత్ర ఆలోచన కర్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ఆజాద్ దేశం రక్షణకు ఎన్నో రకాల ఆవిష్కరణలు చేసి ప్రపంచంలో దేశ ఖ్యాతిని చాటారన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులు నేటి తరానికీ ఆదర్శమన్నారు.

వివిధ పార్టీల నాయకులు సీపీఐలో చేరిక

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : బూర్జువా పార్టీల విధానాలు నచ్చక సిపిఐ విధానాలకు ఆకర్షితులై జిల్లాలోని బలపాల గ్రామం లో వివిధ పార్టీల నుండి పెద్ద ఎత్తున సిపిఐ లో చేరగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక పార్టీలు ప్రజలను ఎప్పటికప్పుడు మభ్యపెడుతూ తమ అవకాశవాద రాజకీయాలకు వాడుకుంటుందని, అలాంటి పార్టీలకు ఎన్నికల సమయంలో తగిన బుద్ధి చెప్పాలని, ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే సిపిఐ పార్టీ అని తెలిపారు. సిపిఐ పార్టీకి అకర్షితులై వివిధ పార్టీల నుండి వచ్చిన రునావత్ రమేష్ సూరి , రొయ్యల రమేష్, బాల్ని వెంకన్న, తదితరులకు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డితో కలసి పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, తురక రమేష్, రామగొని రవి, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తొలి దశ ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు తొలి దశ ర్యాండమైజేషన్ మండలాల వారిగా నిర్వహించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది పిఓ, ఓపిఓ లను నియమించనున్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు. దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారుల కొరత తలెత్తకుండా ఉంటుందని అన్నారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలలో ఎమ్మెల్యే ప్రచారం

విశాలాంధ్ర గూడూరు: గూడూరు మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గూడూరు, వెంగంపేట, పొనుగోడు,పడమటి తండా,రాములు తండా,మదనాపురం, గుండెంగా గ్రామాలలో స్థానిక సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్ వార్డు మెంబర్లు గా పోటీ చేసే వారి గుర్తులను గుర్తు చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.అదేవిధంగా రాజన్ పల్లి గ్రామంలో ప్రస్తుతానికి సర్పంచ్ ను ఎన్నుకోవడం జరిగిందని ఉపసర్పంచ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోలేదని ఆ గ్రామ పార్టీ నాయకులు శేఖర్ తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల లోపు ఎన్నుకుంటామన్నారు. ఇట్టి ప్రచారంలో డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమా మురళి నాయక్,చిట్టి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా నాయకులు మాధవ పెద్ది రమేష్ చందర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్బంటి స్వామి, మండల యూత్ అధ్యక్షులు,బొల్లికొండ మధు,యాదవ రెడ్డి, తాటి బుచ్చయ్య, రవి సింగ్ రాథోడ్, భాస్కర్,ఈర్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోవుంది దీంతో కాంగ్రెస్ పార్టీ కి చెందిన అభ్యర్థిని గెలిపిస్తే నిధులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధి చేస్తారని టీజిఐఐసి చైర్ పర్సన్, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట మండలం నందికంది, కొనాపూర్ గ్రామాలలో శుక్రవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థుల తరపున ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. నిర్మల జగ్గారెడ్డి రాక సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు నందికంది గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నందికంది సర్పంచ్ అభ్యర్థి రేచర్ల స్రవంతి విజయ భాస్కర్ రెడ్డి తరపున ఆమె ఇంటింటి కి వెళ్లి తమ అభ్యర్థి ని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు, సన్న బియ్యం, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలను చూసి ప్రజలు ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సిద్దన్న, సదాశివ పేట మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, పిల్లోడి విశ్వనాథ్, అమర్ నాథ్ రెడ్డి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పతాక నిధికి కలెక్టర్ వితరణ

విశాలాంధ్ర - కొత్తగూడెం: సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా పతాక నిధికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం సొంతంగా తొలి నిధిని అందించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సాయుధ దళాల దినోత్సవ పతాక నిధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ తొలి విరాళాన్ని అందించడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న సైనికుల కోసం పతాక నిధికి ప్రతి పౌరుడు తన వంతు సహకారం అందించడం దేశభక్తి, సామాజిక బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితుల్లో సేవలు అందిస్తున్న భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సిబ్బంది త్యాగాలను ప్రతి భారతీయుడు గౌరవించాలని కోరారు. వీరి కుటుంబాల సంక్షేమానికి పతాక నిధి వినియోగించబడుతుందన్నారు. జిల్లా ప్రజలు, విద్యా సంస్థలు, పారిశ్రామిక వర్గాలు, వ్యాపారవేత్తలు, స్వఛ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల కుటుంబాల పట్ల సమాజం అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పతాక నిధి ద్వారా వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు, గాయపడిన రక్షణ సిబ్బందికి ఆర్థిక సహాయం అందించబడుతుందని వివరించారు. ప్రతి సంవత్సరం సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా ఈ నిధి సేకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి ఎం. చంద్రశేఖర్, వింగ్ కమాండర్ రిటైర్డ్ సురేందర్, ఆర్మీ రిటైర్డ్ సుభాని, కృష్ణమూర్తి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సుగుణారావుకు ఆత్మీయ సత్కారం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : అంతర్జాతీయ వాలంటీర్స్ డే పురస్కరించుకుని కొత్తగూడెంలోని స్థానిక ఎ.వి.ఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన వేడుకల్లో ప్రకృతి వైద్యులు, ప్రముఖ హీలర్ జి. సుగుణారావుని ఆత్మీయంగా సత్కరించారు. ఏ.టి.ఇ.సి, ఎ.ఎ.ఎ.ఒ, ఐక్య తల్లిదండ్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. సుగుణ రావు చేస్తున్న ప్రకృతి సహజ సహజ సిద్ధ వైద్య సేవలను వక్తలు కొనియాడారు. చాలామంది ఆర్థికంగా వెనకపడ్డ పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సన్మానించిన వారిలో సంస్థల నిర్వాహకులు మారుతి రత్నాకర్, సీనియర్ జర్నలిస్ట్ లోగాని శ్రీనివాస్, మేకల జ్యోతిరాణి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, బాలు, కమలారాణి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై టాస్క్ ఫోర్స్ దాడులు

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని పలు గ్రామాలలో టాస్క్ ఫోర్స్ బృందాలు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కొణిజర్ల, రఘునాదపాలెం, చింతకాని, బంజారా, ముదిగొండ, ఖమ్మం రూరల్,సత్తుపల్లి, తిరుమలాయపాలెం, వెంసూర్ లోని వివిధ ప్రదేశాలలో బెల్టు దుకాణాలపై ప్రత్యేక దాడి నిర్వహించి రూ.35 వేల విలువ గల IMFL మద్యం సుమారు 600 లీటర్లు, స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించినట్లు తెలిపారు. ఏన్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై సంధ్య ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి రూ.42 వేల విలువ చేసే 240 లీటర్ల మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రద్దయిన రైళ్లను పునరుద్ధరించండి

విశాలాంధ్ర కారేపల్లి: కరోనా టైంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిల్లీలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

భద్రాచలం రోడ్డు డోర్నకల్ మధ్యలో కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్లను నేటికీ పునరుద్ధరించకపోవడంతో సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి ఇటీవల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీనితో ఈ సమస్యను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.డోర్నకల్ - భద్రాచలం,కాజీపేట - మణుగూరు,కొల్లాపూర్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని,కాకతీయ ప్యాసింజర్ రైలుకు తడికలపూడి,చీమలపాడు, బేతంపూడి స్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. భద్రాచలం రోడ్ నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం పూట మరో రైలును మంజూరు చేయాలని ఎంపీ రవిచంద్ర కోరారు.సమస్యలపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థుల అక్రమ నిర్బంధాన్ని ఖండించండి

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి : 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మారేడుమిల్లి వద్ద జరిగిన సిపిఐ (మావోయిస్టు కేంద్రకమిటి సభ్యుడు కామ్రేడ్ మాడవి హిడ్మా అతని సహచరుల ఎన్కౌంటర్ ఘటనపై అధ్యయనం కోసంవెళ్లిన అఖిలభారత విశ్వ విద్యాలయవిద్యార్థులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దామనకాండను కరీంనగర్ ఉమ్మడి జిల్లా పౌర హక్కుల సంఘం, ప్రజా ఫ్రంట్,ప్రజా సంఘాల నాయకులు , మధన కుమార స్వామి, ప్రజా ఫ్రంట్ నాయకులు గాండ్ల మల్లేష్, నక్క సత్యంలు. పెద్దపల్లిలో తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న తెలుగు దేశం పార్టీ -జనసేన పార్టీలు మోడీ అమిత్ షా ల నరమేదానికి వంతపాడుతున్నాయి. దేశంలో రోజురోజుకు రాజ్యాంగ విలువలు, హక్కులు కాలరాస్తున్నారు. విద్యార్థుల అధ్యయనం వల్ల బూటకపు ఎన్కౌంటర్ అనేది తేటతెల్లం అవుతుందనే భయంతోనే విద్యార్థులను చింతూరు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ చర్య మనిషి స్వేఛ హక్కుకు భంగం కలిగించడమే. అక్రమంగా నిఠరేధించిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలి. విద్యార్థుల అక్రమ నిఠరేదాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరుతున్నాం. ముందుగా విద్యార్థులు తమ కార్యక్రమాన్ని ప్రకటించుకొని సంబంధిత అధికారులకు తెలియజేసిన కూడా దుర్మార్గంగా వ్యవహరించడం సిగ్గుచేటు.మాకొద్దు మాకొద్దు మావోయిస్టులు మాకొద్దు అంటు కిరాయి మనుషులు నినాదాలు చేయడం, విద్యార్థుల పోలీస్ స్టేషన్‌కు తరలించడం అంత గందరగోళంగా ఉన్నది. విద్యార్థులను వెంటనే ఆంధ్రప్రదేష్ ప్రభుత్వం విడుదల చేయాలి.

మిల్లర్లు అలసత్వం వీడాలి

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరి ప్రక్రియలో మిల్లర్లు అలసత్వం వీడాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మిల్లులవారీగా కేటాయించిన ధాన్యం ఇప్పటివరకు అప్పగించిన బియ్యం వివరాలను తెలుసుకున్నారు. డెలివరి ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. బకాయిలు ఉన్న మిల్లర్లు తమకు కేటాయించిన రోజు వారీ టార్గెట్లను తప్పనిసరిగా నిర్దిష్టంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లక్ష్యాలను పూర్తి చేయనట్లయితే సంబంధిత మిల్లర్లు డిఫాల్ట్‌గా పరిగణించబడే ఆస్కారం ఉందని హెచ్చరించారు.

సాయి ఈశ్వరచారీ మృతి బాధాకరం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: బీసీల హక్కుల కోసం ఆత్మహత్యయత్నం చేసుకున్న సాయి ఈశ్వర చారీ మృతి చెందడం బాధాకరమని స్వర్ణకార సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు పూనా రవిచారి పేర్కొన్నారు. క్షణికావేశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఆయనకు ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు మెదక్ పట్టణ అధ్యక్షుడు ఏలేశ్వరం బ్రహ్మాచారి, కార్యదర్శి ఇటిక్యాల వేణుచారి ఉన్నారు.

డబల్‌బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలి

విశాలాంధ్ర తొర్రూర్ : తొర్రూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన 280 డబల్‌బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన నిరు పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఆందోళనలో మండల సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎం.డి. యాకుబ్‌తో పాటు 4 గురిపై అక్రమ కేసులుపెట్టి అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసుమర్తి సీతారా ములు, మాజీ జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళ పెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిపి టీసీ అంజయ్యలు అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల హక్కులకోసం శాంతియుతంగా పోరాడుతున్న నాయకులను అకారణంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అన్నారు. పేదలకోఖసం కేటాయించిన ఇళ్లను వెంటనే అందజే యాలని డిమాండ్ చేస్తుండగా, ఆ గొంతును అణిచివేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఉన్న యాకుబ్‌ను మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్‌గౌడ్, సీపీఎం నాయకుడు రాంమూర్తి తదితరులతో కలిసి వారు పరామర్శించారు.

సత్తుపల్లి నుంచి బిహెచ్ఇఎల్‌కు మరో నాలుగు బస్సులు

విశాలాంధ్ర -సత్తుపల్లి: సత్తుపల్లి నుండి బిహెచ్ఇఎల్ కు ప్రస్తుతం నడుపుతున్న రెండు ఏసి సర్వీసులతోపాటు అదనంగా మరో నాలుగు ఏసీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఊటుకూరు సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గతంలో సత్తుపల్లి నుండి ఉదయం ఒక సర్వీస్, రాత్రి పూట ఇంకోసర్వీస్ నడిపే వారమని ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా ఇంకా నాలుగు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఎంజీబీఎస్, ఎస్ఆర్ నగర్ ,అమీర్పేట్, కూకట్పల్లి మియాపూర్ క్రాస్ రోడ్ ,లింగంపల్లి మీదిగా బీహెచ్ఈఎల్ కు బస్సు చేరుకుంటుందని ఆమె తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలాన్ని అర్థం చేసుకున్నప్పుడే జీవితం సాఫల్యం : అబ్దుల్ బాసిత్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కాలం సాక్షిగా మన జీవితాలు కరిగిపోతున్నాయని దీన్ని అర్థం చేసుకున్నప్పుడే జీవిత సాఫల్యం లభిస్తుందని జమాతే ఇస్లామి హింద్ నేత షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శుక్రవారం ప్రత్యేక నమాజ్ సందర్భంగా చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్‌లో మస్జిద్ ఎ ఖుభా లో ఆయన ముస్లింలతో పాటు సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ భూమి మీద అందరికీ సమానంగా లభించేది కాలం మాత్రమే అన్నారు. దీన్ని వృధా చేయకుండా సక్రమంగా వినియోగించుకున్నపుడే ఇహ పరలోకాల్లో విజయం లభిస్తుందన్నారు. జీవితం శాశ్వతం కాదన్న విషయం అందరికీ తెలిసినప్పటికీ నిర్లక్ష్యం చేసే వారే బహుముఖంగా నష్టపోతారని తెలిపారు. జీవిత గడువు ఏ క్షణాన ముగిసిపోతుందో తెలియని నేపథ్యంలో ప్రతి క్షణం స్వయంగా వ్యక్తి నిర్మాణం, సమాజహితం కోసం సమయాన్ని వినియోగించాలని కోరారు. అనైతికంగా, అధర్మ, అన్యాయాక్రమాల పనుల్లో వినియోగిస్తే మరణానంతరం నరకాగ్నికి ఆహుతి కాక తప్పదని అన్ని గ్రంథాలు సూచిస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో సోదర భావం, తోటివారిపట్ల సహనం సేవా గుణం కలిగి ఉండాలని ఇస్లాం బోధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు, మస్జిద్ బాధ్యులు షమీం, మదార్, సోను బాయ్, తాజుద్దీన్, షబ్బీర్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం ఎన్నికల నిబంధనాలను అమలు చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: గ్రామపంచాయతీ ఎన్నికల నిబంధనాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో

కానారేన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, సంబంధిత మండలాల ప్రత్యేక అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఇప్పటికే ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అన్ని చర్యలు తీసుకొని ముందుకు సాగడం జరుగుతుందని తెలిపారు. ప్రతిదీ పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని తెలిపారు. మండలాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న వారి వారి మండలాలలో ఎన్నికల విధులు నిర్వహించే రూట్ మ్యాప్ ప్రకారం అన్ని సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు టాయిలెట్స్, త్రాగునీరు, విద్యుత్, కాంపౌండ్ వాల్, ర్యాంప్, తదితర సౌకర్యాలను ముందే సరి చూసుకోవాలని అన్నారు. వెబ్ కాస్టింగ్, స్ట్రాంగ్ రూమ్స్, మైక్రో అబ్జర్వర్ ట్రైనింగ్స్, తదితర సిబ్బందికి మిగిలిన శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో జరుగుతున్న 'సైన్స్ వీక్' కార్యక్రమాల్లో భాగంగా, ఈ శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ను

అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకున్నారు. వారు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానంగా విద్యార్థులు ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు,పర్యావరణ పరిరక్షణ,సాంకేతిక పరిజ్ఞానం లాంటి అంశాలపై తమ ప్రాజెక్టులను రూపొందించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలను పాఠశాల ప్రిన్సిపల్ పొన్నాల సుమన్, డైరెక్టర్ పొన్నాల వినయ్, ఉపాధ్యాయ బృందం ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల ప్రతిభను, వారి సరికొత్త ఆలోచనలను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుమన్ మాట్లాడుతూ, "విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడం, వారిలో దాగి ఉన్న కొత్త ఆలోచనలను వెలికితీసి ప్రోత్సహించడమే ఈ ఎగ్జిబిషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం," అని తెలిపారు.

ఈవీఎంలకు పటిష్టమైన బందోబస్తు చర్యలు

విశాలాంధ్ర,కొమరం భీం. జిల్లాలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఈ వి ఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి సి కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు.

ఘనంగా మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుక

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి జన్మ దిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం కార్పొరేటర్లు, అభిమానులు, పార్టీ నాయకులు

ఘనంగా నిర్వహించారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతకుల రఘుపతి రెడ్డి, జవీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సంపాదకీయం

రష్యాతో చెరగని బంధం

అమెరికా-భారత్ సంబంధాలు దాదాపు బెడిసిపోయిన స్థితిలో, 1380రోజులుగా రష్యా-ఉక్రేన్‌మధ్య యుద్ధం కొనసాగుతున్న స్థితిలో రష్యాఅధినేత వ్లాదిమిర్‌పుతిన్ గురు,శుక్రవారాల్లో భారత్‌లో పర్యటించారు. అన్నిఅధికార మర్యాదలను పక్కన పెట్టి భారత ప్రధానమంత్రి పాలం విమానాశ్రయంలో పుతిన్‌కు ఘన స్వాగతం పలికారు. ఇది రష్యా అధినేత పర్యటనకు మోదీ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తోంది అనడానికి నిదర్శనం. రష్యా-ఉక్రేన్ మధ్య యుద్ధం 2022 ఫిబ్రవరి 24 న మొదలైంది. ఈ యుద్ధంలో మోదీ ప్రభుత్వం తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కానీ మోదీ మాత్రం మేం తటస్థంగా లేం, శాంతి పక్షాన ఉన్నాం అంటున్నారు. యుద్ధం ఆపాలని అమెరికా, ఇతర యూరప్ దేశాలు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా యుద్ధం మాత్రం ఆగలేదు. మోదీ తాను కూడా యుద్ధం ఆపించడానికి ప్రయత్నించానని చెప్పుకున్నారు. కానీ విరామం లేకుండా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఉక్రేన్ మీద రష్యా విరుచుకుపడడం అమెరికాకు, ముఖ్యంగా యూరప్ దేశాలకు నచ్చలేదు. అయితే ఉక్రేన్‌ను నాటో సైనిక కూటమిలో చేర్చుకోవడానికి ప్రయత్నించడమే రష్యా యుద్ధానికి దిగడానికి ప్రధాన కారణం. ఈలోగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్ మీద నడ్డి విరిచే సుంకాలు విధించారు. ట్రంప్ తనకు అత్యంత ఆప్త మిత్రుడు అని మోదీ ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సుంకాలకు వ్యతిరేకంగా మాట్లాడిన సందర్భమేం లేదు. ఈ పరిస్థితిని గమనిస్తే అమెరికాతో సంబంధాలు బెడిసిపోతున్నందువల్లే రష్యా అధినేత పర్యటనకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిందనుకోవాలి. రష్యాతో మనకు దీర్ఘ కాలిక సాన్నిహిత్యం ఉన్న మాట నిజమే. బంగ్లాదేశ్ విభజన సమయంలో అమెరికా బెదిరింపులకు దిగినప్పుడు మనలను ఆదుకున్నది మునుపటి సోవియట్ యూనియనే అన్నదీ ముమ్మాటికీ నిజం. కానీ పుతిన్ అధ్వర్యంలోని ప్రస్తుత రష్యా మునుపటి సోవియట్ యూనియన్ కాదన్న వాస్తవాన్ని కూడా గుర్తుంచుకోవాలి. రష్యా ఇప్పుడు సోషలిస్టు దేశమూ కాదు. కనీసం ప్రజాస్వామ్య దేశం అనుకోవడానికి అవకాశం లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన దగ్గర నుంచి భారత్ విషయంలో పెడసర ధోరణే అనుసరిస్తున్నారు. రష్యా నుంచి మనం చమురు దిగుమతి చేసుకోవడానికి వీలు లేదంటున్నారు. ఇటీవలి కాలంలో ట్రంప్ బెదిరింపులకు లొంగి చమురు దిగుమతులను గణనీయంగా తగ్గించిన మాటా నిజమే. మరో వంక మనలను రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవద్దని ఆక్షేపిస్తున్న అమెరికా మాత్రం ఆ పనే చేస్తోంది. ఉక్రేన్‌పై రష్యా దాడిని భారత్ ఖండించలేదు. శాంతి వచనాలు మాత్రం పలుకుతోంది. ఈ వైఖరి యూరప్ దేశాలకు మింగుడు పడడం లేదు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకుంటున్నందుకే అమెరికా మన దేశంపై అదనంగా 25 శాతం సుంకం విధించింది. రష్యా కొనసాగిస్తున్న యుద్ధానికి భారత్ నిధులు సమకూరుస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనివల్ల భారత్‌పై అమెరికా ఆగ్రహం మరింత పెరుగుతుందా, యూరప్ దేశాలతో మన సంబంధాలు బెడిసిపోయే ప్రమాదం ఉందా అన్న అంశాలు కూడా సహజంగా పుతిన్ పర్యటన సందర్భంగా చర్చకువస్తున్నాయి. పుతిన్‌యాత్రతో భారత్‌కు ఒరిగేదేమిటి అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. యూకే, ఫ్రాన్స్ జర్మనీ దేశాల ప్రసిద్ధ దౌత్యవేత్తలు సంయుక్తంగా ఓ భారత పత్రికలో వ్యాసం రాయడం యూరప్ దేశాల ఆగ్రహానికి నిదర్శనం. ఇలాంటిది బహుశా ఇదే మొదటి సారి అయి ఉండొచ్చు. ఇంకో వేపు పుతిన్ అమెరికాతో ఒక ఒప్పందం చేసుకోబోతున్నారు. ఈ ఒప్పందం ఎలా ఉంటుందో అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. భారత్‌లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని సందర్శించడంద్వారా అమెరికాతో తానుకుదుర్చుకోబోయే ఒప్పందానికి ఆమోద ముద్ర వేయించుకోవడానికి పుతిన్ ప్రయత్నిస్తున్నా రన్న వాదన కూడా ఉంది. దీనివల్ల పుతిన్ అమెరికాతో మరింత శక్తిమంతంగా వ్యవహరించే అవకాశం వస్తుంది. గత సంవత్సరం మోదీ రష్యాలో పర్యటించారు. పనిలో పనిగా ఉక్రేన్ కూడా వెళ్లడంలో మతలబేమిటో అన్న అనుమానమూ కలుగుతుంది. రష్యా-ఉక్రేన్ యుద్ధంవిషయంలో భారతవైఖరి యూరప్ దేశాలకు రుచించడం లేదు. అందుకే పుతిన్ పర్యటనను ఆ దేశాలు అనుమానదృష్టితో చూస్తున్నాయి.

పుతిన్‌కు స్వాగతం పలికిన తీరు, మోదీ ఇంట్లో ఇచ్చిన విందుతో పాటు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కలుసుకోవడానికి పుతిన్ వెళ్లినప్పుడు లభించిన అపూర్వ స్వాగతం, త్రివిధ దళాల సైనిక వందనం, మహాత్మా గాంధీ సమాధి దగ్గర పుతిన్ శ్రద్ధాంజలి ఘటించడం లాంటివి సాదా సీదా అంశాలుగా కనిపించవచ్చు. కానీ అన్నింట్లోనూ ప్రత్యేకత కనిపించింది. రక్షణ ఉత్పత్తుల తయారీ, ఇంధన రంగంలో సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, వాణిజ్య ఒప్పందాలు మొదలైనవి రెండు దేశాల అధినేతల మధ్య చర్చకు వచ్చాయి. దాదాపు 25 ఒప్పందాలు కుదిరాయంటున్నారు. రష్యాకు మనదేశం నుంచి కార్మికులను పంపించడానికి ఒప్పందం ఇందులో భాగమే. ఉక్రేన్ మీద రష్యా యుద్ధానికి దిగినా 2024లో యూరప్‌దేశాలు 84 బిలియన్ పౌన్ల వాణిజ్యం కొనసాగించాయి. అయినా దీర్ఘకాలిక మిత్ర దేశాధినేత భారత్‌లో పర్యటించడాన్ని యూరప్ దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. అమెరికా సుంకాలమీద సుంకాలువిధించడం భారత్‌ను ఇరకాటంలో పెట్టడానికే. అయితే ఇలాంటి ఒత్తిడులకు లొంగేది లేదని పుతిన్ పర్యటన ద్వారా భారత్ నిరూపించదలచుకుందనీ అనుకోవచ్చు. మనం ఇంతకు ముందు పశ్చిమాసియా దేశాల నుంచి చమురు ఎక్కువగా దిగుమతి చేసుకునే వాళ్లం. ఉక్రేన్ యుద్ధం ప్రారంభం అయినప్పుడు రష్యా నుంచి మనం దిగుమతి చేసుకునే చమురు మొత్తం చమురు దిగుమతుల్లో ఒక్క శాతమే ఉండేది. అది తరవాత 36 శాతానికి పెరిగింది. ఇది పశ్చిమాసియా దేశాలకు కూడా కంటగింపుగానే ఉంది. ఒపెక్ దేశాల నుంచి ఇప్పుడు మనం దిగుమతి చేసుకునే చమురు మొత్తం దిగుమతుల్లో 48 శాతమే. అమెరికాతో వాణిజ్య వైరం పెరిగిన తరవాత తమది బహుళపక్ష భాగస్వామ్యం అని గట్టిగా చెప్పడానికి పుతిన్ పర్యటనను మోదీ ప్రభుత్వం ఉపయోగించుకోవాలని అనుకుంటోంది. ఇది యూరప్‌సుద్దులు వినబోమని సూటిగా చెప్పడమే. బలవంత పెడ్తే ప్రయోజనం లేదని అమెరికాకు కూడా తెలియజెప్పడమే. అదే సమయంలో రష్యాతో ఉన్న మైత్రిని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేయడమే. అదే సమయంలో భారత్ స్వతంత్ర వైఖరి అనుసరిస్తుందని చైనాకు కూడా తెలియజేయడమే. తమిళనాడులోని కూడాంకుళంలో రష్యా సహకారంతో మనం అణు విద్యుత్ కేంద్రం నిర్మిస్తున్నాం. ఇందులో ఆరింట్లో రెండురియాక్టర్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. మిగతావాటి నిర్మాణానికి కూడా రష్యా సహకరిస్తుందని పుతిన్ హామీఇచ్చారు. ఇది మనకు చాలా అనుకూలమైన అంశం.

దిష్టి కాదు... స్వయంకృతమే...

"అలో...అలో...అలో...తాతబ్బులుగారా...! ఏటీ ఇలాగొచ్చారు. ఏటీ ఇసేసాలు"

"సానా ఉన్నాయి బాబు గారు. ఇక్కడే సెప్పేయమంటారా... గోడలకి సెవులుంటాయంటారా"

"నిజవే సుమీ... ఈ మధ్య అన్ని గోడలకి సెవులేం ఖర్మ. సోషల్ మీడియాలు కూడా ఉన్నాయి. ఇలా మాటాడితే అలా పెపెంచానికి తెలిసిపోతోంది. విప్పుడు ఉన్న టైయామ్‌లో ఇళ్లలో మాట్లాడడం అంత మంచిది కాదు. ఎవరు లేని ఖాళీ స్థలంలో మాటాడుకోవాల" అన్నారు బాబు గారు.

"నాకైతే కొబ్బరి తోటల్లో మాట్లాడుకుంటే మంచిదని అనిపిస్తా ఉంది బాబు గారు. ఏటంటారు"

"భేష్షుగా ఉంది ఆలోచన. రండి అక్కడికే పోదాం. మాటాడుకుందాం. ఏ సమస్యకైనా పరిస్కారం చూసేద్దాం"

ఇద్దరూ అలా మౌనంగా నడుచుకుంటూ వెళ్తున్నారు. వెనుక నుంచి దూరంగా "మౌనంగానే ఎదగమని కొబ్బరి మొక్క చెబుతుంది. ఎదిగిన కొద్దీ ఎక్కువ కాయలిమ్మనే అర్థమందులో ఉంది" పాట వినిపిస్తోంది.

కోనసీమలో ఎక్కడ చూసినా పచ్చదనం. భూమికి పచ్చాని రంగు వేసినట్లుగా ఉంటుంది. పంటల కాలమేమో మరీ అందంగా ఉంది. పొలం గట్ల మీద వరుసగా వేసిన కొబ్బరి చెట్లు... "కోనసీమని మేం తల ఎత్తుకునేలా చేస్తాం" అన్నట్లుగా ఉన్నాయి. గట్టు మీద వేసిన చెట్లే కాదు.... కొబ్బరి తోటలు కూడా అలాగే ఉన్నాయి. వాటిని చూస్తున్న తాతబ్బులు ముఖం వాడిపోయి ఉంది. బాబు గారు మాత్రం వాటిని చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుగా ఉన్నారు.

ఇద్దరికీ చాలా మాట్లాడుకోవాలని ఉంది. చర్చించుకోవాలని ఉంది. ఏ సమస్యనైనా పరిష్కరించుకోవాలని కూడా ఉంది. ఆ దిశగానే ఆలోచిస్తున్నారని వాళ్లని చూసిన వారికెవరికైనా అనిపిస్తుంది.

అలా ఓ మైలు దూరం నడిచిన తర్వాత ఓ రెండు ఎకరాల కొబ్బరి తోట కనిపించింది. దానికి ఆనుకుని అరటి తోటలు కూడా ఉన్నాయి. కనుచూపు మేరలో అంతా విస్తరించిన కొబ్బరడవి. ఆ తోట మధ్యలోకి వచ్చారు తాతబ్బులు...బాబు గారు. చుట్టు పక్కల ఎవరూ లేరని

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

నిర్ధారించుకున్నాక "విప్పుడు చెప్పండి తాతబ్బులు గారు. ఏటి సమస్య" అన్నారు బాబు గారు. "ఏటినేదు... బాబూ.. కొబ్బరి తోటలు పాడైపోతున్నాయి. దిగుబడి లేదు. మొత్తం కోనసీమ అంతా ఇలాగే ఉంది. మందులు... మాకులు కొడుతున్నాం. అయినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. మీ సలా తీసుకోవాలని మీ దగ్గరికి వచ్చాను" అన్నారు తాతబ్బులు. ఆ మాటలు విన్న బాబు గారు ఒక్కసారి తల ఎత్తి కొబ్బరి చెట్ల వైపు చూశారు. సినిమాల్లో కెమేరా కింద పెట్టి ఆకాశాన్ని ఒకటి రెండు రౌండ్లు తిప్పినట్లుగా తన తలని కూడా తిప్పి మొత్తం తోటంతా పరిశీలించారు బాబు గారు. కొంత సేపటి వరకూ ఏం మాట్లాడలేదు. పరిశీలనగా చూశారు. మధ్యలో మాత్రం ఓ పాలి "హు" అన్నారు. బాబు గారు నోటి నుంచి పల్లెత్తు మాట కూడా రాకపోవడంతో తాతబ్బుల్లో కంగారు ఎక్కువైంది. "ఏటంతారు" అని కాస్త మెల్లిగానే అడిగారు తాతబ్బులు. మళ్లీ ఎందుకైనా మంచిదని కాసింత దూరంగా జరిగి మౌనంగా ఉండిపోయారు. కాసేపటి తర్వాత బాబు గారు నోరు ఇప్పారు...

"దిష్టండి. ఇది దిష్టి. మరీ ముఖ్యంగా పొరుగు దిష్టి. కోనసీమ పచ్చగా ఉంటే చూడలేక పొరుగు వారు పెట్టిన దిష్టి ఇది. అందుకే కొబ్బరి తోటలు పాడైపోయాయి" అన్నారు. తాతబ్బులుకి ఏం అర్థం కాలేదు. అయినా... బాబు గారు పెద్ద మనిషి. సలహా కోసం వచ్చాం. వినాలి. ఆ తర్వాతే మాట్లాడాలి అనుకున్నారు. మళ్లీ బాబు గారే... " ఓ ఇరవై మందికి పైగా రైతుల్ని పిలిపించండి. మాట్లాడదాం" అన్నారు. " అయ్... అలాగేనండి" అంటూ జేబులోంచి ఫోన్ తీసి ఓ నంబర్ కొట్టి " హలో బంగార్రాజూ మన రైతులు ఓ పాతిక మంది పంచాయితీ కాడికి వచ్చేయండి. మాటాడాల. బాబు గారు మాట్లాడతారు" అన్నాడు. అవతలి నుంచి "ఓ ముప్ఫై మందిని అట్టుకొస్తా" అన్నాడు బంగార్రాజు. కొంతసేపటికి సీన్ కొబ్బరితోట నుంచి పంచాయితీ ఆపీసు కాడికి మారింది.

ఓ ఏభై మంది వరకూ రైతులు పోగయ్యారు. కుర్చీల్లో కూర్చున్న వారిని ఉద్దేశించి బాబు గారు మాట్లాడుతూ " మీ కొబ్బరి తోటలకి పొరుగు దిష్టి తగిలింది. దిష్టి తీయిస్తే మళ్లీ మామూలుగా దిగుబడి వస్తుంది ఏమంటారు" అన్నారు.

రైతుల మధ్యలో కూర్చున్న ఓ పెద్దాయన లేచి "బాబు గారూ.. నేను నలభై సంవచ్చరాలుగా యవుసాయం చేస్తున్నా. కొబ్బరి తోటలకి దిష్టి తగలడం ఎప్పుడూ వినలేదు. వరి పొలాల్లో కూడా పిట్టా, పురుగు పోవడానికి ఏవో బొమ్మలు పెడతారు కానీ ఇలా దిష్టి బొమ్మలు నేనెప్పుడూ సూడలేదు" అన్నారు. "పెద్దాయనా... మరి ఇదేటంటారు. ఇలా కొబ్బరి తోటలు పాడై పోవడం వెనుక ఏముందంటారు" అని అడిగారు బాబు గారు. "ఏటుంటది బాబూ. అంతా మేం చేసుకున్నదే. ఎక్కువ డబ్బులకి ఆశ పడి ప్రతి రైతూ పచ్చని పొలాలని చెరువులు చేసేశారు. చేపలని, రొయ్యలని కొత్త పంటలు అట్టుకొచ్చేశారు. భూతల్లి ఏడెక్కిపోయింది. కోపం తెచ్చేసుకుంది. భూసారం దెబ్బతినేసింది. పోనీ అని ఆ ఆక్వా రైతులైనా బాగుపడ్డారా అంటే అదీ లేదు. తొలీత రొయ్యల చెరువులేసినోళ్లకి నాలుగు డబ్బులు కనిపించాయి. అదేదో సామెత సెప్పినట్లు కోనసీమలో రైతులంతా చెరువులు తవ్వేస్తే భూమి ఎక్కడ నిలబడద్ది బాబూ. శపించేసింది. భూ తల్లిని కాపాడుకుంటే ఆ తల్లి మనల్ని కాపాడుతుంది. ఈ దిష్టి.. పొరుగు దిష్టి ఇదంతా ఎందుకొచ్చింది చెప్పండి" అని కూర్చుండి పోయాడు. ఈ మాటలు విన్న బాబు గారు ఏం మాట్లాడకుండా రెండు జేబుల్లోనూ చేతులు పెట్టుకుని అలా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

మోదీ అభివృద్ధి ఓ అంకెల గారడీ

ఎం. కోటేశ్వరరావు

పరీక్షల్లో మార్కులు తగ్గితే విద్యార్థుల గ్రేడ్ తగ్గుతుంది. సమాధానాల పేరుతో పేజీల కొద్దీ రాసినా అసలు విషయాలు లేకపోతే మార్కులు పడవు. కేంద్రంలో పదకొండు సంవత్సరాల పాలనలో నరేంద్రమోదీ సర్కార్ అందచేస్తున్న జీడీపీ వృద్ధి అంకెల నాణ్యతను అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) గతంలో ప్రశ్నించింది. ఎలాంటి స్పందన, మార్పులు లేకపోవటంతో కొద్ది రోజుల క్రితం సి గ్రేడ్‌కు తగ్గించింది. దీని గురించి గురువారం (2025 డిసెంబరు 4 న) లోక్‌సభలో సమర్థించుకుంటూ వచ్చే ఏడాది నుంచి 2022-23 సంవత్సరాన్ని నూతన ప్రాతిపదికగా తీసుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. ఎన్‌సీపీ సభ్యురాలు సుప్రియాసూలే అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ గణాంక విధానం గురించి ఐఎంఎఫ్ చెప్పింది తప్ప అభివృద్ధి గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, అనేక అంకెలకు బి గ్రేడ్ ఇచ్చిందని నిర్మలమ్మ అన్నారు. మన అంకెల నాణ్యత నాలుగు గ్రేడ్లలో దిగువ నుంచి రెండవదిగా ఉంది. దీనికి అభివృద్ధి అంచనాలకు సంబంధం లేదు, వాటికి చెబుతున్న భాష్యం మీదనే పేచీ. గణింపునకు మీరు తీసుకున్న ప్రాతిపదిక, పద్ధతి తప్పు, పాతబడిన సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని భాష్యాలు చెబుతున్నారంటూ 2025 ఆర్టికల్ నాలుగు నివేదికలో తలంటింది. మోదీ సర్కార్ అనుసరిస్తున్న విధానం గురించి ఇంటా బయటా గత పదేళ్ల నుంచి అనేక విమర్శలు వచ్చినప్పటికీ ఎలాంటి చలనం లేదు. ప్రస్తుతం 2011-12 సంవత్సర అంకెలను ప్రాతిపదికగా తీసుకొని గణాంకాలను రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 2022-23 ప్రాతిపదికగా కొత్త సూచీలను రూపొందిస్తామని కేంద్ర ప్రభుత్వ గణాంక కార్యక్రమాల అమలు శాఖ ప్రకటించింది. అయినప్పటికీ ఐఎంఎఫ్ మన దేశ సమాచార నాణ్యత గ్రేడ్‌ను తగ్గించింది. అంతర్జాతీయంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కొత్త ప్రాతిపదికన నూతన సూచీలను తయారు చేస్తారు. ఐఎంఎఫ్ చర్యతో మరోసారి కేంద్రం చెబుతున్న అభివృద్ధి అంకెల విశ్వసనీయత గురించి మీడియా, సామాన్య జనంలో చర్చలేకపోయినా ఆర్థికవేత్తలలో మొదలైంది.

మనదేశ జీడీపీ గురించి ప్రభుత్వం చెప్పే అంకెలకు ఐఎంఎఫ్ అంచనాలకు తేడా ఉంది. అది విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిజమైన జీడీపీ వృద్ధిరేటు 6.5శాతం కాగా 2025-26 తొలి మూడు మాసాల్లో 7.8శాతం ఉంది. ఐఎంఎఫ్ మాత్రం 2025-26 లో 6.6 శాతం ఉంటుందని, మరుసటి ఏడాది 6.2శాతమని అంచనా వేసింది. మన ప్రభుత్వంఅనుసరిస్తున్న గణాంక, విశ్లేషణపద్ధతులపై ఐఎంఎఫ్ చాలా సంవత్సరాల నుంచి విభేదిస్తున్నప్పటికీ సంస్థ నిబంధనల ప్రకారం సభ్య దేశాలు ఇచ్చిన అధికారిక సమాచారాన్ని ప్రాతిపదికగా తీసుకొని తన విశ్లేషణలను అందిస్తున్నది. వాటి గురించి తన భిన్నాభిప్రాయాన్ని చెప్పవచ్చు తప్ప సమాచారాన్ని తిరస్కరించేందుకు వీల్లేదు. కొద్ది సంవత్సరాలుగా వెల్లడిస్తున్న అభిప్రాయాలను జనందృష్టికి తేలేదు. ఇప్పుడు కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. గత పదేళ్లలో పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, కరోనా తరువాత చెప్పే అంకెలకు, వాస్తవానికి తేడా ఉంటోందని ఐఎంఎఫ్ భావించింది. కొద్ది సంవత్సరాలుగా అంతర్గతంగా తన విభేదాలను వెల్లడిస్తూనేఉంది, చివరికి 2025లో సమాచారం నాణ్యత గురించి గ్రేడ్‌ను తగ్గించింది. ఇప్పుడెందుకు ఆ పని చేసింది. ముందే చెప్పుకున్నట్లుగా వచ్చే ఏడాది 2022-23 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని

కొత్త సిరీస్‌ను విడుదలచేయనుంది గనుక ఇప్పటివరకు గమనించిన లోపాలను సరిదిద్దాలనే ఉద్దేశంతోనే ఈ పని చేసిందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు ఇచ్చే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నది తప్ప సంఘటిత, అసంఘటిత రంగ సమాచారాన్ని నిర్దిష్టంగా సేకరించటం లేదనే విమర్శ ఉంది. ద్రవ్యోల్బణాన్ని లెక్కించేందుకు టోకు ధరలను ప్రామాణికంగా తీసుకుంటున్నది, దీనికి బదులు ఉత్పత్తిధరలు, రంగాల వారీ ధరలను పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. మొత్తం మీద ఆర్థికరంగం గురించి ఎలాంటి వ్యాఖ్య చేయలేదు కదా, నాణ్యత లేని సమాచారం ఆధారంగా తీసుకోవటాన్ని ఐఎంఎఫ్ తప్పుపట్టిందని మాత్రమే కొందరు సూత్రీకరిస్తున్నారు. రుణాలు, విదేశీ మారక ద్రవ్యం, ఖర్చు గురించి సరైన లెక్కలే చెబుతున్నారు కదా అంటున్నారు. ముఖం ఎలా ఉందో ఎవరికైనా తెలుస్తుంది, దాన్ని వేరేగా చెబితే వెంటనే బండారం బయటపడుతుంది. శరీరం అంతర్భాగంలో ఉన్న వాటిని ఎవరో ఒక నిపుణుడు చెబితేనే కదా మనకు తెలిసేది, ఆ చెప్పటంలోనే నిపుణుల మధ్య ఏకాభిప్రాయం, నాణ్యత లేదన్నది సమస్య. కేవలం చెయ్యి చూసి అంతా బాగానే ఉందంటే కుదురుతుందా? నాణ్యత లేని వస్తువును కొన్నప్పుడు అది ఎంతకాలం మన్నుతుందో తెలియదు, నాణ్యత లేని సమాచారం ప్రాతిపదికగా ఏ రంగమైనా దీర్ఘకాలిక వ్యూహాలను ఎలా రూపొందించుకుంటుంది?

జీడీపీ వృద్ధి రేటు ఎక్కువగా ఉందని చూపుతున్నప్పుడు దానికి తగినట్లుగా కార్పొరేట్ ఫలితాలు కనిపించటం లేదన్నది కొందరి ప్రశ్న. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతం ఉంటుందని, పబ్లిక్ ఫైనాన్స్, విధాన జాతీయ సంస్థ(ఎన్ఐపీఎఫ్‌పీ) చెప్పింది. మూడీస్ రేటింగ్ సంస్థ 2026, 2027 సంవత్సరాలలో ప్రపంచ వృద్ధి రేటు 2.5 -2.6 శాతం మధ్య, భారత వృద్ధి 6.4, 6.5, చైనా 4.5 శాతం ఉంటుందని పేర్కొన్నది. ఇవి చూడటానికి బాగానే ఉన్నాయి. పశ్చిమ దేశాల సూత్రం ప్రకారం జీడీపీ వృద్ధి రేటు కంటే కార్పొరేట్ లాభాల రేటు మూడు, నాలుగు శాతం ఎక్కువగా ఉంటుంది. మన దేశంలో కూడా దశాబ్దాల పాటు అలాగే ఉంది. కానీ సెప్టెంబరుతో ముగిసిన మూడు మాసాల్లో నిఫ్టీ 50 సూచికలో పెరుగుదల కేవలం ఏడు శాతమే. మొత్తం లాభాలు 13 శాతం కాగా పన్నులు పోను నికర లాభం తొమ్మిది శాతమే ఉంది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించకపోవచ్చుగానీ దాన్ని విస్మరించలేము. నిఫ్టీ మైక్రోకాప్ 250 అమ్మకాల వృద్ధి 12 శాతం ఉన్నా, మొత్తం లాభాలు ఆరు శాతమే ఉన్నాయి. జీడీపీ వృద్ధి రేటు స్థిరంగా ఉంటే ఈ ఫలితాల సంగతేమిటి? ఏ అంకెలు వాస్తవానికి దగ్గరగా ఉన్నట్లు? ఆసియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్ 2024 మేనెలలో జీడీపీ అంకెలు ఎలా వస్తున్నాయో నాకు నమ్మకంలేదు అని వ్యాఖ్యానించాడు. ఆ మాటలు వైరల్ కావటంతో ఒక్క రోజులోనే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. ఎక్కడి నుంచి వత్తిడి వచ్చిందో అర్థం చేసుకోవటం కష్టం కాదు. జీడీపీకి దోహదం చేసే వాటిలో వినియోగ వృద్ధి ఒకటి. దేశంలో నిజ వేతనాలు పడిపోవటం లేదా గిడసబారి పోయినట్లు చెబుతుండగా గృహస్తుల వినియోగం పెరిగిందని చెప్పటం మీద అనుమానాలు ఉన్నాయి. రెండవ అంశం పెట్టుబడులు, మొత్తం పెట్టుబడుల్లో ప్రైవేటు పెట్టుబడులు నరేంద్రమోదీ అధికారానికి వచ్చినప్పుడు జీడీపీలో 31.3 శాతం ఉంటే 2024-25 లో 29.6 శాతం ఉన్నాయి. మధ్యలో ఒకఏడాది మాత్రమే 31.2శాతం నమోదయ్యాయి. మిగిలినఅన్ని సంవత్సరాలలో అంతకంటే తక్కువే. ఈ కాలంలో కార్పొరేట్ పన్ను మొత్తం ప్రైవేటు రంగానికి ఇచ్చిన ప్రోత్సాహాన్ని చూస్తే కార్పొరేట్ పన్ను విధింపు 30 శాతం నుంచి 15 కు తగ్గించారు. అయినా పారిశ్రామిక రంగం వాటా జీడీపీలో 2014 తో పోల్చితే తగ్గింది లేదా స్థిరంగా ఉంది తప్ప పెరగలేదు. జీడీపీని 2022 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామన్నారు, వాజపేయి నుంచి మధ్యలో మన్మోహన్ సింగ్, ఇప్పుడు మోదీ వరకు భారీ మొత్తాలను కేటాయించి జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే విస్తరణ, సరిహద్దుల్లో రోడ్లు, వంతెనల వంటివి నిర్మిస్తున్నారు. అవి లేకపోతే పరిస్థితి మరింత దిగజారి ఉండేది, అదే సామర్థ్యాన్ని ఉత్పాదక రంగంలో ఎందుకు చూపలేకపోతున్నారు? మోటారు వాహనాలు, ఎలక్ట్రానిక్స్ వంటి వాటి ఉత్పాదకతను పెంచకపోయినా పడి పోకుండా చూసేందుకు ఇటీవల తగ్గించిన జీఎస్టీ కూడా ఆయా రంగాలకు ఉద్దీపనలో భాగమే. చిత్రం ఏమిటంటే జీఎస్టీ తగ్గించిన రెండు నెలల తరువాత నవంబరు మాసంలో పన్నువసూలు పెరగకపోగా వర్తమాన ఆర్థిక సంవత్సరంలో అతి తక్కువగా నమోదైంది. అందుకే నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు వంటి భజన బృందాలు ఇప్పుడు మూగపోయాయి. జీఎస్టీ తగ్గింపు గురించి గతేడాదే సంప్రదింపులు మొదలయ్యాయి. తగ్గింపుతో డిమాండ్ పెరిగి ప్రైవేటు రంగానికి పెద్ద ఊపు వస్తుందన్న అంచనాతో 2025-26 బడ్జెట్‌లో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించేందుకు పూనుకుంది. వాటిలో గ్రామీణ ఉపాధి పథకానికి నిధుల కోత ఒకటి. 2023-24 లో రు.89,154 కోట్లు ఖర్చు చేస్తే 2025-26 లో రు.86వేల కోట్లకు కుదించారు. 2025 జనవరిలో చూస్తే ఏడు రాష్ట్రాలలో ప్రకటించిన వేతన సగటు రు.294 కాగా చెల్లించిన మొత్తం రు.257 మాత్రమే. తెలంగాణలో రు.319 కిగాను రు.276, ఆంధ్రప్రదేశ్‌లో రు.300 కు గాను రు.258 చెల్లించారు. జీడీపీలో ప్రభుత్వ ఖర్చు వాటాను 15.6 నుంచి 15 శాతానికితగ్గించారు. వాస్తవంలోఇంకా దిగజారుతుందేమో తెలియదు.

మొత్తంగా దేశమంతటా శ్రామికుల నిజవేతనాలు పెరగకుండా వస్తు, సేవలకు గిరాకీ పెరగదు. ఉద్యోగులకు వేతన సవరణ చేసినంత మాత్రాన మొత్తం గిరాకీ మీద దాని ప్రభావం పెద్దగా ఉండదు. ప్రభుత్వాల ఖర్చు అంటే ఏదో ఒక రూపంలో జనాలకు చేరే మొత్తాలతోపాటు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకూ లబ్ధి చేకూరు తుంది. ప్రైవేటు పెట్టుబడులు అలాంటివి కాదు, వాటికి లాభాలే ప్రాతిపదికగా ఉంటాయి. అందువలన ప్రభుత్వ వైఖరిలో వచ్చిన మార్పు రానున్న రోజుల్లో ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారి తీస్తుందో చూడాల్సి ఉంది. అధికారంలో ఎవరున్నా చేసింది అంకెల గారడీ గనుకనే సామాన్యుల స్థితిలో పెద్దగా మార్పులేదు, వచ్చే ఏడాది నూతన సీరీస్ అంటున్నారు గనుక మరో జిమ్మిక్కు చేయనున్నారా !

రాజ్యాధికారంతోనే అంబేద్కర్‌కు నివాళి

బి. పుల్లెంల గణేష్

భారతదేశ చరిత్ర గురించి చెప్పుకోవాల్సి వస్తే అంబేద్కర్‌కి ముందు అంబేద్కర్ తర్వాతనని చెప్పుకోక తప్పని జగమెరిగిన చారిత్రక సత్యం. భారతదేశ చరిత్రను ప్రభావితం చేసినటువంటి ప్రముఖ వ్యక్తులలో అత్యంత ప్రభావశీల వ్యక్తులలో ముఖ్యులు డా.బాబాసాహెబ్ బీఆర్.అంబేద్కర్. ఎందుకు మరి భారతదేశ చరిత్రకి అంబేద్కర్‌కి అంతటి ప్రాముఖ్యత ఉన్నదంటే అంబేద్కర్ పుట్టడాని కంటే ముందు భారతదేశ సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులు అన్ని కూడా అగమ్యగోచరంగా ఉన్నాయి. దాదాపు 2000 సంవత్సరాలుగా భారతదేశంలో 10 శాతం ఉన్న అగ్రవర్ణాల స్వార్థ ప్రయోజనాల కోసం దేశ సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులన్నీ తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ఈ దేశంలో 10 శాతం ఉన్న అగ్రవర్ణ పాలకులు, వారి పాలన మూలంగా 90 శాతం ఉన్న అణగారిన వర్గాలకు స్వేచ్ఛ సమానత్వం సోదర భావం ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో బతికే సమాన హక్కులు లేవు. అణగారిన వర్గాల మెడల్లకి అగ్ర వర్ణాలు బానిసత్వపు సంకెళ్లు వేసి 2000 సంవత్సరాలుగా తమ గుప్పిట్లో పెట్టుకుని వెట్టి చాకిరి చేయించుకున్నారు. ఇలాంటిపరిస్థితుల్లో ఆశాజ్యోతి వలె వచ్చి భారతదేశ సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులన్నీ కూడా సరిసమానం చేసిన ఒకే ఒక వ్యక్తి డా. అంబేద్కర్. 1891 ఏప్రిల్ 14 న మధ్యప్రదేశ్‌లోని "మౌ" అనే గ్రామంలో రాంజీ సక్పాల్, బీమాబాయి అనే దంపతులకు 14'వ సంతానంగా అంబేద్కర్ జన్మించాడు. 1956 డిసెంబర్ 6 న తుదిశ్వాస విడిచారు.

అంబేద్కర్ కీర్తినితగ్గించి చూపించడానికి దేశాన్ని పాలిస్తున్న అగ్రవర్ణ నాయకులు చేయాల్సినదంతా చేశారు. అంబేద్కర్ అంటే దళిత కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలు పడి ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి భారత రాజ్యాంగం అనే గొప్ప గ్రంథాన్నిరాసిన ఒక గొప్ప సంఘసంస్కర్తగా చిత్రీకరించారు. అణగారిన వర్గాలకు ఏ లక్ష్యాన్ని సాధించుకోవాలని చెప్పాడో పాఠ్యాంశాల రూపంలో చెప్పకపోవడం దేశ అగ్రవర్ణ పాలకుల స్వార్థ బుద్ధికి నిదర్శనం. అగ్రవర్ణాలు అంబేద్కర్ స్థాయిని ఉద్దేశ పూర్వకంగా తగ్గించి రాసిన చరిత్రనే నేడు ఎందరో మేధావులు, విద్యావంతులు అదే సత్యమని కూడా నమ్ముతున్నారు. కానీ అంబేద్కర్ అంటే మనం గుర్తు చేసుకోవాల్సింది ఆయన ఒక దళితుడనో, ఎన్నో కష్టాలు కన్నీళ్లు పడి భారత రాజ్యాంగ గ్రంథాన్ని రాసి భారతదేశానికి ఒక దిక్సూచిగా మారిన ఒక సంఘ సంస్కర్తగా చూడడం మాత్రమే కాదు, అంబేద్కర్ అంటే సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, స్కాలర్‌షిప్పులు, రిజర్వేషన్లు అనే అంశాలనే చర్చించుకోవడం కాదు, అగ్రవర్ణాలకి, అణగారిన వర్గాలకి ఒక సైద్ధాంతిక గీత గీసి అసమానతలు పెంచి పోషించాలనుకునే అగ్రవర్ణ సమాజానికి, సమ సమాజం, ప్రజాస్వామ్య గణతంత్ర విలువలు కావాలనుకునే అణగారినసమాజానికి మధ్య సామాజిక రాజకీయసాంస్కృతిక భావాజాల పోరాటంచేసి, రాజ్యాధికారంతో సమాజాన్ని మార్చడం, సమాజంతో రాజ్యాధికారానికి రావడం ఒక సైకిల్ ప్రాసెస్ వలె సామాజిక పరివర్తన చేయడమే అంబేద్కర్‌కి ఇచ్చే ఘనమైన నివాళి తప్ప, ఆయన జయంతి, వర్ధంతులు వచ్చినప్పుడు ఏదో ఒక పండగ వాతావరణం వలే చేసి మరుసటి రోజు మళ్లీ సాధారణ

సంప్రదాయక, తాత్కాలిక భౌతిక పదార్థాల కోసం జీవితం గడపడమే నేడు అంబేద్కర్ మార్గంలో పోయే వ్యక్తులు, సంఘాలు, పార్టీల లక్ష్యం కాకూడదు.

అంబేద్కర్ మించిన గొప్ప దేశ భక్తుడు నేటి వరకు లేడు, భవిష్యత్తులో పుడతాడని అని కూడా ఆశించలేము. ఆదర్శవంతమైన పాలనని ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా గ్రహించగలిగిన ఎన్నో కలలు కని ప్రపంచంలో ఏ దేశానికి లేని సర్వకాలికమైన సర్వజనామైన విశ్వజనీనమైన మహోన్నత రాజ్యాంగాన్ని భారతదేశ ప్రజలకి గొప్ప బహుమతిగా అంబేద్కర్ ఇచ్చాడు. అంబేద్కర్ స్థాయిని తగ్గించడం కోసం ఈ దేశ అగ్రవర్ణ నాయకులు అంబేద్కర్ ఒక అణగారిన వర్గాల నాయకుడిగా తప్పుగా పాఠ్యాంశాల్లో చిత్రీకరించారు కానీ అంబేద్కర్ ఒక అణగారిన వర్గాలకి మాత్రమే కాదు, భారతదేశం మొత్తానికి నాయకుడు, దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తుల్లో మొదటివాడు. అంతటి స్థాయి, అర్హత ఉన్న వ్యక్తి కాబట్టే ఆయనలోని జ్ఞాన శక్తిని గ్రహించి ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అత్యంత ప్రముఖుల్లో అంబేద్కర్ ఒకరనే సత్యాన్ని ప్రపంచానికి చూపించడం కోసమే ఐక్యరాజ్య సమితి అంబేద్కర్ జయంతి అయిన ఏప్రిల్14 ని ప్రపంచ జ్ఞాన దినోత్సవంగా జరుపుకోవాలని ఆదేశించి నిర్దేశించింది. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన వ్యక్తిగా అంబేద్కర్‌ను అగ్రవర్ణాలు తప్పుగా చిత్రీకరించాయి. భారతదేశం ఎల్లకాలం స్వేచ్ఛ సమానత్వం సోదరభావం ప్రజాస్వామ్య గణతంత్ర భావాలతో విరాజిల్లేలా కలలు గని వాటిని భారత రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచారు. అణగారిన సమాజానికి హక్కులు సాధించే క్రమంలో అంబేద్కర్ అలుపెరుగని, రాజీపడని వీరోచిత పోరాటాన్ని నాటి అగ్రవర్ణ నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారనేది భారతదేశ చరిత్రలో అంతగా బహిర్గతం కానీ సత్యం. అలాంటి సత్యం నేటి ఆధునిక సమాజంలో తెలియకుండా, చరిత్రని అంతా కూడా తారుమారు చేసి అంబేద్కర్ స్థాయిని తగ్గించి అగ్రవర్ణ పాలకులు తమకు అనుకూలంగా స్వాతంత్ర్యానంతరం భారతీయ కుల వ్యవస్థ రూపాన్ని మార్చుకొని అదే గుణాలు కలిగి ఉండడం నేడు మేధావులు, విద్యావంతులు గ్రహించాల్సిన అవసరం ఉంది.

అసమానత విలువలు పాటించే అగ్రవర్ణ సమాజం చేత సామాజిక పరివర్తన కాదని అంబేద్కర్ గ్రహించే భారత రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికి సమాన హక్కులు ఇచ్చి తరతరాలుగా అగ్రవర్ణ సమాజం చేత బానిసలుగా, బాధితులుగా ఉన్న 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకి తాను కల్పించిన వజ్రాయుధమైన ఓటు ఖడ్గంతో అణగారిన వర్గాల రాజ్యాధికారాన్ని సాధించుకొని సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన చేసి భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ఉన్నత స్థానంలో ఉండి, ప్రపంచానికి పెద్దన్నగా ఉండాలని అదే తన కల అనే సందేశాన్ని ఇస్తూ, గొప్ప లక్ష్యాన్ని అణగారిన సమాజం ముందు పెట్టాడు.

దేశంలో అంబేద్కర్ భావజాలాన్ని ఆచరణాత్మకంగా నిరూపణ చేసి అంబేద్కరిజాన్ని గెలిపించింది మాత్రం ఒకే ఒక్కడు కాన్షీరాం. అంబేద్కర్ తత్వాన్ని పూర్తిగా అధ్యయనం చేసి అంబేద్కర్ ఈ సమాజం నుంచి ఏదైతే ఆశించారో భారతీయ సమాజం ఎలా ఉండాలని కలలు కన్నారో వాటిని కాన్షీరాం నిజం చేశారు. ఉత్తరప్రదేశ్ కేంద్రంగా భారతదేశం అంతటా అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేశారు. అంబేద్కర్ ఆశించిన రాజ్యాధికారాన్ని సాధించి సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక ఫలితాలని సాధించాలని ఆశిద్దాం. అంబేద్కర్ పేరుతో ఎన్నో కుల సంఘాలను, సామాజిక సంఘాలు స్థాపించి అంబేద్కర్‌కి ఒక అభిమానిగా ఉంటూ ఆయన కోరుకున్న విధంగా సామాజిక పరివర్తన కోసం కృషి చేయకుండా కేవలం అభిమానులుగా ఉంటే అంబేద్కర్ భావజాలం సామాజికంగా, రాజకీయంగా గెలవదు.

సెల్: 9553041549

ఇండిగోతో ఇక్కట్లు

దేశ వ్యాప్తంగా 550 కి పైగా విమాన సర్వీసులు రద్దు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- క్షమాపణలు చెప్పిన విమానయాన సంస్థ
- రోస్టర్ నిబంధనలు వ్యతిరేకిస్తూ పైలట్ల లేఖ
- ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెనక్కి తీసుకున్న డీజీసీఏ

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాలలో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొంది. ఇండిగో సంస్థ సేవల్లో తీవ్ర అంతరాయం కారణంగా ఇప్పటి వరకు 550కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. అనేక చోట్ల ప్రయాణీకులు టెర్మినల్ అంతస్తులలో పడుకోవడం, ఎయిర్ లైన్ కౌంటర్ల వద్ద రద్దీ, అధికారుల నుంచి సమాధానాలు కోరుతున్న పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఇండిగోకు చెందిన కార్యాచరణ సంక్షోభం భారతదేశ విమానయాన రంగంలో అత్యంత దారుణమైన సంక్షోభాలలో ఒకటిగా నిలిచింది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాలలో పొడవాటి క్యూ లైన్లలో అలసిపోయిన ప్రయాణికుల అవస్థలు, నేలపై పడుకున్న వైనం, సంబంధిత విమానయాన సంస్థ సిబ్బందితో వాదనకు దిగిన దృశ్యాలు కనిపించాయి. శుక్రవారం ఒక్క రోజే 400 వరకు ఇండిగో విమానాలు రద్దయ్యాయి. దీంతో డిసెంబరు 2 నుంచి రద్దు చేయబడిన మొత్తం విమానాల సంఖ్య 1,100 దాటింది. ఇండిగో విమాన రద్దు సంక్షోభం నాల్గవ రోజుకు చేరుకోవడంతో ఆ సంస్థ శుక్రవారం తన ప్రయాణికులను అనేక సూచనలు చేసింది. తమ ప్రయాణికులు వెబ్‌సైట్‌లో విమాన స్థితిని, తాము పంపిన నోటిఫికేషన్‌లను తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేసింది. 'మీ విమానం రద్దయితే దయచేసి విమానాశ్రయానికి రాకండి' అని ఇండిగో పేర్కొంది. 'వేచి ఉన్న సమయానికి మమ్మల్ని క్షమించండి. కొన్ని వేచి ఉండే సమయాలను తగ్గించడానికి మేము మా సంప్రదింపుల కేంద్రం సామర్థ్యాన్ని భారీగా పెంచాము' అని తెలిపింది. ఢిల్లీలో గతంలో 225 విమానాలు రద్దు కాగా, శుక్రవారం అన్ని విమానాలు రద్దయ్యాయి. బెంగళూరులో 102, ముంబైలో104, హైదరాబాద్‌లో 92, గోవాలో 30, చెన్నైలో సాయంత్రం 6 గంటల వరకు అన్ని విమానాలు రద్దయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 నాటికి కార్యకలాపాలు పూర్తిగా స్థిరీకరించబడతాయని భావిస్తున్నట్లు ఇండిగో సంస్థ... ఏవియేషన్ వాచ్‌డాగ్ డీజీసీఏకి తెలియజేసింది. ఇది రాబోయే రెండు నెలలకు ఇప్పటికే విమానాలను బుక్ చేసుకున్న ప్రయాణీకులలో మరింత ఆందోళనలను రేకెత్తిస్తోంది. దేశంలోని విమానాశ్రయాలకు మూడు రోజులుగా ఇండిగో కస్టమర్లు భారీగా తరలివచ్చారు. అనేక విమానాలు ఆలస్యంగా నడవడం, మరిన్ని రద్దు కావడంతో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. కొనసాగుతున్న జాప్యాలు, రద్దులపై విచారం వ్యక్తం చేస్తూ విమానయాన సంస్థ ఇప్పటివరకు రెండుసార్లు క్షమాపణలు చెప్పింది. కొనసాగుతున్న సంక్షోభం గురించి ఇండిగో వివరించిన తర్వాత, డీజీసీఏ ఒక ప్రకటనలో ఇలా పేర్కొంది : విమాన విధి సమయ పరిమితులు దశ 2 అమలులో తప్పుడు అంచనా, ప్రణాళికా లోపం కారణంగా అంతరాయాలు తలెత్తాయి. వాస్తవ సిబ్బంది అవసరం వారి అంచనాలను మించిపోయిందని విమానయాన సంస్థ అంగీకరించింది' అని తెలిపింది. నవంబరు 1 నుంచి అమలులోకి కొత్తగా వచ్చిన విమాన విధి సమయ పరిమితులు నిబంధనల రెండవ దశను అమలు చేయడంలో ఇండిగో ఇబ్బంది పడటం వల్ల విమాన అంతరాయాలు ఎక్కువగా సంభవించాయి. 'అయితే వారపు విశ్రాంతికి బదులుగా సెలవును ఉపయోగించకూడదు' అని నిబంధనలలోని కీలక సూచనను డీజీసీఏ వెనక్కి తీసుకుంది. ఇండిగోకు పైలట్లు-ఇన్-కమాండ్ అవసరం పెరుగుతూనే ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలు రాత్రి పూట విమానయాన సంస్థలలో పైలట్ విధి గంటలను పరిమితం చేశాయి. గత నెలలో అమలులోకి వచ్చిన ఇండిగోకు ఇచ్చిన రోస్టర్ నిబంధనల దశ 2 అమలుకు వ్యతిరేకంగా పైలట్ల సంఘం డీజీసీఏకి లేఖ రాసింది. 'అనేక ప్రాతినిధ్యాలు, అధికారిక లేఖలు, మీ కార్యాలయంతో ప్రత్యక్ష చర్చలు జరిపినప్పటికీ తీసుకున్న ఈ నిర్ణయం సవరించిన ఫ్లైట్ డ్యూటీ సమయ పరిమితి (ఎఫ్‌డీటీఎల్) సీఏఆర్ దశ 2 అమలు నిబంధనల స్ఫూర్తిని, విమాన ప్రయాణీకుల భద్రతను తీవ్రంగా దెబ్బతీసింది' అని పేర్కొంది. మరోవైపు, ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పైలట్లు సహకరించాలని డీజీసీఏ కోరింది. 'ప్రయాణీకుల సంఖ్య బాగా పెరుగుతుందని భావిస్తున్నారు. వాతావరణ సంబంధిత ప్రభావాలు షెడ్యూలింగ్, విమాన భద్రతను మరింత క్లిష్టతరం చేస్తాయి. ఈ కాలంలో విమానాల రద్దులను నివారించడానికి స్థిరమైన, సజావుగా విమాన కార్యకలాపాలను నిర్వహించడానికి భారతదేశం అంతటా ఉన్న అన్ని పైలట్ సంస్థలు, సంఘాలు, పైలట్ల పూర్తి సహకారాన్ని డీజీసీఏ అధ్యక్షుడు కిద్వాయ్ కోరారు' అని పీటీఐ తెలిపింది.

ప్రయాణికులకు హోటల్ బస... ఆహారం

అసౌకర్యం ఎదుర్కొంటున్న తమ ప్రయాణికుల సౌలభ్యం కోసం నగరాల్లో వేలాది హోటల్ గదులు, రోడ్డు రవాణాను ఏర్పాటు చేసినట్లు ఇండిగో తెలిపింది. 'విమానాశ్రయాలలో మా వేచి ఉన్న ప్రయాణికులకు ఆహారం, స్నాక్స్ అందించే ప్రయత్నం చేస్తున్నాము. సాధ్యమైన చోట సీనియర్ సిటిజన్లకు లాంజ్ సౌకర్యం ఏర్పాటు చేస్తాము' అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విమాన అంతరాయాల మధ్య, రద్దులకు సంబంధించిన అన్ని వాపసులు స్వయంచాలకంగా అసలు చెల్లింపు విధానానికి ప్రక్రియ చేయనున్నట్లు పేర్కొంది. '5 డిసెంబరు 2025 నుంచి 15 డిసెంబరు 2025 మధ్య ప్రయాణానికి బుకింగ్‌ల' కు సంబంధించి అన్ని రద్దులు, రీషెడ్యూల్ అభ్యర్థనలపై పూర్తి మాఫీని అందిస్తున్నామని ఇండిగో ప్రకటించింది.

ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణం

ఇండిగో విమాన సర్వీసులపై రాహుల్

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయం కొనసాగుతోంది. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం స్పందించారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే దీనికి ప్రధాన కారణమంటూ ఆయన ఎక్స్ వేదికగా ఆరోపణలు చేశారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే ఇండిగో విమానాల రద్దు, ఆలస్యాలకు ప్రధాన కారణాలన్నారు. ఎప్పటిలాగానే ఈ నిస్సహాయతకు ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. ఇలాంటివి మరోసారి జరగకుండా ఉండేందుకు విమానయాన రంగం సహా అన్నింట్లోనూ న్యాయమైన పోటీ ఉండాలని పిలుపునిచ్చారు. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదంటూ మండిపడ్డారు.

పార్లమెంటులో విపక్షం నిలదీత

ఇండిగో విమానాల రద్దు అంశం పార్లమెంటుకు చేరింది. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ విమానయాన సంస్థ 'గుత్తాధిపత్యాన్ని' ప్రశ్నించారు. శుక్రవారం రాజ్యసభలో దేశంలోని ప్రధాన విమానాశ్రయాలలో ఇండిగో విమాన సర్వీసుల రద్దుపై ప్రతిపక్షం ఆందోళన వ్యక్తం చేసింది. ముందు రోజు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఇండిగో వైఫల్యం' పై ప్రభుత్వాన్ని విమర్శించారు. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలపై రద్దుల ప్రభావాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, కేంద్రం తీసుకుంటున్న చర్యలను సభకు తెలియజేయాలని తివారీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయం సభ, సభ్యులకు సంబంధించినదని, ఎందుకంటే పార్లమెంటు వాయిదా పడిన వారాంతంలో చాలా మంది తమ నియోజకవర్గాలకు తిరిగి వెళతారని ఆయన అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సమాధానమిస్తూ, పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ విషయాన్ని సమీక్షిస్తున్నారని తెలిపారు. 'సభకు వచ్చే ముందు, నేను పౌర విమానయాన మంత్రితో మాట్లాడి, సభకు మాత్రమే కాకుండా దేశ ప్రజలకు కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందని ఎత్తి చూపాను' అని రిజిజు సభకు వివరించారు. తివారీ ఈ అంశాన్ని లేవనెత్తుతూ, శుక్రవారం వరకు ఇండిగోకు చెందిన 500 కు పైగా విమానాలు రద్దయ్యాయని చెప్పారు. 'ఈ రోజు శుక్రవారం, చాలా మంది సభ్యులు తమ నియోజకవర్గాలకు తిరిగి వెళ్లాలనుకుంటున్నారు. అందువల్ల నేను లేవనెత్తుతున్న ఈ ప్రశ్న సభతో పాటు సభ్యులకు కూడా సంబంధించినది. నా అభ్యర్థన ఏమిటంటే, ఈ సమస్య తలెత్తుతున్న నిబంధనలు రూపొందించిన మంత్రి పరిస్థితిని, ఎప్పటికి ఈ సమస్యను పరిష్కరిస్తారు' అని తివారీ ప్రశ్నించారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది రాజ్యసభలో 180వ నిబంధన కింద ఒక నోటీసును కూడా ప్రవేశపెట్టారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడటం వల్ల విమానాలు రద్దు కావడం, దేశవ్యాప్తంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగడం వంటి కారణాలపై పౌర విమానయాన సంస్థ ఒక ప్రకటన చేయాలని ఆమె కోరారు.

ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో ఆన్‌లైన్‌లో టెకీ దంపతుల రిసెప్షన్

భువనేశ్వర్: ఇండిగో విమాన సర్వీసుల రద్దు కొనసాగుతున్న వేళ... వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఓ టెకీ దంపతులకు వింత అనుభవం ఎదురైంది. ఇటీవలే పెళ్లి చేసుకున్న ఈ దంపతులు ఆన్‌లైన్‌లో రిసెప్షన్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. కర్నాటకలోని హుబ్బళ్లికి చెందిన మేధా క్షీర్‌సాగర్, ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన సంగమ దాస్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. నవంబరు 23న భువనేశ్వర్‌లో వీరి వివాహం జరిగింది. బుధవారం వధువు స్వస్థలం వద్ద రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హాజరయ్యేందుకు నవ దంపతులు భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు ఇండిగో విమానంలో టికెట్లు బుక్ చేసుకున్నారు. అయితే, విమాన సర్వీసుల్లో అంతరాయం వల్ల వీరు ప్రయాణించడం కుదరలేదు. అప్పటికే... వీరి రిసెప్షన్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. అతిథులు కూడా వేడుకకు హాజరవడంతో... వధూవరులు వర్చువల్‌గా ఇందులో పాల్గొన్నారు. రిసెప్షన్ ఏర్పాటుచేసిన హాల్‌లో స్క్రీన్ ఏర్పాటుచేసి వధూవరులను చూపించారు. ఆన్‌లైన్‌లోనే ఈ కొత్త జంటను బంధువులు ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

పుతిన్‌కు త్రివిధ దళాల గౌరవ వందనం

ఘన స్వాగతం పలికిన రాష్ట్రపతి, ప్రధాని

రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి పుష్పాంజలి ఘటించిన రష్యా అధినేత

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న సంగతి విదితమే. ఆయనకు శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో అధికారికంగా ఘన స్వాగతం లభించింది.

రాష్ట్రపతి భవన్ మైదానంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా ఆహ్వానించారు. ఆమెతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉన్నారు. రాష్ట్రపతి భవన్ వద్దకు పుతిన్ చేరుకోకముందే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, విదేశాంగమంత్రి జైశంకర్ అక్కడకు చేరుకున్నారు. అక్కడికి కాసేపటికే పుతిన్ చేరుకున్నారు. ఎర్ర తివాచీపై నడుస్తూ ఆయన భారత సైనికదళాల గౌరవవందనం స్వీకరించారు. ఆ తర్వాత రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీకి రష్యన్ ప్రతినిధుల బృందాన్ని పుతిన్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా భారత త్రివిధ దళాలకు చెందిన మిలిటరీ బ్యాండ్‌లు, ట్రంపెట్, డ్రమ్స్, పైప్స్, క్లారినెట్ వాయిద్య పరికరాలతో రష్యా జాతీయ గీతాలపానతో పాటు భారత జాతీయ గీతాలాపన చేశాయి. ఆ తర్వాత రాష్ట్రపతి భవన్ నుంచి పుతిన్ నేరుగా రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడి సందర్శకుల పుస్తకంలో సందేశం రాశారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌కు బయల్దేరారు.

పుతిన్ ప్రయాణించిన కారుపై చర్చ

నాలుగేళ్ల తర్వాత భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడికి గురువారం సాయంత్రం పాలం విమానాశ్రయంలో ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికిన సంగతి విదితమే. కాగా అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో లోక్ కల్యాణ్‌మార్గ్‌లోని ప్రధాని నివాసానికి వెళ్లారు. అక్కడ పుతిన్‌కు మోదీ ప్రత్యేక విందు కూడా ఏర్పాటు చేశారు. అయితే మోదీ, పుతిన్ కలిసి ప్రయాణించిన వాహనం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మోదీ తాను వాడే విలాసవంతమైన రేంజ్‌రోవర్ కారును పక్కనపెట్టి ఒక సాధారణ ఫార్చ్యూనర్‌లో పుతిన్‌ను తీసుకెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ టయోటా ఫార్చ్యూనర్ సిగ్మా 4 ఎంటీ వాహనం మహారాష్ట్ర నంబరుతో రిజిస్టర్ అయ్యి ఉంది. ఈ బీఎస్-6 వాహనం 2024 ఏప్రిల్‌లో రిజిస్టర్ అయినట్లుగా తెలుస్తోంది. 2039 ఏప్రిల్ వరకు ఈ వాహనానికి సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చెల్లుతుంది. రష్యా అధినేతను తీసుకెళ్లేందుకు మోదీ ఈ కారు వాడటం... పుతిన్ కూడా తన ఆరస్ సెనేట్ లిమోసిన్ కారులో కాకుండా ఫార్చ్యూనర్‌లో ప్రయాణించేందుకు అంగీకారం తెలిపారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రయాణాలు సాగించే ఇద్దరు దేశాధినేతలు భద్రతా ప్రమాణాలకు భిన్నంగా ఒక సాధారణ కారులో ప్రయాణించడం చర్చనీయాంశమైంది.

మరో 8 దేశాలకు యూపీఐ

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు కారణమైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మరిన్ని దేశాలకు విస్తరించనుంది. మరో 8 దేశాలతో భారత్ చర్చలు జరుపుతోందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు వెల్లడించారు. ప్రస్తుతం భూటాన్, సింగపూర్, ఖతార్, మారిషస్, నేపాల్, యూఏఈ, శ్రీలంక, ఫ్రాన్స్ దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆయా దేశాలకు భారత పర్యాటకులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు వీలుపడుతోంది. ఇప్పుడు యూపీఐ లావాదేవీలను అనుమతించేలా మరో 7-8 దేశాలతో భారత్ చర్చలు జరుపుతోందని నాగరాజు అన్నారు. అందులో తూర్పు ఆసియా దేశాలు ఉన్నాయని చెప్పారు. కొన్ని దేశాలతో వాణిజ్య చర్చలు జరుపుతున్నామని, ఇందులో భాగంగా యూపీఐ కోసం ఒక మార్గం అన్వేషిస్తున్నామని చెప్పారు. తద్వారా యూపీఐ సేవలందిస్తున్న ఫిన్‌టెక్ పరిశ్రమ... ఆర్థిక రంగంలో కూడా అడుగు పెట్టడానికి వీలవుతుందన్నారు. తద్వారా దేశానికీ ప్రయోజనం చేకూరుతుందని నాగరాజు చెప్పారు

ఎల్డీఎఫ్ నాయకత్వ నిర్ణయం పార్టీదే విజయన్

కొచ్చి : వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌కు తాను నాయకత్వం వహించాలా, వద్దా అనేది తమ పార్టీ సీపీఎం నిర్ణయిస్తుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్-మే నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెమీ ఫైనల్‌గా పరిగణించే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఎర్నాకులం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు మాట్లాడుతూ 'పినరయి విజయన్ 3.0 ఆశించవచ్చా అని అడిగినప్పుడు వరుసగా రెండు సార్లు ఎల్‌డీఎఫ్‌ను విజయపథంలో నడిపించిన ఘనత విజయన్... 'ఇది ప్రజలు నిర్ణయించుకోవాలి. నా విషయానికొస్తే, పార్టీ నిర్ణయం తీసుకోవాలి. ఇప్పుడు దాని గురించి చర్చించడంలో ఉపయోగం లేదు' అని తెలిపారు. అంతకుముందు, రాష్ట్ర ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ సహా పార్టీ సీనియర్ నాయకులు, తదుపరి రాష్ట్ర ఎన్నికలలో విజయన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్‌డీఎఫ్) కి నాయకత్వం వహిస్తారని చెప్పారు.

అభివృద్ధా... రాజకీయమా?

మధురై వివాదంపై స్టాలిన్

చెన్నై: మధురై కార్తీక దీపం వివాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ వివాదంపై శుక్రవారం స్టాలిన్ స్పందిస్తూ మధురై నగరంలో అభివృద్ధి కావాలా లేక రాజకీయాలు కావాలా అనేది ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దీప స్తంభం పైకి వెళ్లి దీపాన్ని వెలిగించాలని ఓ వ్యక్తి కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కొండపై చారిత్రాత్మక సుబ్రమణ్యస్వామి ఆలయం, కాశీ విశ్వనాథన్ ఆలయం, 17వ శతాబ్దపు మసీదు అయిన సికిందర్ బాదుషా దర్గా ఉన్నాయి. ఒక మితవాద కార్యకర్త దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జీఆర్ స్వామినాథన్ పిటిషనర్ కోరికను అనుమతించారు. పిటిషనర్‌తోపాటు మరో పదిమందిని తిరుప్పరకుండ్రం కొండపై ఉన్న దీప స్తంభంపైకి వెళ్లి కార్తీక దీపాన్ని వెలిగించడానికి అనుమతినిస్తూ మధురై బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు సమర్థించింది. అయితే దీనిపై డీఎంకే ప్రభుత్వం స్పందించలేదు. దీంతో గురువారం మధురైలో బీజేపీ నేతలు ఆందోళన చేశారు. పవిత్ర కార్తీక దీపం వెలిగించడానికి కోర్టు ఇచ్చిన ఆదేశాలను డీఎంకే ధిక్కరించిందని, హిందువుల విశ్వాసాలు, భక్తుల నమ్మకాల్ని పట్టించుకోవడం లేదని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ స్టాలిన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తాజాగా ఈ వివాదంపై స్టాలిన్ స్పందించారు. 'మధురైకి అభివృద్ధి రాజకీయాలు అవసరమా లేక రాజకీయాలు అవసరమా అనేది ప్రజలే నిర్ణయిస్తారన్నారు. మెట్రో రైలు, ఎయిమ్స్, కొత్త కంపెనీలు, ఉద్యోగాలు... మధురై అభివృద్ధి కోసం అక్కడ నివసించే ప్రజలు కోరుకుంటున్నవి ఇవే' అని స్టాలిన్ పేర్కొన్నారు.

రూ.1,120 కోట్ల రిలయన్స్ ఆస్తుల జప్తు

న్యూఢిల్లీ: రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, యెస్ బ్యాంక్‌లకు సంబంధించిన మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.1,120 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసినట్లు ఏజెన్సీ వర్గాలు శుక్రవారం తెలిపాయి. అటాచ్ చేయబడిన ఆస్తులలో 18కి పైగా ఆస్తులు, స్థిర డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్, రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్‌కు చెందిన కోట్ చేయని పెట్టుబడులలో వాటాలు ఉన్నాయి. ఈ జాబితాలో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు చెందిన ఏడు ఆస్తులు, రిలయన్స్ పవర్ లిమిటెడ్‌కు చెందిన రెండు ఆస్తులు, రిలయన్స్ వాల్యూ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన తొమ్మిది ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రిలయన్స్ వెంచర్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రై.లి, ఫై మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆధార్ ప్రాపర్టీ కన్సల్టెన్సీ ప్రై.లి, గమేసా ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్‌ప్రై.లి, రిలయన్స్ వెంచ్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రై.లి, ఫై మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రై.లి నమోదు కాని పెట్టుబడులు, నగదు ఉందని ఆ వర్గాలు తెలిపాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ బ్యాంక్ మోసం కేసుల్లో ఈడీ గతంలో రూ.8,997 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మొత్తం అటాచ్‌మెంట్ ఆస్తుల విలువ రూ.10,117 కోట్లకు చేరుకుంది.

అరవడానికి వచ్చామా! శశిథరూర్

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్), ఇతర అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళనలు లేవనెత్తుతుండడంతో పార్లమెంట్ సమావేశాల్లో అంతరాయాలు నెలకొంటుండడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పార్లమెంటులో చర్చించడానికి గందరగోళం సృష్టించాల్సిన అవసరం లేదని ప్రతిపక్షాలను తప్పుబట్టారు. ఇక్కడ దేశం కోసం, ప్రజల కోసం మాట్లాడాలిగానీ...అరిచి గందరగోళం సృష్టించొద్దని సహచర ఎంపీలకు సూచించారు. 'నేను మొదటినుంచీ ఇదే చెబుతున్నాను. సోనియాగాంధీ సహా నా పార్టీ నాయకులకు ఈ విషయం బాగా తెలుసు. పార్టీలో నేను ఒంటరిని కావచ్చు. కానీ, ప్రజలు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడానికి నన్ను ఎన్నుకున్నారు. అంతేకానీ ఇక్కడ అరవడానికి, గందరగోళం సృష్టించడానికి కాదు. వారి కోసం, దేశం కోసం నా తెలివితేటలు ఉపయోగించి మాట్లాడాలనే ఉద్దేశంతో నన్ను ఇక్కడికి పంపారు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు.

ఎస్ఐఆర్ డేటా బహిర్గతం చేయండి: అఖిలేశ్

లక్నో: యూపీలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఓటర్ల జాబితా పురోగతిని బహిరంగ పరచాలని, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ) ప్రాణాంతక ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శుక్రవారం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎల్‌ఓలపై అధిక పని భారం పడకుండా ఉండటానికి అదనంగా అధికార సిబ్బందిని నియమించాలని ఆయన ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, రాష్ట్రంలో పూర్తయిన ఎస్‌ఐఆర్ పనుల శాతాన్ని వెంటనే ప్రచురించాలని, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత ఏపాటిదో ఊహించినదేనన్నారు. దానిపై చర్చ కూడా అనవసరమని, అధికారంలో ఉన్నవారు లేదా వారి సహచరులు ఎస్‌ఐఆర్ ప్రక్రియలో దొడ్డిదారిన పాల్గొనకుండా చూడాలని ఈసీని కోరారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పీడీఏ (పిచ్డా, దళిత్ అల్ప సంఖ్యక్) వర్గాలకు చెందిన పేర్లను తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. ఎస్‌ఐఆర్‌పై కన్నౌజ్‌కు చెందిన ఎమ్మెల్యే కూడా ఇలాంటి ఫిర్యాదులపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అటువంటి చర్యను ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని ఆయన డిమాండ్ చేశారు. అధిక పనిభారం, ఒత్తిడి, వేధింపు వల్ల ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న బీఎల్‌వోలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొంతమంది హత్యలకు గురయ్యారు.

రాహుల్ అత్యాచార కేసు...

ఏఐజీకి దర్యాప్తు పర్యవేక్షణ బాధ్యత

తిరువనంతపురం: పాలక్కాడ్ ఎమ్మెల్యేపై నమోదైన రెండవ అత్యాచార కేసును విచారిస్తున్న క్రైమ్‌బ్రాంచ్ బృందాన్ని పర్యవేక్షించడానికి కేరళ కోస్టల్ పోలీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఏఐజీ) జి.పూంగుళాలిని నియమించినట్లు కేరళ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే రాహుల్‌పై మీ-టూ వంటి ఉద్యమం వచ్చే అవకాశం ఉన్నందున ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు. 2017లో జస్టిస్ హేమా కమిటీ ఎదుట సాక్ష్యమిచ్చిన బాధితుల తరపున నోడల్ అధికారిగా వ్యవహరించిన పూంగుళాలికి గణనీయమైన అనుభవం ఉందని పేర్కొన్నారు. రాహుల్ మమ్‌కూటథిల్‌పై అక్రమ నిర్బంధం, అత్యాచారం కేసుల్లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్-111 కోర్టులో క్రైమ్ బ్రాంచ్ ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ పాలక్కాడ్ ఎమ్మెల్యే రాహుల్‌ను పార్టీ నుండి బహిష్కరించడంతో పాటు మహిళ ఫిర్యాదును డీజీపీ రవ చంద్రశేఖర్‌కు పంపారు. ఫలితంగా ఎమ్మెల్యేపై రెండవ అత్యాచార అభియోగం నమోదైంది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 183 కింద ఆ మహిళ తన ఫిర్యాదును నేరుగా జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌కు లేదా ఆడియో లేదా వీడియో స్టేట్‌మెంట్ ద్వారా ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు. ఆమె వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేకపోవడాన్ని ఈ సెక్షన్ అనుమతిస్తుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

కళాశాల నిర్మాణానికి రూ. 50 లక్షల విరాళం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.50 లక్షల భారీ విరాళం అందజేస్తారని నేను ఊహించలేదు నా సంకల్పానికి రూ.50 లక్షలు ఇస్తారని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అందరి విరాళాల ద్వారా భారీ ఎత్తున భవనాన్ని నిర్మిస్తున్న సంగతి విధితమే. అయితే ఈ కళాశాల కోసం ఇప్పటివరకు ఎందరో స్వచ్ఛందంగా విరాళాలను పెద్ద ఎత్తున ప్రకటించారు. అయితే మొట్టమొదటిసారి ఈ ప్రాంతంలో ఉన్న నాట్కో పరిశ్రమ యాజమాన్యం స్పందించి ఏకంగా రూ.50 లక్షల భారీ విరాళాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా చెక్కును అందించడం విశేషం. శుక్రవారం నాట్కో కంపెనీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, మేనేజర్ సత్యనారాయణ చేతుల మీదుగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే శంకర్ ఎంతో గొప్ప ఉద్దేశంతో ఈ ప్రాంత నిరుపేద విద్యార్థులకు సకల సౌకర్యాలు సదుపాయాలు కల్పించాలన్న మంచి సంకల్పంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని దాతల సహకారంతో కడుతున్నారని ఇది తమకు ఎంతో నచ్చిందని నాట్కో కంపెనీ ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,బస్వమ్,చెంది తిరుపతి రెడ్డి,సాయి కృష?, ఇబ్రహీం,శ్రీనివాస్ యాదవ్, రాజేందర్ రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, సీతారాములు, లక్ష్మణ్, మాణిక్యం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ నాయక్‌ను కలసిన టిజిఓ నాయకులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ నాయక్‌ను టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి కృష్ణయాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్‌లో ఉన్నఅధికారులు ఉద్యోగుల సహకారంతో ముందుకెళ్తానని తెలియజేశారు.

నేడు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులకు సత్కారం

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న శనివారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు భారత రాజ్యాంగ దినోత్సవ ముగింపుత్సవాలను పురస్కరించుకొని, అబిడ్స్ బొగ్గులు కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు జస్టిస్ పి. లక్ష్మణ రెడ్డి, జస్టిస్ వామన్‌రావు, జస్టిస్ ఎంఎస్కే జైస్వాల్, జస్టిస్ బి. చంద్రకుమార్, జస్టిస్ జి. శ్యాంప్రసాద్, జస్టిస్ సి. వై. సోమయాజులను శాలువా, జ్ఞాపిక, పూలమాలలతో ఘనంగా సన్మానిస్తున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ నేడు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. వీరితోపాటు పలు హైకోర్టు న్యాయవాదులకు, సంఘ సేవలకు సన్మానిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ లోకాయుక్త జస్టిస్ న్యాయమూర్తి ఏ. రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని, ప్రత్యేక అతిథులుగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర పల్లి నంద పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

మహిళా ఆపరేటర్లకు అద్భుత అవకాశం

విశాలాంధ్ర, హైదరాబాద్ : సింగరేణిలో ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళా కార్మికులకు అవకాశం కల్పించాలన్న సీఎండీ ఎన్.బలరామ్ ఆలోచన మేరకు సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్‌గా లేదా బదిలీ వర్కర్లుగా పని చేస్తున్నమహిళలకు సింగరేణి యాజమాన్యం తొలిసారిగా ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి అవకాశం కల్పిస్తోంది. ఇటీవలనే దరఖాస్తులకు ప్రకటన చేయగా మొత్తం 43 మంది మహిళా కార్మికులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంటర్వ్యూలకు 35 మంది హాజరయ్యారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎంపిక కమిటీ సభ్యులు జీఎం (సీపీపీ) ఏ.మనోహర్, జీఎం (పర్సనల్) ఐఆర్, పిఎం కవితా నాయుడు, జీఎం (ఓసీపీ) పి.ఎలిషా, సీఎంఓ ఆర్. కిరణ్ రాజ్ కుమార్, జీఎం (హెచ్‌ఆర్‌డి) ఆర్.విజయ ప్రసాద్, జీ ఎం (ఎంఎస్) బొజ్జా రవి మహిళా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మహిళలు ఏ రంగంలోనైనా పురుషులతో సమానంగా పనిచేయగలరు అనే ఉద్దేశంతో ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించటం జరిగిందని ఇది ఒక గొప్ప అవకాశం కనుక ఎంపికైన అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన మహిళా అభ్యర్థులకు మెడికల్ టెస్టుల అనంతరం సిరిసిల్లలో తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థ హెవీ గూడ్స్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ విభాగంలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఖాళీల లభ్యతను బట్టి ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి-5 డిసిగ్నేషన్‌తో పోస్టింగ్ ఇవ్వబడుతుందని అధికారులు తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం సంస్థ చైర్మన్ చొరవతో సింగరేణి చరిత్రలో తొలిసారి కల్పించబడిందని, ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకొని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు కంపెనీ అభివృద్ధి కి కూడా పాటుపడాలని కోరారు.

అయ్యప్ప మహా పడిపూజలో కార్పొరేటర్ పూజలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని దయానంద్ నగర్‌లో ఎస్.వి.ఆర్ క్యాటరింగ్ నిర్వాహకులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో శుక్రవారం అయ్యప్ప మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ హాజరై స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్‌తో పాటు అయ్యప్ప భక్తులు భజన బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సింగరేణి విజన్ డాక్యుమెంట్ విడుదల

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విజన్ 2047కు అనుబంధంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన విజన్ 2030-2047 డాక్యుమెంట్‌ను ప్రకటించింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసి దానిపై సూర్ఫిర్తిదాయకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, వివిధ విభాగాల ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తుతో పాటు రాష్ట్ర, దేశ అవసరాలకు అనుగుణంగా కంపెనీని బొగ్గు రంగంతో పాటు ఇతర రంగాల్లోకి పెద్ద ఎత్తున విస్తరింపజేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి భారీ ఎత్తున ప్రణాళికలు తయారు చేశామని, దేశ విదేశాల్లో కీలక ఖనిజరంగంలో ప్రవేశించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. విజన్ డాక్యుమెంట్‌లోని స్వల్ప, మధ్య కాలిక ప్రణాళికలో 2030 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాన అంశాలు... సింగరేణి సంస్థ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం ప్రస్తుత లీజు ప్రాంతంలోనే కాక, లీజుకు వెలుపల ఉన్న ప్రాంతంలోని కొత్త బ్లాకులను, వివిధ రాష్ట్రాలలోని కొత్త బ్లాకులను కూడా చేపట్టాలని నిర?యించింది. ప్రస్తుత 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదనను 4,400 మెగావాట్లకు పెంచాలని అందుకు అనుగుణంగా కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థ 2030 నాటికి 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా రాజస్థాన్‌లో అతి త్వరలోనే 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతుంది. రాష్ట్రంలోని అనేక భారీ నీటి జలాశయాలపైన 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నది. ఎత్తైన ఓపెన్ కాస్ట్ డంపులపైన 100 మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తి కోసం ప్లాంట్లను ఏర్పాటు చేయబోతోంది. 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీ తొలి దశలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 250 మెగావాట్ల ప్లాంటును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మణుగూరుకు సమీపంలోని పగిడేరు వద్ద ప్రయోగాత్మకంగా విజయవంతమైన జియో థర్మల్ ప్లాంటు వద్ద 200 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, ప్రణాళికలు రూపొందించారు. ఇది కాక ఎఫ్.డి.ఆర్.ఈ హైబ్రిడ్ ఆర్టీసి విభాగాలలో కలిపి మరో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలని, 700 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంలను వివిధ సోలార్ ప్లాంట్ల వద్ద ఏర్పాటు చేయాలని కూడా ప్రణాళికలు రూపొందించింది. దీనితో మొత్తం మీద 2029-30 నాటికి సింగరేణి 5.85 గిగా వాట్ల(5,850 మెగావాట్ల) పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్‌లో స్పష్టం చేసింది. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు, థర్మల్ విద్యుత్, పవన విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాలలోనే కాకుండా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు దేశ విదేశాల్లో ఈ రంగంలో గల అవకాశాలను పరిశీలించడం కోసం ప్రఖ్యాత పరిశోధన సంస్థలతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుందని, రాగి, బంగారం అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందని ఇక ముందు కూడా ఈ రంగంలో దూకుడుగా ముందుకు పోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ (జి.ఎస్.ఎల్)అనే అనుబంధ సంస్థ ఏర్పాటు విజన్ డాక్యుమెంట్‌లో సూచించారు. సింగరేణి సంస్థ తన దీర్ఘకాలిక ప్రణాళిక 2047లో అవసరమయ్యే థర్మల్ విద్యుత్తును, 5,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును, 2815 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ను, 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను, 500 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, మొత్తం మీద 25 గిగావాట్ల పరిమాణంలో వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్ లో పేర్కొంది.విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న పలు ఇతర ప్రాధాన్యత అంశాలు... సింగరేణి రక్షణతో కూడిన ఉత్పా దకత గల ఆధునిక టెక్నాలజీలతో బొగ్గు ఉత్పత్తులు సాధిస్తుంది. పర్యావరణహిత, మైనింగ్ చేపడుతూ, జల సంరక్షణకు, జీవ వైవిధ్యానికి, వాతావరణ కాలుష్య నివారణకు పాటుపడుతుంది. పూర్తి పారదర్శకంగా నీతి, నిజాయితీలతో ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని మైనింగ్ జరుగుతుందన్నారు.

ఈశ్వరచారి ఆత్మ బలిదాన ఘటన బాధాకరం :చిరంజీవులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : సాయి ఈశ్వర చారి ఆత్మ బలిదాన ఘటన బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తొగర్ల చిరంజీవులు పేర్కొన్నారు. నలభై రెండు శాతం రిజర్వేషన్ల విషయంలో అన్నిరాజకీయ పార్టీలు మోసం చేశాయనే బాధతో గురువారం ఫిర్జాదిగూడ ఆత్మహత్యాయత్నం చేసిన సాయి ఈశ్వర చారి ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఈ ఘటనపై తన ప్రగాఢ విచారాన్ని వ్యక్తం చేశారు. మన హక్కుల కోసం పోరాటం చేస్తున్న బీసీ, బహుజన యువకులు ఇలాంటి చర్యలకు దిగడం సరికాదని, సమాజానికి ఎంతో బాధాకరమని, తెలంగాణ సాధనలో 12 వందల మందికిపైగా బీసీ, బహుజన, వంచిత వర్గాల బిడ్డలు తమ ప్రాణాలు అర్పించారని, ఇలాంటివి జరకుండా ఉండాలని, ఇక నుంచి బలిదానాలు కాదని, పోరాటమే మార్గం కావాలని ఆయన తెలిపారు. మన హక్కులు, మన రిజర్వేషన్లు, మన గౌరవం ఆత్మ హత్యలతో రాదని, ఐక్యత, స్ఫూర్తి, రాజకీయ చైతన్యంతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఆత్మ హత్య మార్గం కాదని, పోరాటమే మార్గమని బీసీ, బహుజనుందనిరికి ఆయన పిలుపునిచ్చారు. మన లక్ష్యం సాధించాలంటే మనం బలంగా, చైతన్యంగా, ఒకటిగా నిలబడాలని, ఘటన మనందరికీ ఒక గట్టి హెచ్చరిక అని, ఇకపై ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని, మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందన్నారు. అది మన ఓటు ద్వారా, మన ఆత్మగౌరవం ద్వారా, మన పోరాటం ద్వారా నిర్మించబడుతుందని, హిస్సా, ఇజ్జత్, హుకుమత్‌ల కోసం అందరం కలిసి పోరాడుదామన్నారు. అది మన ప్రాణ త్యాగాల ద్వారా కాదని, మన రాజకీయ సంకల్పం, నిస్వార్థ పోరాటం ద్వారా తెలంగాణ ఉద్యమ తరహా మళ్లీ బలిదానాల గడ్డ కాకూడదన్నారు. మనకు మోసం చేసినవారికి ఓటు ద్వారానే సమాధానం చెప్పాలన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ : తలసాని

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిలకు జరుగుతున్న అన్యాయంపై మనోవేదనకు గురై క్యూ న్యూస్ ఆఫీస్ వద్ద ఆత్మహత్య కు ప్రయత్నించి గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సాయి ఈశ్వర్‌ను మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. సాయి ఈశ్వర్ భార్య, తల్లిని పరామర్శించి తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ప్రస్తుతం సాయి ఈశ్వర్ ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యం గురించి RMO కళ్యాణ్, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శ్రీకాంతాచారి ఆత్మబలిదానం చేసుకోగా, తన చావుతో నైనా బిసి లకు 42 శాతం రిజర్వేషన్ వస్తుందని భావించి సాయి ఈశ్వర్ తన ఒంటికి నిప్పు అంటించుకొని ఆత్మబలిదానానికి సిద్ధపడ్డారని, ఇది చాలా బాధాకరం అని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పై పోరాడి 42 శాతం రిజర్వేషన్ ను సాధించుకుందామని, బిసి బిడ్డలు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. సాయి ఈశ్వర్ పై ఆధారపడి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని అన్నారు. రెండేళ్ల నుండి కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరిస్తూ పంచాయితీ ఎన్నికలలో 17 శాతం అమలు చేస్తూ తీరని మోసం చేసిందని విమర్శించారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గ పరిధిలో 28 గ్రామపంచాయతీలు ఉంటే 25 స్థానాలు ఏకగ్రీవంగా ఎలా అయ్యాయని ప్రశ్నించారు. నిర్మల్ జిల్లాలో రవీందర్ అనే సర్పంచ్ అభ్యర్థి భర్త కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడని, నల్లగొండ జిల్లాలోని ఎల్లమగూడెంలో సర్పంచ్ అభ్యర్థి భర్త మామిడి యాదగిరిని కిడ్నాప్ చేసి మూత్రం తాపించారని ఇది దుర్మార్గం అన్నారు. బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని, యువత తొందరపాటు చర్యలకు లోనుకావద్దని కోరారు. బిసి లు ఒక్కటైతే రాష్ట్రంలో అగ్ని పుట్టిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిగా దౌర్జన్యం, అగ్రకులాల ఆధిపత్యం తో జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం ఏరులై పారుతున్నా, విచ్చవిడిగా డబ్బులు పంచి ప్రలోభాలకు గురి చేస్తున్నా ఎన్నికల సంఘానికి ప్రభుత్వానికి కనిపించవని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగాల్సిన అవసరం అన్నారు. సాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ. లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ మా హక్కు...ప్రభుత్వం కామారెడ్డి లో ప్రకటించిన విధంగా 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, లక్ష్మీపతి, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ గౌడ్, అంబులెన్స్ సురేష్, మహేష్ యాదవ్, కుమార్ యాదవ్, అబ్బాస్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఈఏ నిబంధనల అమలుపై సమగ్ర చర్చ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ అథారిటీ సమావేశంలో, జిల్లాలోని ప్రైవేట్ వైద్య సంస్థల్లో సీఈఏ నిబంధనల అమలు, నమోదు, పునరుద్ధరణ ప్రక్రియ, ఇటీవల నిర్వహించిన పరిశీలనల నివేదికలు, అనుసరణ చర్యలపై సమగ్రంగా చర్చించింది. ఈ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు చేశారు. జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి ప్రైవేట్ వైద్య సంస్థ తప్పని సరిగా సిఈఏ నమోదు, పునరుద్ధరణ పూర్తి చేసుకోవాలి అని అధికారులు స్పష్టం చేశారు. నమోదు చేయని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. నిబంధనలపై సమగ్ర సూచనలు, సీఈఏ నిబంధనలు, రికార్డుల నిర్వహణ, పరిశీలన ప్రమాణాలు, పరికరాలు, మానవ వనరులు, నమోదుకు అవసరమైన పత్రాలు వంటి అంశాలపై వైద్య సంస్థలకు ఇవ్వాల్సిన సూచనలు కమిటీ ద్వారా నిర్ణయించడం జరిగినది. సమావేశంలో 24 పునరుద్ధరణ దరఖాస్తుల కమిటీ పరిశీలించి ఆమోదించి, తదుపరి ఆదేశాల కోసం జిల్లా కలెక్టర్‌కి పంపడం జరిగింది. ఈ సమావేశంలో పిసిపిఎన్‌డిటి, సరోగసి, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) అంశాలపై సమగ్రంగా చర్చించడం, తీసుకోవలసిన చర్యలకు గురించి కమిటీ సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిని డా.ఉమా గౌరి, మల్కాజిగిరి అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకట రామణ, కొంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఈ.రవికిరణ్ రెడ్డి, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి డా.వంశీ కృష్ణ, ప్రోగ్రాం అధికారి, సిఈఏ, పిసిపిఎన్‌డిటి డా.గీత, డిప్యూటీ డెమో వసంత రెడ్డి, సీఈఏ విభాగం సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్‌కు రండి..

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న. తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవ్వాలని.. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను ప్రత్యేకంగా ఆహ్వానించారు రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. న్యూఢిల్లీలోని జమ్ముకశ్మీర్ హౌస్‌లో సీఎం ఒమర్ అబ్దుల్లాను మంత్రి కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం.. ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు.. అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు వివరించారు. ఈ సందర్భంగా జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి ఆహ్వానించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి, స్వయంగా ఆహ్వానపత్రాన్ని అందచేసిన మంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. సమ్మిట్ కు వారు ప్రత్యక్షంగా హాజరు కాలేకపోతున్నానని , గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆశిస్తున్నానన్నారు.

వాయు కాలుష్యంపై సమీక్ష

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛవాయు కార్యక్రమం కింద నగర స్థాయి మానిటరింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం శుక్రవారం ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మూడు కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీస్ అధికారులు (రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్), తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పిసిబి) టీజీఎస్‌ఆర్‌టిసి, హెచ్ఎంఆర్ఎల్, సివిల్ సప్లైస్, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, టీజీఐఐసి, ఈపిటిఆర్ఐ, సిపిసిబి(ఎన్‌సిఏపి) సాంకేతిక నిపుణులు, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో నగరంలోని కాలుష్య హాట్‌స్పాట్లడేటా సమీక్ష, సిటీ యాక్షన్ ప్లాన్ పురోగతి పరిశీలన సూక్ష్మ స్థాయి వ్యూహాలు రోడ్డు ధూళి తగ్గింపు, వాహనాల ఉద్గారాల నియంత్రణ ,పరిశ్రమల కాలుష్య నియంత్రణ, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల సమర్థ నిర్వహణ, పచ్చదనం విస్తరణ ప్రధాన నిర్మాణ ప్రదేశాల్లో రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థల పై సమీక్ష నిర్వహించారు. జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ వాయు నాణ్యతను మరింతగా మెరుగుపరిచేందుకు ప్రభుత్వ శాఖలు, విభాగాల మధ్య సమన్వయం, నిర్దేశిత చట్టాల అమలు అవసరమని పేర్కొన్నారు. టిఎస్‌పిసిబి శాస్త్రవేత్తలు డా.ప్రసాద్ దాసరి, ఎస్.జయశ్రీలు ప్రధాన హాట్‌స్పాట్లలో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు అవసరమని సూచించారు. ముఖ్యంగా పంజాగుట్ట పటాన్ చెరువు కారిడార్, చార్మినార్-నాంపల్లి హెరిటేజ్ జోన్, హైటెక్ సిటీ ట్రాన్సిట్ కారిడార్ ఎంజిబిఎస్--సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లలో పటిష్ట చర్యలు చేపట్టాలని చెప్పారు. వాయు కాలుష్యం తగ్గించేందుకు అధిక ట్రాఫిక్, అధిక కాలుష్య ప్రాంతాల్లో టీజీఎస్‌ఆర్‌టిసి ద్వారా మరిన్ని ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టడం, సంప్రదాయ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ మూడు చక్ర వాహనాలతో భర్తీ చేయడం, అన్ని వాహనాలకు తప్పనిసరి పియుసి సర్టిఫికేట్, పాత వాహనాలపై కఠిన తనిఖీలు, టెలికాం నగర్, ఇంద్రమ్మ నగర్ వంటి కీలక ట్రాఫిక్ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు , పౌరులు తమ నిర్మాణ వ్యర్థాలను జిహెచ్ఎంసి అధీకృత సంస్థలకు తక్కువ ధరలకు అప్పగించడం, రీసైకిల్ చేసిన నిర్మాణ పదార్థాల వినియోగం వంటివి చేపట్టాలని అన్నారు. ప్లాస్టిక్, ఇతర మున్సిపల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడంపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక స్వచ్ఛగాలి సాంకేతికతలను అవలంబించాలని, ఎన్‌సిఏపి కార్యక్రమాలను వేగంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. పౌరులు తమ వ్యర్థాల తరలింపుకు సంప్రదించవలసిన టోల్ ఫ్రీ నంబర్లలో 1800 120 1159, 1800 203 0033 జిహెచ్ఎంసి వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

మహిళాసాధికారతే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళా సాధికారతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో గృహిణులు, అవివాహిత మహిళలకు ఎమ్మెల్యే తన స్వంత నిధులతో ఉచితంగా అందిస్తున్న నైపుణ్య శిక్షణకు సంబంధించిన మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత మూడు బ్యాచ్‌లలో శిక్షణ పొందిన సుమారు 1000 మంది మహిళలు తమ తమ రంగాల్లో స్థిరపడటం మహబూబ్ నగర్‌లో మహిళా ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు. ఈ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మాత్రమే పొందలేదు, ఇతరులకు ఉపాధి కల్పిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థలో కొత్త ప్రేరణగా మారారు అని చెప్పారు. "మహిళలను ఆర్థికంగా బలపరచడం తన సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు. మహిళా శక్తి బలపడితే మహబూబ్‌నగర్ బలపడుతుందన్నారు. శిక్షణ, నైపుణ్యం, ఉపాధి ఇవి మూడు కలిసి వారి జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకొస్తాయి" అని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు, వచ్చే 10 ఏళ్లలో 20 వేల మందికి నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. అలాగే మహిళలు స్వయం సమృద్ధిగా మారడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి, నగర అభివృద్ధి, సమాజ ప్రగతి ఏకకాలంలో ముందుకు సాగుతాయని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ మహిళల కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాలు సమాజ మార్పుకు, మహిళా అభివృద్ధి ఉదాహరణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఎమ్మెల్యే పిఎ అనిల్, మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇంచార్జీ నిజలింగప్ప , మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ప్రశాంత్, అంజద్, స్టాఫ్ పాల్గొన్నారు.

రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో సామల వేణు ప్రదర్శన



విశాలాంధ్ర, హైదరాబాద్ : 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అంతర్జాతీయ ఇంద్రజాలకులు సామల వేణు సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులు వీస్తూ పోయే విధంగా తన ప్రదర్శనను నిర్వహించనున్నారు. ఈ సమ్మిట్‌లో దాదాపు 50కి పైగా దేశాల నుండి దాదాపు 2000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు కీరవాణి కచ్చేరి కూడా ఉంటుంది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పవన్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శ్రీరాం నగర్, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్ గ్రామాల్లో సీఐ పవన్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లో ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. అదేవిధంగా గ్రామస్తులు ఎన్నికల అదికారులకు సహకరిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు : పాటిల్

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : ఎన్నికల సమయంలో అధికారులు విధులకు తప్పని సరిగా హాజరు కావాలని, ఎవరైనా విధులకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. శుక్రవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి తేదీ: 9-12-2025న వారికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ డీపీఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌లో నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ వద్ద ఇందిరమ్మా క్యాంటీన్‌ను జోనల్ కమీషనర్ హేమంత్ భోర్కడే , డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి కలిసి గౌరవ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పేదల అభ్యున్నతికి చేయూతనిస్తూ.. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో హైదరాబాద్ నగరంలో ఉపాధి కోసం ఇతర పనుల నిమిత్తం వచ్చే వారి సౌకర్యార్థం ఉదయం అల్పాహారం మధ్యాహ్నం సమయంలో భోజనం చేయడానికి ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మా క్యాంటీన్ లను ప్రారంభించుకోవడం పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. బయట హెూటల్ లలో 5 రూపాయలకు టీ కూడా రాదని, అలాంటిది ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా ప్రజలకు రూ.5 రూపాయలకే నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించడం జరుగుతుందని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. ఈ క్యాంటీన్లను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మార్కెట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏఎంహెచ్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ శిరీష, డిఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ ప్రెసిడెంట్ డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కే రాంచందర్, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ ఖాజా పాషా, శ్రీనివాస్, వార్డ్ మెంబర్ కవిత గోపికృష?, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ఆంజనేయులు, కృష? యాదవ్, అజీమ్, మొయిన్, దాదు, చిన్న, శ్రీనివాస్ రెడ్డి, రాజు, వినయ్ తదితర జిహెచ్ఎంసీ సంభందిత సిబ్బంది, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను నిర్బంధించడంపై నెల్లికంటి ఖండన

విశాలాంధ్ర, హైదరాబాద్ : మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణకు వెళ్లిన ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులను అక్రమ నిర్బంధం చేయడానికి సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా హైదరాబాదులో ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు స్పందిస్తూనే ఉంటారు. అదే విధంగా మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం కోసం వారు ముందుగానే మావోయిస్టులకు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి, ఆంధ్రప్రదేశ్ డీజీపీకి బహిరంగంగానే లేఖలు రాశారని గుర్తు చేశారు. ఆ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వారు వెళుతున్న వాహనాలను ఆపి విద్యార్థులను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించడాన్ని అందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. తక్షణమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

విశాలాంధ్ర - మొయినాబాద్ : మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ అంగరంగవైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన పూజా కార్యక్రమాలు వేదఘోషాలతో, సంప్రదాయ మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా సాగాయి. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ...ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌహార్దాన్ని పెంపొందిస్తాయని చెప్పారు.ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, సీసీ కెమెరాల ఏర్పాటుకు పది లక్షల అంచనా వ్యయంతో నిర్మించడానికి నిధుల మంజూరి కొరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి పంపిన మంజూరి పత్రాలను ఆదర్శ్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదర్శ్‌నగర్ కాలనీలో అభివృద్ధిలో భాగంగా కాలనీ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణము కొరకు మరియు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్‌డిఎఫ్ ఫండ్స్ ద్వారా మొత్తము 10,00 ,000 పది లక్షల రూపాయల ఎమ్మెల్యే (ఎస్‌డిఎఫ్‌ఫండ్స్) నుండి మంజూరి చేయవలసిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి ప్రతిపాదనలు పంపడం జరిగినది అని , నిధులు మంజూరు కాగానే కమ్యూనిటీ హాల్‌ను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, చిన్న చిన్న సమావేశాలు, సభలు,ఫంక్షన్ లు నిర్వహించుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాల్ ను నిర్మించేందుకు సంతోషంగా ఉందన్నారు. ఆదర్శ్‌నగర్ కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని, మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని గాంధీ తెలియచేశారు. శేరిలింగంపల్లి డివిజన్, నియోజకవర్గ అభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తానని చైర్మన్ గాంధీ తెలియచేశారు. సీసీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, కాలనీలలో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయని, కాలనీ వాసులు ముందుకు రావడం చాలా అభినందనీయమన్నారు, సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ తీసుకోవడం చాల గొప్ప విషయం అని ,శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని ,సీసీ కెమెరాల ఏర్పాటు పై కాలనీ వాసులకు విస్తృత ప్రచారంతో అవగాహన కలిపిస్తున్నారని ,ఒక సీసీ కెమెరా 100 మంది పోలిసులతో సమానమని, సీసీ కెమెరాల వలన కేస్‌ల పరిష్కారం సులువు అవుతుందని, నేర శోధన, నేర నివారణకు ఎంతో తోడ్పడతాయి అని , అన్ని కాలనీ వాసులు ముందుకు వచ్చి తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామస్వామి యాదవ్, రావు, తంబీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18న అంతర్జాతీయ ప్రీక్లినికల్ సదస్సు

విశాలాంధ్ర, పటాన్ చెరువు : భారతదేశం లోని ప్రయోగశాల జంతు శాస్త్రవేత్తల సంఘం (ఎల్ఏఎస్ఏ) సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'జంతు అధ్యయనాల నుంచి ఔషధ ఆవిష్కరణ, అనువాద పరిశోధన' పేరిట అంతర్జాతీయ సదస్సును ఈనెల 19-20 తేదీలలో నిర్వహించనున్నారు. ఈ 13వ అంతర్జాతీయ ప్రీక్లినికల్ సదస్సుకు ముందురోజు, డిసెంబర్ 18న ఒక కార్యశాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శులు డాక్టర్ జి. సుహాసిని, డాక్టర్ ఎం.జె. మహేష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యశాలలో, ప్రీక్లినికల్ పరిశోధన నాణ్యతను పెంపొందించడానికి, శాస్త్రీయ అధ్యయనాలలో ప్రయోగశాల జంతువుల నైతిక, మానవీయ, బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించడానికి రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎల్ఏఎస్ఏ సభ్యులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, ప్రీక్లినికల్, అనువాద పరిశోధనలో నిమగ్నమైన పరిశోధకులకు శక్తివంతమైన వేదికను అందించడం ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వినూత్న పద్ధతుల మార్పిడిని సులభతరం చేయడంతో పాటు ఇటీవలి శాస్త్రీయ పురోగతులను వెల్లడిస్తుందన్నారు. ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధికి మద్దతు ఇచ్చే కీలకమైన అంశాలను అందిస్తుందని తెలిపారు.ఈ రెండు రోజుల సదస్సు విద్యా సంస్థలు, పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, నియంత్రణ సంస్థల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించి, ప్రోత్సహించడమే గాక, వారి మధ్య సహకారాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నిపుణులు, పరిశోధనా పండితులు, పరిశ్రమ నాయకులు అందించే కీలక ఉపన్యాసాలు, సాంకేతిక ప్రదర్శనలు, ముఖాముఖి చర్చలు, పోస్టర్ల ప్రదర్శన ఉంటాయని తెలియజేశారు. ముందుగా నిర్వహించే కార్యశాల, ప్రధాన సమావేశం రెండింటిలో పాల్గొనడానికి తమ పేర్లు నమోదు చేసుకునే ప్రతినిధులకు ఒకే రిజిస్ట్రేషన్ కిట్ లభిస్తుందన్నారు. ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యం కింద పరిమిత సంఖ్యలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో మౌఖిక ప్రదర్శనలకు ఆరు, పోస్టర్ల ప్రదర్శనకు 12 అవార్డులను ఇచ్చి సత్కరిస్తామన్నారు.

ఈశ్వరాచారి బలిదానం బాధాకరం

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాదులో ఈశ్వరాచారి ఆత్మహత్యకు పాల్పడడం అత్యంత బాధాకరమని, పోరాటాల ద్వారానే బీసీ రిజర్వేషన్స్ సాధించుకోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శ్రీకాంత్ చారి ప్రాణత్యాగం చేసిన విధంగా బీసీ రిజర్వేషన్స్ కోసం ఈశ్వర చారి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. విద్యా ఉద్యోగ రంగాలలో స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్స్ చట్టబద్ధంగా ఇస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి బీసీలకు ద్రోహం చేశారన్నారు. 9వ షెడ్యూల్లో చేర్చకుండా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బీసీలను దగా చేసిందన్నారు. కేంద్రరాష్ట్రప్రభుత్వాల విధానా లతో బీసీలకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం కేవలం 17 శాతంరిజర్వేషన్ తో ఎన్నికలు నిర్వహిస్తుండడం బీసీలకు నిరాశ నిస్పృహ లకు గురిచేసిందన్నారు. బీసీలు ఐక్య పోరాటాలు నిర్వహిస్తున్న పాలకులు పట్టించుకోకుండా దగా చేస్తున్నందున ఈశ్వరాచారి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ప్రాణ త్యాగం చేయడం ఆవేధనకలిగిస్తున్నదని ఇది ప్రభుత్వ హత్యేగానే భావించాల్సి ఉంటుందన్నారు. ఈశ్వర చారి కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాల ఆదుకోవాలన్నారు ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ల అమలుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని లేనిచో రాష్ట్రం అగ్నిగుండంగా మారితే అందుకు పాలకులే బాధ్యత వహించాలని వెంకట్రాములు హెచ్చరించారు.

హామీలతో సర్పంచ్ అభ్యర్థుల హల్‌చల్

విశాలాంధ్ర -కొత్తూరు: అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అంటూ ఒకరు, గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతామని మరొకరు ఎవరి శైలిలో వారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. శుక్రవారం కొత్తూరు మండలం, తీగాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ నుండి గొంగోళ్ల హరినాథ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నుండి బీరంగూడ జయప్రద జగన్మోహన్ రెడ్డిలు తమతమ మద్దతుదారులతో కలిసి వేరు వేరుగా గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అవకాశం కల్పించి అధికార పార్టీ అభ్యర్థిని సర్పంచ్ గా గెలిపిస్తే అనుకున్న తరహాలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడానికి సాధ్యమవుతుందని గోంగోళ్ల హరినాథ్ రెడ్డి చెపుతుంటే ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని ఎన్నడూ లేని విధంగా గ్రామంలో తాగునీరు, విద్య,విద్యుత్, ఉద్యోగ, డ్రైనేజి నిర్మాణం పనులు చేపడుతామని ఎవరంతకు వారే హామీల వర్షం కురుపిస్తున్నారు. తీగాపూర్ సర్పంచ్ సీటు ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సిందే.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర, పటాన్ చెరువు : మెదక్‌లో జరిగే సిఐటియు తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అమీన్పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బీరంగూడ కమాన్ నుండి శివాలయం గుడి కమాన్ వరకు 2కే రన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గం కోసం నిరంతరం పోరాడుతున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈనెల 7,8,9 తేదీలలో మెదక్ పట్టణంలో జరగబోతున్నాయని ఈ మహాసభలను జిల్లాలో ఉన్నటువంటి కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్నటువంటి చట్టాలను మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ఉన్న బలంతో కార్మికులని బానిసలుగా చేస్తూ, పెట్టుబడిదారులకు అనుకూ లంగా నాలుగు లేబర్ కోడ్స్ తేవడం జరిగిందని అన్నారు. దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేస్తూ అనేక సమ్మెలు పోరాటాలు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, జార్జ్,శ్రీనివాస్ రెడ్డి,వీరస్వామి, రామకృష్ణ, జిలాని,వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.సంజీవ్ ముదిరాజ్ ప్రమాణ స్వీకార మహోత్సవం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నూతన అధ్యక్షుడిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నాయకుల అనుభవం, కొత్త నాయకుల ఉత్సాహం కలిసినప్పుడే ఏ పార్టీ అయినా వృద్ధి సాధిస్తుందని, మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ విస్తరణకు ఇదే సరైన సమయమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే విశ్వాసాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయపథంలో అడుగులు వేయాలంటే సమష్టి కృషి అవసరమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి నాయకత్వం వచ్చాకే పార్టీ బలపడ్డ తీరును ఆయన ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. అలాగే మాజీ డిసిసి అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి గత మూడు సంవత్సరాలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉండగా, పార్టీని నిలబెట్టడంలో పోషించిన పాత్ర చాలా కీలకం అని ఆయన చెప్పారు. మాజీ డిసిసి అధ్యక్షులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కొత్త వారికీ అవకాశాలు ఇవ్వడంతో పాటు పాత నాయకులకు గౌరవం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో నూతన డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ డీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఏఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు డా. చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు మరియు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పాల్గొన్నారు.

డాక్టర్ జె కమలాకర్‌కు సత్కారం

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ పీజీ స్టడీస్‌గా నియమితులైన డాక్టర్ కే బీ ఈశ్వరి, తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ఉపాధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ జె కమలాకర్‌లను శుక్రవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, వివిధ పార్టీలలో ఉన్న మాదిగలు కలసి సన్మానించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాదిగ విద్యార్థులకు, ఉద్యోగులకు, అధ్యాపకులకు, కార్మికులకు ఉన్నతాధికారులు అండగా నిలవాలని కోరారు. అదే సమయంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వివిధ పార్టీల లో ఉన్న మాదిగ నాయకులు వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పని చేస్తున్న మాదిగ సామాజిక వర్గాల వారికి అండగా ఉంటారన్నారు. కే బీ ఈశ్వరి, డాక్టర్ జే కమలాకర్ ను సన్మానించిన వారిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు వసం నరసింహ మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ, ననాగారి రామచందర్ మాదిగ, బీసీ ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక చైర్మన్ కె. హరినాథ్, కాంగ్రెస్ మైలార్ దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు నత్తి ధనుంజయ, సీనియర్ నాయకులు పలుగు చెరువు మహేష్, పి జీవన్ దాస్, అనుముల జాన్ పాల్, గోల్కొండ యాదయ్య, మంగలారం శ్రీనివాస్ ఎడ్ల కాడి సూర్యం, వీర్లపల్లి నవీన్ కుమార్, జర్నలిస్టు సంఘాల నాయకులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, పి. వెంకటేష్, ఎం బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజెయు) మహబూబ్నగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి మాల్యాల బలస్వామి, సహా ఎన్నికల అధికారి కొంతం ప్రశాంత్, రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కాటం నాగరాజు (దిశ), ఉపాధ్యక్షులుగా కె.పవన్ కుమార్ రెడ్డి (టిజి న్యూస్), మెరాజ్ (సిటి ఇండియా న్యూస్), బలమోని శేఖర్ (ప్రజా పక్షం), కరణం భాస్కర్ రావ్ (వేకువ సమయం) కార్యదర్శిగా ఎన్. సతీష్ రెడ్డి (వార్త), సంయుక్త కార్యదర్శులుగా ఎం రవీందర్ గౌడ్ (సిటీ ఇండియా న్యూస్), ఎం.డి. జాఫర్ (4 టివి), ప్రభాకర్ (మనతెలంగాణ), గోకులం వెంకటేష్ (టిఎస్ న్యూస్), కోశాధికారిగా జిల్లెల రఘు (విజయ క్రాంతి), గౌరవ సలహాదారుగా కె.విజయ రాజు, (వార్తా తరంగాలు), కార్యవర్గ సభ్యులు దేవరకద్ర - ప్రశాంత్ (దిశ), సిసికుంట - వేణుగోపాల చారి (ఆంధ్రజ్యోతి), భూత్పూర్ - గొడుగు వెంకటయ్య (వార్తా), గండీడ్ - వీరాజ్ (దిశ), నవాబ్పేట్ - శేఖర్ (వార్తా), రాజాపూర్ - శివ ప్రసాద్ గౌడ్ (జనం సాక్షి), అడ్డాకల్ - శేఖర్ (విజయ క్రాంతి), మహబూబ్నగర్ అనిల్ కుమార్ (సిటి ఇండియా న్యూస్), మహబూబ్ నగర్ శివ కుమార్ (మెగా 9), హన్వాడ - వెంకటేష్ గౌడ్ (దిశ), బాలానగర్ - నర్సింహా రెడ్డి (ఆంధ్రజ్యోతి), మిడ్జిల్- ఎం. శ్రీనివాసులు (మన తెలంగాణ), కోయిల్ కొండ - రామకృష? (వార్తా), జడ్చర్ల - వేణు (మన ఊరు), డెస్క్ జర్నలిస్టు - మాణిక్ రావ్ (సాక్షి), మహబూబ్నగర్ - ఎన్. చంద్ర శేఖర్ గౌడ్ ఫోటో జర్నలిస్టు (మన తెలంగాణ), మహ్మదాబాద్- కొత్త గోపాల్ (విజయ క్రాంతి)లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గాన్నికి అభినందనలు తెలిపి సన్మానించారు.

పేద ప్రజలకు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర- నాగారం : నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కీసర మండల పరిధిలోని గ్రామాలను జిహెచ్ఎంసి లో కలపడం పట్ల అభివృద్ధి లో వెనుకబడుతాయని నాగారం మున్సి పల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నాగారంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కీసర మండలంలో అభివృద్ధికి వెనుకబడిన అంకిరెడ్డిపల్లి నర్సంపల్లి , తిమ్మాయి పల్లి ,యాద్గార్ పల్లి ,బోగారం తదితర గ్రామాలు అన్ని రకాలుగా వెనుకబడి ఉన్నాయని అలాంటి గ్రామాలను జిహెచ్ఎంసి లో విలీనం చేయడం సమంజసం కాదన్నారు. మున్సిపాలిటీలు కార్పొరేష న్ జి హెచ్ హెమ్ సి లో విలీనం చేయడం వలన సామాన్య పేద ప్రజలకు పెను భారం మోయాల్సి వస్తుందన్నారు. జనాభాకు అనుగు ణంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు.

PUBLIC NOTICE

Under the instruction of M/s. The Indigenous Churches in India Trust, A Trust Deed registered as Document No.46 of 2004 Dated 24.03.2004, Situated at H.No.1-1-574, Universal, Central Head Quarter ,Hebron Church, Golconda X Roads, Musheerabad, Hyderabad-500020. The Trust represented by its authorized Signatory of Trust and Trustee Bro. K. Mohan Raj, I issue this Public Notice as under.

The General Public is hereby informed and cautioned that certain individuals namely Bro. Victor David as Chairman and Life Trustee, Bro. Mallavarapu Emmanuel as Secretary and Life Trustee, Bro. Christopher Mariadas Francis as Joint Secretary & Life Trustee and Bro. J.M. Prasada Rao as Treasurer and Life Trustee are falsely claiming and representing themselves as Trustees of M/s. The Indigenous Churches In India Trust through forged and fabricated documents without any legal right.These individuals do not have any legal right to represent the Trust or participate in conducting the Meetings & Prayers, any God's servants/Pastors gatherings, issue Transfer Letters, appointment of responsible Brothers and Coordinators etc in the name of M/s. The Indigenous Churches In India Trust, Universal, Central Head Quarter, Hebron Church, situated at 1-1-574, Golconda Cross Roads, Musheerabad, Hyderabad and all its sister Churches situated throughout India and Abroad. These individuals do not have any legal right to represent the Trust or manage its affairs. "The present Government Registered Trustees are Bro. A. Ananda Raj, Bro. K. Mohan Raj, Bro. D. Deva Bhushan, Bro. N. Elia Rao, Bro. S.D. Samuel Zakharia, Bro. Saidulu alias Joseph". They only are entitled to conduct all meetings on behalf of the Trust vide. Regd. No. 46/2004, Hebron Church, situated at 1-1-574, Golconda Cross Roads, Musheerabad, Hyderabad-500020. That, M/s. The Indigenous Churches In India Trust hereby puts the General Public on notice that these members namely Bro. Victor David as Chairman and Life Trustee, Bro. Mallavarapu Emmanuel as Secretary and Life Trustee, Bro. Christopher Mariadas Francis as Joint Secretary & Life Trustee and Bro. J.M. Prasada Rao as Treasurer and Life Trustee are not authorized persons of M/s. The Indigenous Churches In India Trust to deal with the Trust or manage its affairs in any manner. The above so called self-styled life trustees and their henchman are not permitted to conduct any God's Servants/Pastors meetings in Telugu States, in India and abroad. If they violate, they are punishable under Criminal and Civil Courts of Law. Further these individuals are not authorized or permitted by Trust to use Trust Letter Heads and the Trust Stamps, etc. in any manner.

Y. SUDHAKAR RAO, ADVOCATE
H.NO.1-4-28, STREET No.7,
HABSIGUDA, HYDERABAD-500007
Ph. : 9347258219, 9182903272

కన్సార్టియంకు డాక్టర్ మహతిర్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : కర్ణాటక మాజీ ప్రధాన కార్యదర్శి, ఉబుంటు కన్సార్టియం వ్యవస్థాపక అధ్యక్షురాలు కె. రత్నప్రభ ఐఏఎస్(రిటైర్డ్) మలేషియాలోని బ్రిక్స్-ఆసియాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా ప్రతిష్టాత్మకమైన తున్ డాక్టర్ మహతిర్ మొహమ్మద్ గుడ్‌గ్లోబల్ ఎగ్జాంప్లరీ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. బ్రిక్స్-ఆసియాన్ కౌన్సిల్ అధ్యక్షుడు నైజీరియా రాయబారి థాయలన్ నాథన్ ప్రదానం చేసిన ఈ అవార్డు, పాలన, సంస్థాగత బలోపేతం, సమాజ-కేంద్రీకృత అభివృద్ధికి చేసిన అసాధారణ కృషిని గుర్తింపుగా అందజేయడం జరిగింది.అవార్డు అందుకొన్న సందర్భంగా రత్న ప్రభ మాట్లాడుతూ అవార్డు ద్వారా లభించిన ఈ గుర్తింపు ఉబుంటుకు ఒక శుభారంభం, కానీ ఇది మా లక్ష్యాన్ని మార్చదు మరింత పటిష్టపరుస్తుంది. అవార్డులతో సంబంధం లేకుండా, మేము 10,000 మంది మహిళా వ్యవస్థాపకులను చేరుకోవడం, వారికి డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇవ్వడం, 100 సంఘాలకు విస్తరించడం, ఎగుమతులను సులభతరం చేయడం ఇంకా భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలతో భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం కొనసాగిస్తామన్నారు.

7న యాదవ జేఏసీ ఆవిర్భావ సభ

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలోని యాదవులు ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా రాజకీయంగా అన్ని రంగాలలో మన జనాభా నిష్పత్తి ప్రకారంగా రాణించాలంటే అందరం కలిసి నిస్వార్థంగా ఐక్యమై ఉద్యమించాల్సిన చారిత్రక అవసరం ఉందని అఖిల భారత యాదవ్ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. డిసెంబర్ 7న మల్కాజ్గిరి సంజీవ్‌నగర్ లోని మనీషా ప్రియా గార్డెన్ లో యాదవ జేఏసీ ఆవిర్భావ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలను అనునిత్యం చైతన్య పరుస్తున్న యాదవ ముద్దుబిడ్డ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ జాతిని ఐక్యం చేస్తూ యాదవ జే.ఏ.సీ ఆవిర్భావ సభను అల్లాడి శరత్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొని తమ మద్దతుని ప్రకటించి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. జేఏసీ ఆవిర్భావ సభకు గౌరవ అతిథిగా మాజీ మంత్రివర్యులు సి. కృష్ణయాదవ్, అఖిల భారతయాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు దారమోని బక్కన్న యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు చిలుకల శ్రీనివాస్ యాదవ్, గొల్ల కురుమ డోలు దెబ్బ బెల్లి చంద్రశేఖర్ యాదవ్, భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సిద్ది రమేష్ యాదవ్, తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కూరాకుల నాగభూషణం యాదవ్, యాదవ్స్ సేవా సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ అల్లాడి శరత్ కుమార్ యాదవ్, తోకల మహేష్ యాదవ్ లు విచ్చేస్తున్నారని ఆయన వెల్లడించారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర కొత్తూరు : ఒక్క అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని శుక్రవారం కొత్తూరు మండలం, ఇన్ముల్ నర్వ గ్రామ సర్పంచ్ అభ్యర్థి లావడ్య లలిత గోపాల్ నాయక్ తనదైన శైలిలో తమ మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని, మీ అమూల్యమైన ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ మీద వివిధ విభాగాల అధికారులతో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమీక్షనిర్వహించారు. శుక్రవారం డిజీపీ శివధర్ రెడ్డి అడిషనల్ డీజీపీలు మహేష్ భగవత్, డీఎస్ చౌహాన్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, టీజీ ఐఐసి ఎండీ శశాంక్, ఐజి రమేష్ రెడ్డిలతో కలిసి రివ్యూ నిర్వహించారు. అనంతరం శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రకాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సుమారు 3 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు రానున్నారు. ఈ డెలిగేట్లకు 8, 9 తేదీల్లో మాత్రమే అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. ఆ తర్వాత నాలుగు రోజులు మాత్రం కామన్ పబ్లిక్‌కి అనుమతి ఉంటుందని అన్నారు. లా అండ్ ఆర్డర్‌కి సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటామని, వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానమై ఉంటాయి. శనివారం సాయంత్రంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయనీ ఆయన అన్నారు. బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమ్మిట్‌కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



విశాలాంధ్ర - మొయినాబాద్ : సర్పంచ్‌గా గెలిపించినట్లయితే మండలంలోని ఎత్ బార్ పల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఫైమిద పాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆమె అనుచరులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. గ్రామ అభివృద్ధి ధ్యేయంగాపని చేస్తామన్నారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించినట్లయితే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

ప్రమాదంలో దేశ ఆర్థిక వ్యవస్థ

- రూపాయి విలువ పతనంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- మావోయిస్టులను కాల్చిచంపడం దుర్మార్గ చర్య
- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చుతూ ప్రపంచంతో దేశం పోటీపడుతోందని, ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఉన్నామంటూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇతరులతో అసత్య ప్రచారాలను చేయించి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయనొక ప్రకటన విడుదల చేశారు. 2014లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు నాటి యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారన్నారు. ప్రభుత్వ విధానాలతో పాకిస్థాన్, బంగ్లాదేశ్ కంటే మన దేశ రూపాయి విలువ దిగజారిందని... తాము అధికారంలోకి వస్తే రూపాయి విలువను డాలర్‌కు దీటుగా తీసుకొస్తామని పెద్దఎత్తున ప్రచారం చేయించారని గుర్తు చేశారు. ఎన్డీఏ 11ఏళ్ల పాలనలో రూపాయి విలువ భారీగా పతనమై డాలరుతో పోలిస్తే రూ.90కి పైగా చేరుకుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూపాయి బలహీనపడటంతో ఆర్థికవ్యవస్థ క్షీణించి... అన్ని వస్తువుల ధరలు, అప్పులు భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే మోదీ సర్కారు చేసిన అప్పులు రూ.200లక్షల కోట్లకు చేరాయని... దీనికి మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులను వెంటాడి, వేటాడి చంపడం తప్ప కేంద్ర ప్రభుత్వానికి మరో పని లేదని ఆరోపించారు. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ ఆ దిశగా ఏర్పాట్లు చేయకుండా కాల్చి చంపే కార్యక్రమం పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ దేశంలో మనిషి జీవించే హక్కును హరిస్తూ మానవత్వాన్ని మరచి నియంతృత్వ ధోరణిలో బూటకపు ఎన్‌కౌంటర్లకు ప్రభుత్వం పాల్పడుతోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధంగా చర్చలకు వస్తామని ప్రకటించినా ఓ పథకం ప్రకారం మావోయిస్టులను అంతం చేస్తున్నారని... అటవీ సంపదను కార్పొరేట్ ప్రైవేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే ఈ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాతంత్రవాదులందరూ ప్రతిఘటించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

శాంతి స్థాపనకు ప్రయత్నిస్తున్నాం

- ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్ వ్యాఖ్యలు
- భారత్ ఎల్లప్పుడూ శాంతి పక్షమేనన్న మోదీ
- ద్వైపాక్షిక చర్చల్లో ప్రస్తావన

న్యూదిల్లీ: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ తటస్థంగా లేదని, శాంతివైపు ఉందని ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు స్పష్టం చేశారు. 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జరిగిన చర్చల్లో భాగంగా పుతిన్‌కు మోదీ ఈ విషయాన్ని చెప్పారు. కేవలం చర్చలు, దౌత్యం ద్వారా ఈ వివాదం ముగియాలని ఆయన పేర్కొన్నారు. శాంతియుత పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.

మరోవైపు భారత్-రష్యా సంబంధాలు విశ్వాసంపై ఆధారపడి ఉన్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. హైదరాబాద్‌హౌస్‌లో ప్రధాని నరేంద్రమోదీ-పుతిన్ భేటీ అయ్యారు. ఇరు దేశాల ప్రతినిధి బృందాలు సైతం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధం గురించి మోదీకి పుతిన్ వివరించారు. ఈ సందర్భంగానే శాంతి మాత్రమే సమస్యకు పరిష్కారమని పుతిన్‌కు మోదీ స్పష్టంచేశారు. అయితే తాము ఉక్రెయిన్‌తో సంధి ఒప్పందం చేసుకోవాలని యత్నిస్తున్నామని, శాంతి పరిష్కార మార్గాలన్నిటినీ అన్వేషిస్తున్నామని పుతిన్ చెప్పారు. బహుళ ధ్రువ ప్రపంచం కోసం పనిచేస్తామని వివరించారు. సాంకేతికత, కృత్రిమమేధ, అంతరిక్ష రంగాల్లో కలిసి పనిచేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పుతిన్ వెల్లడించారు. "ముందుగా నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధం గురించి నేను వివరంగా చెప్తాను. శాంతి ఒప్పందం కోసం అమెరికాతో సహా మరికొందరు భాగస్వాములతో చర్చలు జరుపుతున్నాం. ఈ యుద్ధానికి ఒక పరిష్కారం కనుగొనేందుకు మీరు చూపిన శ్రద్ధకు ధన్యవాదాలు. వాస్తవానికి ఇక్కడ శాంతి గురించిన పదాలు ముఖ్యం కాదు. సారాంశమే ప్రధానం. మేము దానిని నిజంగా అప్రిసియేట్ చేస్తాం" అని అన్నారు. "ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి, మేము నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాం. మీరు నిజమైన స్నేహితుడిగా, ప్రతి విషయాన్ని మాకు తెలియజేస్తున్నారు. నమ్మకం గొప్ప బలమని నేను నమ్ముతున్నాను. కేవలం శాంతి మార్గంలోనే దేశాల సంక్షేమం ఉంటుంది. మనం కలిసి ఈ ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిద్దాం" అని ప్రధాని మోదీ అన్నారు. పుతిన్ రాక సందర్భంగా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యాను భారతదేశానికి 'నిజమైన స్నేహితుడు' అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ గందరగోళం ఏర్పడిన వేళ, ఇరుదేశాల మధ్య ఉండాల్సిన పరస్పర విశ్వాసం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. కోవిడ్ నుంచి ఇప్పటి వరకు ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొందని... అతి త్వరలో అన్ని ఆందోళనల నుంచి విముక్తి పొందుతుందని, ప్రపంచం సరైన దిశలో వెళుతుందని ఆశిస్తున్నానని మోదీ అన్నారు.

ఇండిగో సంక్షోభంపై ఉన్నతస్థాయి కమిటీ

న్యూదిల్లీ: నిర్వహణపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా... ఈ గందరగోళం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. దీంతో కేంద్రం రంగంలోకి దిగింది. ఉన్నతస్థాయి విచారణకు శుక్రవారం ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేశ్ రాంపాల్ ఉన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కమిటీ కొన్ని సిఫార్సులు చేస్తుంది. ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది.

10 నుంచి యథావిధిగా సర్వీసులు : ఇండిగో సీఈవో

ఇండిగో విమాన సర్వీసుల్లో తీవ్ర అంతరాయంపై ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ మరోసారి స్పందించారు. ప్రయాణికులకు కలుగుతోన్న అసౌకర్యానికి క్షమాపణ చెప్పారు. శనివారం ఈ సంఖ్య వెయ్యి కన్నా తక్కువ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబరు 10-15 మధ్య కాలంలో పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'గత కొన్ని రోజులుగా తీసుకుంటున్న ముందస్తు చర్యలు సరిపోవడం లేదని రుజువైంది. అందుకే అన్ని వ్యవస్థలు, షెడ్యూల్‌లను రీబూట్ చేయాలని నిర్ణయించాం. ఫలితంగా నేడు భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. రేపటి నుంచి పరిస్థితులు మెరుగుపడాలంటే ఈ చర్యలు తప్పనిసరి. దీంతో శనివారం 1000 కన్నా తక్కువ సర్వీసులు రద్దవుతాయని అంచనా వేస్తున్నాం. ఎఫ్‌డీటీఎల్ (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) విషయంలో డీజీసీఏ తీసుకున్న ఉపశమన చర్యలు చాలా దోహదపడ్డాయి' అని పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు.

రోహింగ్యాలపై అసంబద్ధ వ్యాఖ్యలు తగవు

సీజేఐకు న్యాయ నిపుణుల బహిరంగ లేఖ

న్యూదిల్లీ: కస్టడీలో అదృశ్యమైన కొందరు రోహింగ్యాలకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ క్రమంలో సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నట్లు హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు, సీనియర్ న్యాయవాదులు, న్యాయ మేధావులు అభ్యంతరం వ్యక్తంచేశారు. వాటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ సీజేఐ సూర్యకాంత్‌కు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. 'హక్కుల కార్యకర్త రీటా మంచందా పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈనెల 2న విచారించింది. ఆ సమయంలో రోహింగ్యాల శరణార్థి హోదాను ప్రశ్నిస్తూ చొరబాటుదారులకు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలకాలా అని సీజేఐ మౌఖికంగా అన్నట్లు వార్తలు వచ్చాయి. జాతీయ భద్రతా ప్రయోజనాలు, పౌరుల రక్షణ తదితరాల సమతుల్యత చెడిపోకుండా మానవతా దృష్టికోణంతో శరణ కోరే వారికి అండగా నిలవడం, రక్షణ కల్పించడంలో భారత్‌కు ట్రాక్ రికార్డు ఉంది. టిబెట్, శ్రీలంక నుంచి వచ్చిన వారికి ప్రభుత్వం ప్రత్యేక పత్రాలు ఇచ్చి శరణార్థులుగా గుర్తించింది. కనీస సామాజిక-ఆర్థిక హక్కులను కల్పించింది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి ప్రాణ భయంతో పారిపోయి వచ్చిన ముస్లింలు కాని ఇతర మతాల మైనారిటీలకు విదేశీయుల చట్ట నిబంధనల నుంచి మినహాయింపును పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ద్వారా కల్పిస్తుంది' అని విశ్రాంత న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు తమ లేఖలో పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాలతో పాటు నిర్వాసితుల హక్కుల రక్షణ బాధ్యత సుప్రీం కోర్టుపై ఉన్నదని గుర్తుచేశారు. 'మీ మాటలకు విలువ ఉంటుంది. హైకోర్టులు, కింది కోర్టులు, ప్రభుత్వ యంత్రాంగాలపై అవి ప్రభావం చూపుతాయి. ఓ బలహీన వర్గానికి చెందిన శరణ కోరే వారిని (వేలాది మంది మహిళలు, చిన్నారులు ఉన్న రోహింగ్యాలు) 'చొరబాటుదారులు', 'సొరంగాలు తవ్వేవారు' అనడం... ప్రాణ భయంతో పారిపోయి వచ్చిన వారిని కించపర్చడమే అవుతుంది. న్యాయవ్యవస్థ నైతిక అధికారాన్ని ఇది బలహీనపరుస్తుంది' అని న్యాయ నిపుణులు పేర్కొన్నారు. ఇలాంటి ధోరణి శరణార్థుల విషయంలో ప్రమాదకరంగా పరిణమిస్తుందని హెచ్చరించారు. అంతేకాక రాజ్యాంగ న్యాయ సూత్రాలను అతిక్రమించినట్లు అవుతుందని హితవు పలికారు. రోహింగ్యాలు లేదా ఇతర శరణార్థుల రక్షణకు ఆర్టికల్ 21 హామీ ఇస్తుందని సీజేఐకు గుర్తుచేశారు. ఈ లేఖ రాసిన వారిలో దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఏపీ షా, న్యాయమూర్తులు కె.చంద్రూ, అంజనా ప్రకాశ్, నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ మోహన్ గోపాల్, న్యాయవాదులు రాజీవ్ ధవన్, చందర్ ఉదయ్ సింగ్, కోలిన్ గోంజాల్వెజ్, మిహిర్ దేశాయ్, గోపాల్ శంకరనారాయణన్, కామిని జైశ్వాల్, ప్రశాంత్ భూషణ్, చెరిల్ డిసౌజా, అలోక్ ప్రసన్న కుమార్, ఆర్‌టీఐ కార్యకర్తలు నిఖిల్ దే, అంజలీ భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

పాన్ మసాలాపై కొత్త సెస్సు

న్యూదిల్లీ: పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నారు. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు, 2025'పై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని వెల్లడించారు. అనంతరం ఈ బిల్లు మూజువాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదం పొందింది. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులు తయారు చేసే యూనిట్లకు సెస్సు విధిస్తారు. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులు వినియోగిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీలో గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు చెప్పారు. సెస్సు వల్ల జీఎస్టీ రెవెన్యూపై ఎలాంటి ప్రభవమూ పడబోదని వివరించారు. తయారీ సామర్థ్యం ఆధారంగా సెస్సు విధించనున్నట్లు తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం : ఐదుగురి మృతి

విశాలాంధ్ర-నాదెండ్ల: అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థులు భజనకు వెళుతుండగా పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం వద్ద బైపాస్ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు కొత్త ట్రాక్టర్లను తీసుకువెళుతున్న కంటెయినర్‌ను దాని వెనుకగా వెళుతున్న కారు బలంగా ఢీకొట్టి కంటెయినర్ లోపలికి చొచ్చుకుపోయి నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఐదుగురు దుర్మరణం చెందారు. గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీకాంత్ (వినుకొండ మండలం శివాపురం), వాసు (వినుకొండ సమీప గ్రామం), మహేష్ (పిడుగురాళ్ల), యశ్వంత్ సాయి (నూజెండ్ల మండలం ములకలూరు), విజ్ఞాన్ లారాలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రామిరెడ్డి (తాళ్లూరు, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా) ఉన్నారు. వినుకొండ మండలం దొండపాడుకు చెందిన మద్దుకూరి కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న అతడిని గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో నలుగురు విద్యార్థులు అయ్యప్ప దీక్షలో ఉండగా మరొకరు గోవింద దీక్షలో ఉన్నారు. వీరంతా వినుకొండ మండలం విఠంరాజుపల్లె వద్ద అయ్యప్ప భజనకు బయలుదేరి దారిలో ప్రమాదం బారిన పడ్డారు.

గిరిపుత్రుల ప్రతిభను ఉద్భవింపజేసిన 'ఉద్భవ్'

విజయవంతంగా ముగిసిన వేడుకలు

54 విభాగాల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర-సచివాలయం: గిరిజన విద్యార్థుల కళా నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీసి దేశ వ్యాప్తంగా చాటి చెప్పాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరవ జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ సంస్కృతీ కళా ఉత్సవం ఉద్భవ్-2025 ఉత్సవాల ముగింపు వేడుకలను కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో కృష్ణ జింక ప్రధాన వేదికపై శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. మంత్రి డోలా మాట్లాడుతూ మన దేశంలోని వైవిధ్యభరితమైన సంస్కృతీసాంప్రదాయాలు, అభిప్రాయాలు,ఆ లోచనలను పరస్పరం మార్చుకోవడానికి, అవలంభించడానికి ఉద్భవ్-2025 వేడుక ఒక వేదిక అవుతుందన్నారు. ఇలాంటి వేడుకలు భవిష్యత్ తరాలకు ఒక మార్గదర్శిగా ఉంటాయని తెలిపారు. యువ భారతం మీకోసం ఎదురుచూస్తుందని, భారతదేశ భవిష్యత్‌కు పునాది విద్యార్థులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తాను భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ వేరు వేరు ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు ఉన్నా... మనందరం భారతీయులమే, మనం ఆదివాసీలమే అన్న భావనతో అందరూ ఐకమత్యంగా పాల్గొనడం అభినందనీయం అన్నారు. గిరిజన కళా సంపద, సంప్రదాయాలు, ప్రతిభను ప్రతిబింబించే నాటికలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. చదువుతో పాటు కళలు, క్రీడల్లోనూ గిరిజన విద్యార్థులు రాణించడం అభినందనీయం అన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యార్థులు తరలివచ్చి ప్రతిభ చూపడం అసాధారణ విషయమన్నారు. ఇటువంటి జాతీయ స్థాయి కార్యక్రమానికి ఏపీ వేదిక కావడం గర్వించే విషయమని అన్నారు. సరైన సదుపాయాలు లేని చోటు నుంచి సమగ్ర అభివృద్ధి సాధించడం సామాన్య విషయం కాదని వెల్లడించారు. అడవిలో పుట్టిపెరిగిన వారు సైతం అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. భిన్న జాతులు, సంస్కృతులు కలిగిన సువిశాల భారత దేశంలో గిరి పుత్రుల ప్రతిభని ప్రపంచానికి పరిచయం చేసిన ఉద్భవ్ చరిత్రలో నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, ఆంధ్ర ప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటురి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరన్ రాజ్, కేఎల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకట్రామన్, ఎస్టీ కమిషన్ సభ్యులు మల్లేశ్వరరావు, కాకి లక్ష్మి, జీసీసీ మెంబర్ కన్నమ రాజు, టీడీపీ ఎస్టీ సెల్ చైర్మన్ ఎం.ధారు నాయక్, ఎన్ఈఎస్‌టీఎస్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఈఎంఆర్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి రైతు కంట కన్నీరు

కిలో రూ.2కే కొనుగోలు - మార్కెట్‌లో రూ.50కు విక్రయం

సంయుక్త కిసాన్ మోర్చా

న్యూదిల్లీ: దేశంలో ఉల్లి రైతు కంట కన్నీరు కారుతోందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం దుస్థితి నెలకొన్నదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆందోళన వ్యక్తంచేసింది. రైతు వ్యతిరేక-కార్పొరేట్ అనుకూల మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని, స్థానికంగా పోరాటాలు పెంచాలని పిలుపునిచ్చింది. ఉల్లి పంటను రైతు వద్ద నుంచి కిలో రూ.2కు కొని... దిల్లీ మార్కెట్‌లో రూ.50-రూ.60 లెక్కన విక్రయిస్తున్నారని పేర్కొంది. మధ్యప్రదేశ్‌లో క్వింటా రూ.50 నుంచి రూ.116 వరకు పలుకుతుండగా. ఇండోర్ ఏపీఎంసీ మార్కెట్‌లో రూ.128 నుంచి రూ.688 వరకు... మాండసౌర్ ఏపీఎంసీలో రూ.170 నుంచి 199 వరకు ఉన్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో ధర రూ.419గా ఉంటే హర్యానాలోని పిప్లీ ఏపీఎంసీ మార్కెట్‌లో రూ.465, దిల్లీ ఆజాద్‌నగర్ మార్కెట్‌లో రూ.500, గుజరాత్ మార్కెట్లలో రూ.605, కర్నాటకలో రూ.1,338 చొప్పున ఉల్లి క్వింటా ధర ఉన్నదని తెలిపింది. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సాగు, రవాణా ఖర్చులు కూడా రాక పంటను పారబోయడం మేలని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సంయుక్త కిసాన్ మోర్చా వెల్లడించింది. 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయడం ద్వారా దేశీయ పత్తి రైతాంగాన్ని మోదీ ప్రభుత్వం నష్టాల ఊబిలోకి నెట్టివేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. కేరళ, ఒడిశా, చత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ధాన్యానికి సీ2+50 శాతం చొప్పున కనీస మద్దతు ధర కల్పిస్తుంటే, దేశంలోని మిగతా ప్రాంతాల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం ఏ2+ఎఫ్ఎల్+50శాతం ఎంఎస్‌పీకి కూడా హామీ లేదంటూ దుయ్యబట్టింది. సీ2+50 శాతం చొప్పున కనీస మద్దతు ధర కల్పిస్తున్న రాష్ట్రాల్లో ఎంఎస్‌పీ పథకం ప్రయోజనాలు రైతులకు నేరుగా అందేలా పారదర్శక పర్యవేక్షణ వ్యవస్థ కావాలని ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. కేరళ, ఒడిశా, చత్తీస్‌గఢ్ సీ2+50శాతం ఎంఎస్‌పీ ఇస్తుంటే, మీరెందుకు ఇవ్వలేకపోతున్నారో చెప్పండి అంటూ మిగతా రాష్ట్రాలకు సవాల్ విసిరింది. వ్యవసాయ సంక్షోభాన్ని ముగించాలని, రైతులపై అప్పుల భారాన్ని తగ్గించాలని, వారి ఆత్మహత్యల నివారణకు సమర్థ చర్యలు తీసుకోవాలని పాలకులను కోరింది. మార్కెట్ ధర, రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధరలో వ్యత్యాసంపై ఆందోళన వ్యక్తంచేస్తూ... రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు లోపల, బయట రాజకీయ పార్టీలు ముఖ్యంగా ప్రతిపక్షాలు పెద్దగా గళం వినిపించాలని ఎస్‌కేఎం సూచించింది. వ్యవసాయ సంక్షోభం పరిష్కారానికి స్థానికంగా ఉమ్మడి పోరాటాలు ఉధృతంగా చేపట్టాలని, కార్పొరేట్ అనుకూల మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని, రైతుల సంపద దోపిడీని నిలదీయాలని రైతులకు ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. రైతాంగ సమస్యల పరిష్కారానికి స్థానిక ఆందోళనలకు సమాయత్వం కావాలని రైతు లోకానికి సూచించింది.

10 నిమిషాల డెలివరీపై నిషేధం

ఆప్ ఎంపీ చద్దా డిమాండ్

న్యూదిల్లీ: వాణిజ్యసంస్థలు అందించే త్వరిత సేవలు 'పది నిమిషాల్లో డెలివరీ'ని నిషేధించాలని, గిగ్ కార్మికులకు రక్షణ కల్పించాలని ఆప్ ఎంపీ రాఘవ చద్దా డిమాండ్ చేశారు. త్వరిత సేవల తీవ్ర ఒత్తిడితో గిగ్ కార్మికులు తమ ప్రాణాలన పణంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యను కార్మికుల పట్ల క్రూరత్వంగా ఆయన అభివర్ణించారు. శుక్రవారం రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. డెలివరీ సిబ్బంది రోబోలు కాదని, వారు ఒకరి తండ్రి, భర్త, సోదరుడు, కుమారుడు అయిన వ్యక్తులు అని అన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలని, ఈ పదినిమిషాల డెలివరీ క్రూరత్వం అంతం కావాలని అన్నారు. వినియోగదారులు తమ ఆహారం పది నిమిషాల్లో తమకు చేరుతుందని ఆశించినప్పటికీ... గిగ్ కార్మికుల సంక్షేమం గురించి కూడా ఆలోచించాలని అన్నారు. జొమాటో, స్విగ్గీ, బ్లింకెట్, జెప్టో వంటి ప్లాట్‌ఫామ్‌లు, ఓలా, ఉబర్ వంటి రైడింగ్ సంస్థలు, హోమ్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు చెందిన డెలివరీ సిబ్బందిని 'భారత ఆర్థిక వ్యవస్థలో అదృశ్య చక్రాలు'గా ఆయన అభివర్ణించారు. 'ప్రతిరోజూ మనం మొబైల్ ఫోన్‌లో యాప్‌లో ఒక బటన్‌ను నొక్కితే మీ ఆర్డర్ రాబోతోందని, ఆర్డర్ డెలివరీ చేయబడిందని, మీ రైడ్ వచ్చిందని నోటిఫికేషన్ వస్తుంది. అయితే ఈ నోటిఫికేషన్ వెనుక మనం గుర్తించని ఒక వ్యక్తి ఉంటాడు' అని అన్నారు. త్వరిత వాణిజ్యసంస్థలు, డెలివరీ కంపెనీలు బిలియన్ డాలర్ల విలువలు సాధించడానికి, యూనికార్న్‌లుగా మారడానికి సహాయపడినప్పటికీ, గిగ్ కార్మికుల పరిస్థితి రోజువారీ వేతన కార్మికుల కంటే దారుణంగా ఉందని ఆయన అన్నారు. కార్మికులు వినియోగదారుల ఫిర్యాదుల గురించి నిరంతరం భయపడుతుంటారని, 5-7 నిమిషాలు ఆలస్యమైతే తిట్టడం, బెదిరింపులు వస్తాయని, ఇవి వారి పని తీరుపై, ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు.

బర్త్ సర్టిఫికెట్ల గడువుపై దుష్ప్రచారం: కేంద్రం

న్యూదిల్లీ: జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు 2026 ఏప్రిల్ 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. వాట్సప్‌లో ప్రచారమవుతున్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ తప్పుడు సందేశాన్ని ఎవరూ నమ్మవద్దని కోరుతూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. జనన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్ గానీ, నిర్దేశిత గడువు గానీ జారీ చేయలేదని స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణలేని సమాచారాన్ని షేర్ చేయొద్దని కోరింది. కచ్చితమైన సమాచారం కోసం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలో చెక్ చేసుకోవాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే ఫ్యాక్ట్‌చెక్ విభాగానికి తెలియజేయాలని సూచించింది.

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

- సమాచారం దేవ్‌జీ చెప్పలేదు:
- కలప వ్యాపారుల కుట్రతోనే హత్య
- మావోయిస్టు అగ్రనేత వికల్ప్ లేఖ

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు అగ్రనేత వికల్ప్ పేరుతో ఓ లేఖ శుక్రవారం విడుదలైంది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి తమతోనే ఉన్నారని వెల్లడించింది. లొంగిపోయేలా ఏ ఒప్పందం కుదుర్చుకోలేదని ఈ లేఖ ద్వారా స్పష్టంచేసింది. హిడ్మా సమాచారాన్ని దేవ్‌జీ చెప్పారనేది అవాస్తవమని, ఆయన హత్యకు నలుగురు కారణమని లేఖ పేర్కొంది. హిడ్మా హత్యకు కోసాల్ అనే వ్యక్తి ప్రధాన కారణం కాగా, ఇందులో విజయవాడకు చెందిన కలప వ్యాపారి, ఫర్నిచర్ వ్యాపారి, మరో కాంట్రాక్టర్ హస్తమున్నట్లు తెలిపింది. అక్టోబరు 27న చికిత్స కోసం కలప వ్యాపారి ద్వారా హిడ్మా విజయవాడకు వెళ్లారని, ఆయనను పోలీసులు పట్టుకుని ఎన్‌కౌంటర్ చేశారని లేఖ పేర్కొంది. ఆయన సమాచారాన్ని పోలీసులకు చేరింది కాబట్టే 13 మందిని పట్టుకొని హత్య చేశారని ఆరోపించింది. హత్యను కప్పిపుచ్చేందుకు మారేడుమల్లి రంపచోడవరం ఎన్‌కౌంటర్ల కట్టుకథ అల్లారని విమర్శించింది. హిడ్మా హత్య ఏపీ పోలీసుల ఆపరేషన్‌కాదని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ ఆపరేషన్ అని పేర్కొంది. హిడ్మా ఆశయాలను ముందుకు తీసుకెళతామని మావోయిస్టు అగ్రనేత వికల్ప్ పేర్కొన్నారు. ఏపీలోని మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో పాటు మావోయిస్టు కీలక నేతలు ప్రాణాలు కోల్పోయారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ మావోయిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది.

హైదరాబాద్ వచ్చే విమానానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్: హైదరాబాద్‌కు వచ్చే విమానాలే లక్ష్యంగా వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తోన్న ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈకే526 విమానం దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. ఆ విమానాన్ని పేల్చేస్తామంటూ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఎయిర్‌పోర్ట్ కస్టమర్ సపోర్ట్ కేంద్రానికి ఇ-మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయంలో ఆ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఆ తర్వాత విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అందులో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. గురువారం కూడా హైదరాబాద్‌కు వచ్చే విమానాలు లక్ష్యంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విమానాన్ని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసి... తనిఖీలు చేశారు. షార్జా నుంచి హైదరాబాద్ వస్తున్న మరో విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఆ విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

అల్లిపల్లిలో సర్పంచ్ పదవి 'హస్త' గతం

సర్పంచ్‌గా జమ్ముల రమేష్ ఏకగ్రీవం..
చక్రం తిప్పిన మంత్రి తుమ్మల అనుచరుడు..

విశాలాంధ్ర, దమ్మపేట: జిల్లాలోని దమ్మపేట మండలం వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావు సొంత మండలం. తన ఇలాఖలో మంత్రికి ఇంటింటి పరిచయం వుంది. మండలంలోని గండుగుల పల్లి మంత్రి స్వగ్రామం. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండలం కూడా ఇదే కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఏకగ్రీవ పంచాయతీలు అధికంగా ఉండాలని మంత్రితో పాటు ఎమ్మెల్యే విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కాగా అల్లిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పీఠం వ్యూహాత్మాకంగా కాంగ్రెస్ పార్టీకి ఏకగ్రీవమైంది. జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా ఇప్పటికే గుర్తింపు పొందిన అల్లిపల్లిలో సర్పంచి పదవికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జమ్ముల రమేష్ బరిలో నిలిచారు.

ఈ ఏకగ్రీవ ప్రక్రియలో రాష్ట్ర మంత్రి తుమ్మల ముఖ్య అనుచరుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ కీలక పాత్ర పోషించారని తెలుస్తుంది. తనదైన రాజకీయ శైలితో గ్రామస్తులు, ఇతర పార్టీల నాయకులతో సమన్వయం సాధించి ఎన్నికను ఏకగ్రీవం చేయడంలో ఆయన విశేష కృషి చేశారని తెలుస్తుంది. ఉత్తమ పంచాయతీగా పేరున్న గ్రామంలో ఎలాంటి రాజకీయ వివాదాలు, వృధా ఖర్చులు, పరస్పర ద్వేషాలు, ఉండకూడదని మంత్రి భావించడంతో అతని అనుచరులు ఏకగ్రీవ కార్యాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవానికి కృషి చేసిన ఆలపాటి ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

పినపాక మండలంలో పర్యటించనున్న మంత్రి సీతక్క

విశాలాంధ్ర ,పినపాక : పినపాక లొ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ కార్యకర్తలు నాయకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క శనివారం పినపాక మండలంలో పర్యటించనున్నారు. మల్లారంగ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చందా వరప్రసాద్ బరిలో ఉన్నారు. తన అను చరులు ఒకడైన అతని గెలుపుకోసం ఆమె ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించాలనుకోవడం పార్టీ వర్గాల్లో విశేషంగా మారింది. జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటమే లక్ష్యంగా మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సైతం ఇంటింటి ప్రచారంతో పాటు ప్రజలను ఉద్దేశించి మాట్లాడు తున్న తీరు పెద్ద బలంగా మారి అభ్యర్థుల గెలుపుకు దోహదం చేయనుంది. ఈ ప్రాంత యువకుడైన చందా వర ప్రసాద్ అనేక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటు, ఎవరికి ఏ కష్టం వచ్చినా మంత్రి సీతక్క లేదా ఎమ్మెల్యే పాయం ద్వారా పనులు చేసి పెడుతూ స్థానికుల్లో మంచి పేరు తెచ్చుకున్నాడు. వరప్రసాద్ కు యువకులు మంచి పట్టు ఉంది. ఇతని అభ్యర్థిత్వానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో గెలుపు ఆశలపై ఉన్నాడు. దీనికి తోడు స్వయంగా రాష్ట్ర సీతక్క ఇక్కడ పర్యటనకు వస్తుందటంతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింప నుంది. పార్టీ గెలుపుకోసం కీలకమైన ఈ ప్రచారంలో గ్రామస్థులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల నాయకులు కోరుతున్నారు.

ఎలాంటి మచ్చలేని యువకుడు భూక్యా ప్రవీణ్

విశాలాంధ్ర - బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలోని ప్రతిష్టాత్మకమైన సారపాక పంచాయతీ లొ ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా యువకుడైనా భూక్యా ప్రవీణ్ పోటీలో ఉన్నారు. స్థానికంగా ఆయన పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవలో అందరితో కలిసిపోయి పనిచేసేమనస్తత్వం ఉన్న వ్యక్తిగా పేరుంది. సామాన్య ప్రజలకు వెన్నంటి వుంటూ వారి కష్ట సుఖాల్లో తోడుగా అనేక సందర్భాల్లో ఉన్నారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా గడప గడ పకు తిరుగుతూ తనను సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలని కోరుతున్నారు. తన కు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఇండస్ట్రియల్ పంచాయతీ గా ఉన్న సార పాక ను బహుముఖంగా అభివృద్ధి చేసి చూపెడతానని స్థానికులకు భరోసా ఇస్తున్నారు. నిశ్శబ్దంగా ఉన్న ఓటర్లు తనను గెలిపిస్తారని నమ్మకం ఉందని ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తాను గెలిస్తే ప్రజల కోసం నిజాయితీగా ఉంటూ ఎటువంటి స్వలాభం లేకుండా అందరికీ సేవలందిస్తానని చెప్తున్నారు.

మణుగూరు ఏరియాలో కొప్పుల సందర్శన

విశాలాంధ్ర /మణుగూరు :సింగరేణి సంస్థ డైరెక్టర్ (పి అండ్ పి) కొప్పుల వెంకటేశ్వర్లు అధికార శుక్రవారం మణుగూరు ఏరియాలొ పర్యటన చేసారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో జియం దుర్గం రామచందర్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.డైరెక్టర్ మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా చేయాలని సూచించారు. 2025-26 సంవత్సరపు వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యమైన 76 మిలియన్ టన్నుల ఉత్పత్తికి ఐక్యంగా కృషి చేయాలని కోరారు. అనంతరం జనరల్ మేనేజర్ రామచందర్ తో కలిసి కేసిహెచ్పిలో బెల్ట్ లోడింగ్ సిస్టమ్ ప్రక్రియను, అలాగే ఓసి-2, ఓసి-4, తోపాటు మణు గూరు ఓసి గనిని వ్యూ పాయింట్ ద్వారా సందర్శించారు. మణుగూరు ఏరియా నుండి ఏటా పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిం చటానికి శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తి కూడా ఎంతో అవసర మని డైరెక్టర్ అన్నారు. ఏరియా నుండి అధికోత్పత్తి కి అవసరమైన అన్నీ రకాల వనరులను యాజమాన్యం వెనువెంటనే ఆమోదం తెలుపుతున్నట్లు చెప్పారు. సింగరేణి మొత్తంలో అధికోత్పత్తి సాధనలో అగ్ర భాగంగా నిలిచిన మణుగూరు ఏరియా 2025-26 ఏడాదికి నిర్దేశిత వార్షిక లక్ష్యమైన 115 లక్షల టన్నుల టార్గెట్ ను సాధించదానికి అధికారులు, కార్మికులు, సూపర్ వైజర్లు సమిష్టి కృషి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం (సర్వే) ఎస్. రాఘవేంద్ర రావు, ఎస్ఓటు జిఎం బి. శ్రీనివాస చారి, ప్రాజెక్ట్ అధికారి ఎం. రమేశ్, డిజిఎం ఆర్ ఎస్ గౌడే, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరభద్ర రావు, మేనేజర్లు సురేశ్ కుమార్, రమణ రెడ్డి, టైరెడ్డి వెంకటేశ్వర్లు, సర్వే అధికారి ఎల్. దయాకర్, సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

భూపాలపట్నం పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



విశాలాంధ్ర-పినపాక: పాఠశాలలో విద్యార్థులు హాజరుపెంచడంతో పాటు, నాణ్యమైన విద్య, భోజనం అందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఈఓ నాగలక్ష్మి ఆదేశిం చారు. శుక్రవారం పిన పాక మండలంలో భూపా ల పట్నం పాఠ శాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఫ్ ఎల్ ఎన్ లో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పేరెంట్, టీచర్స్ మీటింగ్, మినిట్స్ బుక్స్, పిల్లల తరగతి వారీగా సామర్థ్యాలను పరిశీలించారు. బుక్స్, లైబ్రరీ రిజిస్టర్ తో తోపాటు పాఠశాలలొ పలు రికార్డ్స్ పరిశీలించారు. విద్యార్థుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల స్ఫూర్తితో సేవా మార్గం

వనవాసీకు రిఫ్రిజరేటర్ అందచేసిన జవ్వాది బ్రదర్స్

విశాలాంధ్ర - చర్ల: తల్లిదండ్రులు అందించిన స్ఫూర్తితో సేవా మార్గాన పయనించడం అభినందనీయమని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ గౌరవ సలహాదారులు బివి ఎస్ఎల్ నరసింహారావు అన్నారు. చర్లకు చెందిన ఆదర్శ రైతు జవ్వాది జయకుమార్ అలియాస్ జయబ్బాయి సతీమణి జవ్వాది సాయిలక్ష్మి నాలుగవ వర్ధంతి సందర్భంగా వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయానికి వారి కుమారులు వెంకటేశ్వరబాబు, నరేంద్ర బాబు, రవికుమార్, సత్యనారాయణ, మురళీకృష్ణ లు రిఫ్రిజిరేటర్ అందించారు. దింతోపాటు విద్యార్థులకు భోజన ఏర్పాట్లు, స్వీట్స్, పండ్లను కూడా ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బివిఎస్ఎల్ నరసింహారావు పాల్గొని మాట్లాడారు. జయకుమార్, సాయిలక్ష్మి దంపతులు అనేక మంది పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందచేసి అభ్యున్నతికి తోడ్పడాలని తెలిపారు. ఈ దంపతుల సహకారంతో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, దాక్టర్లు గా స్థిర పడ్డారని గుర్తుచేసారు. తల్లిదండ్రులు అందించిన స్ఫూర్తిని పునికిపుచ్చుకొని కుమారులు అదే బాటలో పయనించడం అభినందనీయమన్నారు. ఆర్థిక సహాయం చేసే సామర్థ్యం ఉన్నా అనేక మంది ఈ రోజుల్లో అవసరార్థులను ఆదుకోవడానికి ముందుకు రావడం లేదని అలాంటి సందర్భంలో ఇలాంటి వాళ్లు చేసిన సహాయం చాలాగొప్పదన్నారు. జయకుమార్ కుమారులు వనవాసీ సంస్థతో పాటు ఇతర అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. గోదావరి వరదల సమయంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు రూ. లక్ష విలువచేసే గిన్నెలు, ఇతర సామగ్రి అందచేసి మానవత్వం చాటుకున్నారని తెలిపారు. భద్రాచలం డివిజన్ లో ఎవరూ చేయని విదంగా పలు గిరిజన గ్రామాలకు చెందిన 40 మందికి పైగా ఆదివాసీ గర్భిణి స్త్రీలకు సామూహిక శ్రీమంతాల కార్య క్రమం చేపట్టి గొప్ప ఆదర్శానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఎంతో విలువైన భూమిని సంస్థకు ఇవ్వడమే కాకుండా విద్యార్థుల అవసరా లను గుర్తించి పరుపులు, ట్రంక్ పెట్టెలు, కన్వ ర్టర్, బ్యాటరీ, భోజన సదుపాయాలు, విద్యా ర్థులకు అవసరమైన దుస్తులను పంపిణీ చేసి దాతృత్వం చాటుకున్నారన్నారు. వనవాసీ ప్రాంత మహిళా సహప్రముఖ్ పెద్దాడ ఆశాలత, గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపాల్ హెచ్ జి వి ప్రసాద్, ఎకడమిక్ కో ఆర్డి నేటర్ మల్లాది సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న జవ్వాది కుటుంబ సభ్యులను అభినందించారు. ఎటువంటి సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు వారి అవసరాలకు అనుగుణంగా కావాల్సిన వస్తువులను సమకూర్చడం ఎంతో పుణ్య కార్యక్రమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్విని యోగం చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది కుటుంబ సభ్యులు జవ్వాది రవికుమార్, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, పామర్తి కౌశిక్, వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, కొమరం భీం విద్యార్థి నిలయ కమిటి అధ్యక్షుడు తాటి పాపా రావు, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, బందా స్వరూపరాణి, లవన్ కుమార్ రెడ్డి, పాశికంటి శ్రీదేవి, గొందిప్రసన్నకుమారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి కిషోర్ శివరాంకు మిత్రపక్షాల మద్దతు

విశాలాంధ్ర - బూర్గంపాడు : మండలంలోని మేజర్ పంచాయతీ అయినా సారపాక లో కాంగ్రెస్ పార్టీ సహకారం తొ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న కిషోర్ శివరాం నాయక్ కు మిత్రపక్షాలు మద్దతు తెలిపాయి. తెలుగుదేశం పార్టీ, ఐటీసీ టిఎన్టియుసి యూనియన్, ఇతర మిత్రపక్షాలు సంపూర్ణ మద్దతు వెల్లడిస్తూ శుక్రవారం సమావేశం నిర్వహించాయి. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరి జగదీశ్వరరావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతు సారపాక మేజర్ గ్రామపంచాయతీలొ పోటీ చేస్తున్న గుగులోత్ కిషోర్ నాయక్ ను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ కి ఉప సర్పంచ్ అభ్యర్థి కి అవకాశం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. టి ఎన్ టియుసి రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, గల్లా నాగభూసయ్య, ఐటీసీ యూనియన్ ప్రెసిడెంట్ కనకమేడల హరిప్రసాద్, జనరల్ సెక్రటరీ గాదె రామకోటి రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ కరి రాజేంద్ర ప్రసాద్? ఈ సమావేశంలో మాట్లాడారు. కిషోర్ గెలుపులు ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి చెందా లంటే కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థి కిషోర్ ను అత్యధిక మెజార్టీతో గెలిచాలని స్థానిక ప్రజలను కోరారు. ప్రజల సొమ్మును ప్రజల కోసం ఖర్చు చేసే నాయకులను ఎన్నుకుందామన్నారు. గతంలో కొందరు నాయకులు పంచాయితీ సొమ్మును పెద్దఎత్తున కాజేసి, కోర్టులొ శిక్ష లు పడ్డవారిని, 10 ఏళ్ళు మొహం చాటేసిన వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కన్నీదారి రమేష్, కర్రి వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల త్యాగాలు చిరస్మరణీయం

వేలాది మంది ముస్లిం గురువులు బలిదానాలకు వెనకాడేదిలేదు : మౌలానా ముఫ్తీ యాకూబ్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఆనాటి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లిం సమాజం యావత్తు నిటారుగా నిలబడి ఎన్నో త్యాగాలు చేసిందని జామియా మస్జిద్ ఇమామ్ మౌలానా ముక్తి యాకూబ్ స్పష్టం చేశారు. ఆనాటి దేశద్రోహులు నేడు ముస్లింలను ద్రోహులుగా చిత్రించేందుకు ఎన్నో కుట్రలు పన్నుతున్నారని అయినప్పటికీ ముస్లిం సమాజం సోదర భావాన్ని కోరుకుంటుందని వివరించారు. స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ ప్రభుత్వానికి తలోగ్గకుండా ముస్లిం మత గురువులు వేలాదిమంది ఉరికంబాలను ముద్దాడారని, ఆ సైన్యం కురిపించిన తూటాలకు ఎదురొడ్డి గుండెలు చూపి వీర మరణం పొందారని ఈ చరిత్రను ఎన్ని కుట్రలు చేసిన ఎవరు చెరపలేరని ఆయన స్పష్టం చేశారు. పవిత్ర శుక్రవారం ప్రార్థనలకు ముందు ఆయన చారిత్రక ఘట్టాలను ప్రసంగించారు. ఆనాటి స్వేచ్ఛ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముస్లిం సమాజం నేడు అన్ని రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆ ఉద్యమంలో ముస్లింల పాత్ర ఎంతో కీలక మైనప్పటికి నేడు తమను దేశంలో అంటరాని వాళ్లుగా, దేశద్రోహులుగా చిత్రించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలోని ప్రజలకు ఉదారమైన సేవలందిస్తూ, సోదర భావంగా వుంటూ త్యాగాలు చేయాలని ఇస్లాం బోధిస్తుందని తెలిపారు. సర్వ సృష్టికర్త అయిన ఒకే అల్లాను నమ్మే సమాజం తమదన్నారు. పరమత ద్వేషం ప్రజలపై హింసను ఇస్లాం ఏమాత్రం అనుమతించదన్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో హిందూ, ముస్లిం, శిఖ్, ఈసాయి ఐక్యతే ప్రధాన శక్తి గా మారి బ్రిటిష్ పాలనను కూకటి వేళ్ళతో పెకలించాయని చరిత్రను వివరించారు. నేటితరం హిందూ, ముస్లిం యువకులు భారత దేశ చరిత్రను, స్వాతంత్ర పోరాటాలను అధ్యయనం చేయాలని కోరారు. చరిత్ర చదివినప్పుడే అపోహలు తొలగి కొందరు చేసే దుష్ప్రచారాన్ని పసిగట్టగలరని ఆయన స్పష్టం చేశారు. ఆనాటి ఉద్యమంలో ముస్లిం సమాజం యావత్తు రాజకీయంగా, ఆర్థికంగా, విప్లవ సాహిత్య పరంగా, పత్రికా రంగంలోను అనేక విధాలుగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. 1857 సిపాయి తిరుగుబాటులో ముస్లిం సైనికులు, పండితులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారన్నారు. ఈ పోరాటంలో గొప్ప పేరున్న, ఆర్థిక వనరులున్న ఉలేమాలైన (పండితులు) మౌలానా హిఫ్జుల్ రెహ్మాన్, షేక్. మేహేముద్ హాసన్, షేక్. హుస్సేన్ అహ్మద్ మదని, అబుల్ కలాం ఆజాద్ లాంటి వేలాది మంది బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో జీవితాలను త్యాగం చేసారని గుర్తు చేసారు. బ్రిటిష్ పాలనకు తలొగ్గని హైదర్ అలీ, టిప్పుసుల్తాన్ లాంటి గొప్ప యోధులు, అలాగే సిరాజుద్దౌలా, బహదూర్ షా జఫర్ , షౌకత్ అలీ మహమ్మద్ అలీ బ్రదర్స్ , ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ (బుడా ఖాన్) అహింసా సిద్ధాంతంతో స్వాతంత్ర్య పోరాటం సాగించిన గొప్ప నాయకులన్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించి గాంధీజీతో కలిసి ఎంతో మంది ఉలేమాలు ఆందోళన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, అద్భుతమైన వక్త, స్వతంత్ర ఆలోచనకర్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ఆజాద్ దేశం రక్షణకు ఎన్నో రకాల ఆవిష్కరణలు చేసి ప్రపంచంలో దేశ ఖ్యాతిని చాటారన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులు నేటి తరానికీ ఆదర్శమన్నారు. నేడు కూడా దేశ సమగ్రత సమరస్యాన్ని కాపాడుకోవడంలో ముందుంటానని ఈ సందర్భంగా స్పష్టం చేసారు.

అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతున్న గ్రామ ప్రజలు

ప్రచారంలో ముందున్న యువ నేత కిషోర్

విశాలాంధ్ర- బూర్గంపాడు : మండలంలోనే కీలక గ్రామపంచాయతీ గా ఉన్న సారపాక లొ విజయం కోసం అధికార, ప్రతిపక్ష సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుతో యువ నాయకుడు కిషోర్ సారపాక పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అధికార కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కిషోర్ గెలుపుకు బాటలు వేస్తాయని స్థానికంగా విశ్లేషకులు భావిస్తున్నారు. యువ నేత కావడంతో ప్రజలందరితో కలువిడిగా ఉండే కిషోర్ అందరికి సుపరిచితులు. తనను గెలిపిస్తే గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తానని ఇంటింటికి తిరిగి ప్రచారం చేసున్నారు. జిల్లాలోనే మోడల్ పంచాయతీ గా తీర్చిదిద్దుతానని భరోసా ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పేపర్ బోర్డ్ రాష్ట్రంలోనే కాకా దేశంలోనే చాలా ప్రాధాన్యత ఉన్న పరిశ్రమ. దీంతో ఈ పంచాయతీ మండలంలోనే చాలా ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిషోర్ గెలుపు ఖాయమంటూ ఆయనకు మద్దతిస్తున్న కాంగ్రెస్ నాయకులు, యువకులు, మహిళలు అంటున్నారు. గతంలో ఈ గ్రామ సర్పంచులుగా పదవిలో ఉన్నవారు అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేసారని విమర్శలు వున్నాయి. దింతో స్థానిక ప్రజల్లో అసంతృప్తి ఉంది.

కవలం పైరవీలకే పరిమితమై స్థానిక సమస్యలను గాలికి వదిలారని విమర్శలు కూడా ఉన్నాయి. దీంతో మార్పు కావాల్సిందేనని స్థానికంగా చర్చలు గట్టిగా వినిపిస్తుంది. తమ కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ ప్రాంతంలో పేద ప్రజలకు ఇందిరమ్మఇల్లు మంజూరు చేసిందని కిషోర్ అంటున్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు తో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సరఫరా పేద మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఉపయోగంగా మారిందని మారిందనీ చెప్పారు. ఒకసారి సర్పం చ్ గా అవకాశం ఇస్తే వాగ్దానం ప్రకారం సమగ్ర అభివృద్ధి స్థానిక యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారని కిషోర్ భరోసా ఇస్తున్నారు.

రియల్‌మీ పీ4ఎక్స్ స్మార్ట్‌ఫోన్, వాచ్5 విడుదల

న్యూఢిల్లీ: భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన యువత స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన రియల్‌మీ పీ సిరీస్, తాజాగా సెగ్మెంట్‌లోని అత్యంత వేగవంతమైన 7000ఎంఏహెచ్ పయనీర్ అయిన రియల్‌మీ పీ4ఎక్స్, ఆప్టిమస్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (ఓఈఎల్) సహకారంతో నిర్మించిన బ్రాండ్ సరికొత్త మేక్ ఇన్ ఇండియా స్మార్ట్‌వాచ్ రియల్‌మీ వాచ్ 5 లను ప్రారంభించడంతో దాని స్మార్ట్‌ఫోన్, ఏఐఓటీ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేసింది. ఈ ఉత్పత్తులు కలిసి, శక్తివంతమైన రోజువారీ పనితీరు, అర్థవంతమైన ఏఐ సామర్థ్యాలు, వర్గాలలో డిజైన్-ఫస్ట్ ఆవిష్కరణలను అందించే రియల్‌మీ దృష్టిని సూచిస్తాయి. రియల్‌మీ పీ4ఎక్స్‌తో, మల్టీ టాస్క్, అధ్యయనం, గేమ్, ప్రయాణంలో సృష్టించే యువ వినియోగదారుల కోసం రూపొందిం చబడిన చిప్‌సెట్ సామర్థ్యం, బ్యాటరీ ఎండ్యూరెన్స్ మరియు ఏఐ-ఆధారిత ఉత్పాదకతలో రియల్‌మే పురోగతి నవీకరణలను తెస్తుంది. రియల్‌మీ వాచ్ 5, కొత్త డిజైన్‌లో ఉన్నతమైన ఫిట్‌నెస్, ఆరోగ్యం, కమ్యూనికేషన్ అనుభవాన్ని అందిస్తుంది. రియల్‌మీ పీ4ఎక్స్ మొదటి అమ్మకం డిసెంబర్ 10, మధ్యాహ్నం 12 గంటలకు మాత్రమే ప్రారంభమవుతుంది, రియల్‌మీ.కామ్, ఫ్లిప్‌కార్ట్, మెయిన్‌లైన్ ఛానెల్‌లలో రూ.2,500 విలువైన ఆఫర్‌ల తర్వాత రూ13,49 నుండి ప్రారంభమవుతుంది.

వైజాగ్‌లో సొంత నేచురల్స్ ఐస్ క్రీం అవుట్‌లెట్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : నేచురల్స్ ఐస్ క్రీం విశాఖపట్నంలో అధికారికంగా తన మొదటి అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. ఇది బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది. ఈ ప్రారంభానికి నగరం నుండి బలమైన, ఉత్సాహభరితమైన స్పందన లభించింది. ఈ ప్రాంతంలో నేచురల్స్ రుచులు ఎంతగా మిస్ అయ్యాయో సూచిస్తుంది. దశాబ్దాలుగా, నేచురల్స్ పండ్లు, పాలు, చక్కెర అనే మూడు పదార్థాలతో తయారు చేసిన దాని ఆర్టిసానల్ ఫ్రూట్ ఐస్ క్రీంలకు ప్రసిద్ధి చెందింది. సీతాఫల్, టెండర్ కొబ్బరి, చికూ మరియు క్లాసిక్ మలై వంటి దాని అత్యంత ప్రియమైన రుచులలో కొన్ని ఇప్పటికే కొత్త అవుట్‌లెట్‌లో సందర్శకులలో ప్రారంభ ఇష్టమైనవిగా ఉద్భవించాయి. వాటి గొప్ప ఆకృతి మరియు నిజమైన పండ్ల మంచితనానికి ప్రసిద్ధి చెందిన ఈ రుచులు బ్రాండ్ దేశవ్యాప్తంగా ప్రజాదరణకు పునాదిగా కొనసాగుతున్నాయి. అంతేకాకుండా, వైజాగ్‌కు నేచురల్స్‌తో దీర్ఘకాల సంబంధం ఉంది. సంవత్సరాలుగా, ముంబై, హైదరాబాద్ లేదా బెంగళూరు నుండి ప్రయాణించే స్నేహితులు మరియు బంధువులను థర్మోకోల్ పెట్టెల్లో ప్యాక్ చేసిన నేచురల్స్ ఐస్ క్రీంలను తీసుకురావాలని కుటుంబాలు కోరారు, తద్వారా వారు అసలు రుచిని ఇంటికి తిరిగి ఆస్వాదించవచ్చు.

విద్యార్థులను ఒకచోట చేర్చిన శామ్‌సంగ్ ఎస్‌ఎఫ్‌టీ

విశాలాంధ్ర-ముంబయి : కృత్రిమ మేధస్సు ఇప్పుడు భారతదేశ డిజిటల్ పరివర్తనకు కేంద్రంగా ఉంది. డ్రైవింగ్ భద్రత, ప్రాప్యత మరియు రోజువారీ సాధికారత. ఈ మార్పును ప్రతిబింబిస్తూ, శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో (ఎస్‌ఎఫ్‌టీ) 2025, ఐఐటీ ఢిల్లీ సహకారంతో, "సురక్షితమైన, తెలివైన, సమ్మిళిత భారత్ కోసం ఏఐ" అనే థీమ్ కింద వాస్తవ ప్రపంచ ఏఐ పరిష్కారాలను రూపొందించడానికి దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులను ఒకచోట చేర్చింది. ఈ సంవత్సరం థీమ్ "సురక్షితమైన, తెలివైన, సమ్మిళిత భారత్ కోసం ఏఐ" నుండి ముఖ్య ముఖ్యాంశాలు ఏమిటంటే, సామాజిక ప్రభావంపై దృష్టి సారించిన థీమ్, ది ఇన్నోవేటర్స్ అండ్ దేర్ బ్రేక్‌త్రూస్ వంటివి వున్నాయి. థీమ్ విజేతగా పెర్సెవియా నిలిచింది. బెంగళూరు విద్యార్థి తుషార్ షా నేతృత్వంలోని పెర్సెవియా అనే ఈ థీమ్ కింద అగ్రశ్రేణి బృందం - వస్తువు గుర్తింపు, స్థాన-ఆధారిత మార్గదర్శకత్వాన్ని అందించే ఏఐ-ఆధారిత గ్లాసెస్‌ను సృష్టించింది జాతీయ విజేతలుగా నెక్స్‌ప్లే, పారస్పెక్, పృథ్వీ రక్షక్ నిలిచాయి. విజేతలు ఐఐటీ ఢిల్లీలో కోటి వరకు ఇంక్యుబేషన్ మద్దతును అందుకున్నారు.

అమెజాన్.ఇన్ హాలిడే టాయ్ లిస్ట్ స్టోర్ అతి పెద్ద డీల్స్

బెంగళూరు: పండగల టాయ్ గమ్యస్థానంగా హాలిడే టాయ్ లిస్ట్ 2025 ఎడిషన్ ను అమెజాన్.ఇన్ ప్రకటించింది. లెగో, బార్బీ, హాట్ వీల్స్, నెర్ఫ్, ఫన్ స్కూల్, మరియు మ్యాటెల్ గేమ్స్ సహా ప్రముఖ బ్రాండ్స్ లో 10 లక్షలు పైగా బొమ్మల కలక్షన్ నుండి కూర్చిన 10,000కి పైగా డీల్స్ ను ఈ విస్తారమైన ఎంపిక కలిగి ఉంది. హాలిడే టాయ్ లిస్ట్ ఎంపికలో బిల్డింగ్ సెట్స్, బోర్డ్ గేమ్స్, ఎడ్యుకేషనల్ టాయ్స్, రిమోట్-కంట్రోల్ వాహనాలు, బొమ్మలు, పజిల్స్, మరియు ఇంకా ఎన్నో ఉన్నాయి- చిన్న పిల్లలు, జూనియర్లు, వయోజనులు, యుక్త వయస్సులో ఉన్న వారికి ఇవి ఉపయోగకరమైనవి. కొత్త ఆవిష్కరణలు, పరిమిత-ఎడిషన్ కలక్టిబుల్స్ కు ముందస్తు యాక్సెస్ తో పాటు హాలిడే సీజన్ తారా స్థాయిలో ఉన్న సమయంలో ప్రైమ్ సభ్యులు ఉచితంగా అదే రోజు, మరుసటి రోజు డెలివరీలను ఆనందించవచ్చు. స్పాంజ్ బాబ్, డోరేమాన్, హలో కిట్టీ, స్మర్ఫ్, లెగో వెడ్ నస్ డే మరియు ఫార్ములా 1 కలక్టిబుల్స్, ఇన్ సైడ్ అవుట్, లిలో, స్టిచ్ సహా ఉత్తేజభరితమైన కొత్త క్యారక్టర్ కలక్షన్స్ ను ద హాలీడే టాయ్ లిస్ట్ చూపిస్తుంది, ఇంకా అన్ని వయస్సుల వారి కోసం యాక్షన్ రూపాలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, ఎడ్యుకేషనల్ టాయ్స్, పార్టీ సప్లైస్, మరియు బయట ఆడుకునే సామగ్రి కోసం ప్రత్యేకమైన విభాగాలతో ఎల్లప్పుడూ ఫేవరెట్లుగా నిలిచిన మార్వెల్, డిస్నీ ఫ్రోజెన్, స్టార్ వార్స్, హ్యారీ పాటర్, ట్రాన్స్ ఫార్మర్స్, పోకిమన్, పెప్పా పిగ్, మరియు పా పెట్రోల్ వంటివి కూడా దీనిలో లభిస్తాయి.

కాయిన్ స్విచ్ మొట్టమొదటి వీడీఏ హ్యాండ్ బుక్ విడుదల

ముంబయి: భారతదేశపు అతిపెద్ద క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ అనగానే ప్రతీ ఒక్కరికీ గుర్తుకువచ్చేది కాయిన్ స్విచ్. ఇప్పటికే ఎంతోమంది వినియోగదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న కాయిన్ స్విచ్.. తాజాగా వర్చువల్ డిజిటల్ అసెట్స్ డీకోడెడ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో భారతదేశంలో చట్టాలను అమలు చేసే సంస్థలు, సైబర్ క్రైమ్ యూనిట్లు మరియు విధాన రూపకర్తలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. అంతేకాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న వీడీఏ పర్యావరణ వ్యవస్థ ద్వారా నావిగేట్ చేయడంలో సహాయపడటానికి రూపొందించబడిన భారతదేశం మొట్టమొదటి సమగ్ర హ్యాండ్ బుక్ గా దీన్ని చెప్పవచ్చు. భారతదేశం అంతటా క్రిప్టో స్వీకరణ వేగవంతం అవుతుంది. దీంతో పోలీసులు మరియు సైబర్ క్రైమ్ యూనిట్లు డిజిటల్ ఆస్తులతో కూడిన సంక్లిష్ట కేసులను ఎదుర్కొంటున్నాయి. ఈ అత్యవసర అవసరాన్ని గుర్తించి, కాయిన్ స్విచ్ వీడీఏ భావనలను సరళీకృతం చేయడానికి, ఆన్-గ్రౌండ్ దర్యాప్తులకు ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించడానికి హ్యాండ్‌బుక్‌ను అభివృద్ధి చేసింది.

గ్లోబల్ టాలెంట్ మైగ్రేషన్ తగ్గుదల భారత్‌కు లాభదాయకం: బీసీజీ

న్యూఢిల్లీ: గ్లోబల్ టాలెంట్ ల్యాండ్‌స్కేప్ ఇటీవలి సంవత్సరాలలో అత్యంత పదునైన మార్పులకు లోనవుతోంది. ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, నిర్బంధ వలస చట్రాలు చలనశీలత ధోరణులను పునర్నిర్మించడంతో, సరిహద్దుల గుండా ఒకప్పుడు స్థిరంగా ఉన్న అధిక నైపుణ్యం కలిగిన నిపుణుల ప్రవాహం మందగిస్తోంది - దేశాలు, కంపెనీలు ప్రతిభను ఎలా ఆకర్షిస్తాయో పునరాలోచించవలసి వస్తుంది. బీసీజీ "గ్లోబల్ టాలెంట్ మొబిలిటీ ఈజ్ స్లోయింగ్ అండ్ షిఫ్టింగ్" అనే కొత్త నివేదికను ప్రారంభించింది. నివేదిక ప్రకారం, 2020 తర్వాత అత్యధిక నైపుణ్యం కలిగిన కార్మికుల ప్రపంచ ఉద్యమం మొదటిసారిగా పడిపోయింది, అంతర్జాతీయ చలనశీలత 8.5% వార్షికంగా తగ్గింది - 220,000 తక్కువ క్రాస్-బోర్డర్ కెరీర్ కదలికలు. అయితే, ప్రపంచ ప్రతిభ యొక్క భౌగోళికం తీవ్రంగా మారుతోంది. భారతదేశం ప్రపంచ తిరోగమనాన్ని ధిక్కరిస్తోంది. కెనడా, యూకే, విస్తృత యూరప్ వంటి ఆర్థిక వ్యవస్థలు కఠినమైన వలస విధానాలు, బలహీనమైన నియామకాల కారణంగా పెద్ద క్షీణతలను చూస్తున్నప్పటికీ, భారతదేశం అన్ని ట్రాక్ చేయబడిన ప్రతిభ వర్గాలలో పెరుగుతోంది.